# జనబలం

ప్రజలే ప్రభువులు

సెప్టెంబర్ 2024 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-

## యూపీఎస్- ఆర్థిక క్రమశిక్షణకు మార్గం కావాలి

Cabinet Approves

**UNIFIED PENSION SCHEME**

## భారత్ సంపన్న దేశమవటం సాధ్యమా?



## లోక్‌సత్తా పార్టీ వరద సహాయ నిధి, పౌరసమాజం ఉదారంగా విరాళాలివ్వాలని జేపీ విజ్ఞప్తి





# విద్యలో నైపుణ్యాలు కీలకం

విద్యతోపాటు నైపుణ్యాలను పెంచుకోవటంపై విద్యార్థులు దృష్టి సారించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు, అక్షయ విద్య ఫౌండేషన్ సలహాదారు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో 500 మంది విద్యార్థులకు ప్రవేశాలు ఇప్పించడంలో ఫౌండేషన్ కృషి అభినందనీయమన్నారు.

గురుకుల విద్యాలయాల్లో ప్రవేశం పొందిన పేద విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులను తెలంగాణ డీజీపీ కార్యాలయంలో సత్కరించారు.

నిరుపేద విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అక్షయ విద్య ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని డీజీపీ జితేందర్ ప్రశంసించారు. తాను ప్రభుత్వ పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడు ఎదురైన అనుభవాల్ని ఈ సందర్భంగా పంచుకున్నారు. బస్తీల్లోని విద్యార్థులకు మెరుగైన జీవితం అందించే తమ ప్రయత్నానికి పోలీస్ శాఖ అందిస్తున్న సహకారం మరువలేనిదని ఫౌండేషన్ వ్యవస్థాపకులు వరప్రసాద్ పేర్కొన్నారు. నగరవ్యాప్తంగా 120 కేంద్రాల ద్వారా సుమారు 3000 మంది విద్యార్థులకు బోధన అందించామన్నారు.

కార్యక్రమంలో ఐజీపీ ఎం.రమేష్, వయట్రిస్ కంపెనీ ఇండియన్ సీఎస్ఆర్ హెడ్ మిచెల్లా డొమినికా, ఫౌండర్ ట్రస్టీ జనార్దన్, సంఘమిత్ర స్కూల్ వ్యవస్థాపకురాలు అరుంధతి, హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.





ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక


సెప్టెంబర్ 2024

సంపుటి 26 సంచిక 09


**జనబలం చందా రుసుము వివరాలు**

| | | |
|---|---|---|
| సంవత్సర చందా | : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | : | రూ. 1200.00 |


**సంపాదకవర్గం**

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

**వర్కింగ్ ఎడిటర్**

దూసనపూడి సోమసుందర్




*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*


**చందాదారులకు విజ్ఞప్తి**

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

**కార్టూన్ కార్నర్**





05 రెండు కల్లోలాల కథ - బ్రిటన్, బంగ్లాదేశ్

07 యూపీఎస్ - ఆర్థిక క్రమశిక్షణకు మార్గం కావాలి

12 భారత్ సంపన్న దేశమవటం సాధ్యమా?

26 ప్రాథమిక స్థాయి నుండి విద్యాప్రమాణాలు

28 ప్రగతి కోసం మతం



కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యూయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949

Email: accountsdept@loksatta.org

# లోక్‌సత్తా పార్టీ వరద సహాయ నిధి,
# పౌర సమాజం ఉదారంగా విరాళాలివ్వాలి

ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో గత 120 సంవత్సరాలలోనే అరుదైన వర్షాలు బీభత్సం సృష్టించాయి. ఇలాంటి ఉపద్రవం వచ్చినప్పుడు ప్రభుత్వం, యంత్రాంగం ఎంత చిత్తశుద్ధితో పనిచేస్తున్నా, సమాజంగా మనందరం కూడా ఉదారంగా సహాయం అందించేందుకు ముందుకు రావాలి. అందుకే లోక్‌సత్తా పార్టీ తన వంతు ప్రయత్నం చేస్తోంది. తెలుగు రాష్ట్రాల్లో వరద బీభత్స బాధితుల సహాయం కోసం లోక్‌సత్తా పార్టీ తరపున అకౌంట్‌ని ఏర్పాటు చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో పునరావాస, సహాయ చర్యలకు పౌర సమాజం నుంచి వచ్చే నిధులను సద్వినియోగం చేయటానికి లోక్‌సత్తా చేస్తున్న ప్రయత్నంతో మీరంతా కలిసి రండి.

**దాతలు విరాళాల్ని పంపించాల్సిన వివరాలు**

**UPI లేదా చెక్కు ద్వారా మీరిచ్చే విరాళాల్ని లోక్‌సత్తా పార్టీ అకౌంట్‌కి పంపగలరు.**

**యూపీఐ ద్వారా విరాళాలు ఇవ్వటానికి:**

UPI ID: loksattapartyrelieffund@sbi
Account Number: 62109367386
IFSC Code: SBIN0020072
Bank : State Bank of India, Punjagutta, Hyderabad

**చెక్కు ద్వారా విరాళాలు ఇవ్వటానికి:**

Bank Cheque in the favour of: LOK SATTA PARTY
Post Box No. 100, Khairatabad Post Office, Pin Code: 500 004, Hyderabad

### మీ వివరాల్ని తప్పకపంపండి

మీ చిరునామా, ఇ-మెయిల్, పోస్టల్ అడ్రస్, ఫోన్ నంబర్‌తోపాటు మీరిచ్చిన విరాళం స్క్రీన్‌షాట్‌ని 98660 74025కి తప్పనిసరిగా పంపగలరు. మీకు మూడు డాక్యుమెంట్లు అందుతాయి.

1) జేపీ సంతకం ఉన్న ధృవీకరణ
2) మీరిచ్చిన విరాళాలకు రసీదు
3) వంద శాతం పన్ను మినహాయింపు సర్టిఫికెట్


### ప్రతి రూపాయి సద్వినియోగానికి బాధ్యత

మీరిచ్చే విరాళాల్లో ప్రతి రూపాయినీ సద్వినియోగం చేసే బాధ్యత నాది. కేవలం తాత్కాలిక సాయం కాకుండా, ఏపీ, తెలంగాణల్లో ఎన్నిచోట్ల వీలయితే అన్నిచోట్ల దీర్ఘకాలిక అభివృద్ధికి ఆ వనరుల్ని వినియోగించి కొంతమందికైనా ఆదర్శంగా నిలిచేలా ఫలితాల్ని చూపుదాం.

**–డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**
**ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు**

# రెండు కల్లోలాల కథ - బ్రిటన్, బంగ్లాదేశ్

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



శాంతియుత నిరసన హక్కు ప్రజాస్వామ్యంలో అంతర్భాగం. శాంతిభద్రతల పరిరక్షణ ప్రభుత్వ మొట్టమొదటి బాధ్యత. ప్రజల నిరసన హక్కుని, ప్రభుత్వ శాంతిభద్రతల బాధ్యతను సమన్వయం చేయటం కొన్ని సందర్భాల్లో పెనుసవాలవుతుంది. ప్రజాస్వామ్య బ్రిటన్‌లో, అర్థ-నియంతృత్వ బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న కొన్ని సంఘటనలు ఆ ప్రక్రియ, ఫలితాల మధ్య ఎంత విస్పష్ట అంతరం ఉందో తెలియచేస్తాయి. బ్రిటన్ సౌత్‌పోర్ట్‌లో పాశవిక సామూహిక కత్తిపోట్ల వల్ల ముగ్గురు పిల్లలు మృతి చెందగా, మరో ఎనిమిదిమంది పిల్లలు, ఇద్దరు వ్యక్తులు గాయాలపాలయ్యారు. ఈ భయానక నేరం పలు నగరాల్లో వరుస అల్లర్లకు దారితీసింది. సోషల్ మీడియాలో వెల్లువెత్తిన తప్పుడు సమాచార ప్రచారం ఇందుకు కారణమైంది. నేరస్తుడు రువాండా నుంచి వలస వచ్చిన తల్లిదండ్రుల పదిహేడేళ్ల కుమారుడు. కానీ అతనో ముస్లిం వలసదారుడు అని నకిలీ వార్తలు కారుచిచ్చులా వ్యాపించాయి. చట్టవిరుద్ధ వలసలు, ఇస్లామిస్ట్ తీవ్రవాదం పట్ల నెలకొన్న ఆగ్రహం, పెద్దసంఖ్యలోని ఓ వర్గంలో వలసకారుల పట్ల పాతుకుపోయిన వ్యతిరేకత అనేకచోట్ల హింసాత్మక ప్రతిఘటనలకు దారితీశాయి. జాతి విద్వేషం, ఆర్థిక అభద్రతలు, తీవ్రవాద భయం, సంస్కృతుల మధ్య ఘర్షణ, నకిలీ వార్తలు కలగలిస్తే విస్ఫోటనంగాక ఏమవుతుంది!

బ్రిటన్‌లో పరిస్థితిని రోజుల వ్యవధిలోనే చాలావరకు నియంత్రించారు. శాంతిభద్రతల్ని పునరుద్ధరించారు. పోలీసు సిబ్బంది గొప్ప వృత్తినైపుణ్యాన్ని ప్రదర్శించారు. సమర్థంగా, నిష్పాక్షికంగా వ్యవహరించారు. ప్రజల మన్ననల్ని పొందారు. పోలీసు బలగాలు కీలకమేగానీ, వారితోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యం కాదు. బ్రిటన్ ప్రజలు ఒక సమాజంగా జాతి విద్వేషాన్ని తిరస్కరించారు. ప్రధానమంత్రి కీత్ స్టార్మర్, ఆయన లేబర్ ప్రభుత్వం మితవాద, మధ్యేమార్గ రాజకీయవాది. విభిన్న ప్రయోజనాల మధ్య సమతూకం గావించేవారు. ప్రభుత్వానికి ప్రజాస్వామిక చట్టబద్ధత ఉంది. ప్రతిపక్షం విజ్ఞతతో వ్యవహరించి శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచాయి. ప్రధాన స్రవంతి మీడియా గొప్ప బాధ్యతాయుత వైఖరిని, నియంత్రణను పాటించింది. వందలాది మంది అల్లరి మూకలను, వారిని ప్రేరేపించేవారిని గుర్తించి పోలీసులు అరెస్టు చేశారు. ప్రాసిక్యూషన్, న్యాయవ్యవస్థ వేగంగా, కచ్చితత్వంతో వ్యవహరించాయి. రోజుల వ్యవధిలోనే కొందరు దోషుల నేరాల్ని రుజువు చేయటం, శిక్ష వేయటం జరిగిపోయాయి. బ్రిటన్‌లో 'అంతర్యుద్ధం' వస్తుందని ఎలాన్ మస్క్ వంటి అతి స్వేచ్ఛావాదులు చెప్పిన జోస్యాల్ని, భావోద్రేకాల్ని రెచ్చగొట్టేందుకు అగ్నికి ఆజ్యం పోసేవారు రకరకాలుగా చేసిన ప్రయత్నాలనూ వమ్ము చేస్తూ వ్యవస్థ సమర్థంగా వ్యవహరించింది.

బంగ్లాదేశ్ ఘటనలతో దీన్ని పోల్చిచూడండి: 1971లో బంగ్లాదేశ్ విముక్తి ఉద్యమంలో 'స్వాతంత్ర్య యోధుల' వారసులకి ప్రభుత్వోద్యోగాల్లో కోటాలకు వ్యతిరేకంగా విద్యార్థుల పోరాటం చిలికి చిలికి గాలివానయి అదుపు తప్పింది. అరాచకానికి, ప్రభుత్వం దిగిపోవటానికి, తీవ్ర రాజకీయ, ఆర్థిక అనిశ్చితికి దారితీసింది. పీటర్ సూత్రానికి ఇది గొప్ప ఉదాహరణ: క్రియాశూన్య, అర్థ- నియంతృత్వ వ్యవస్థలో తప్పు జరిగే అవకాశం ఉంటే తప్పు జరిగి తీరుతుందని రుజువయింది. 1970లలో ప్రవేశపెట్టిన కోటాలు సుదీర్ఘకాలం కొనసాగుతూ, కాలక్రమంలో పార్టీ వర్గాలను పోషించే వనరుగా తయారయ్యాయి. ఎట్టకేలకు ప్రభుత్వం సంస్కరణ డిమాండ్లకు తలొగ్గి 2018లో చాలా కోటాలను రద్దు చేసింది; కానీ ప్రభుత్వం తొలగించిన కోటా వ్యవస్థను హైకోర్టు (సుప్రీంకోర్టు విభాగం) పునరుద్ధరించింది. జూన్ 5న హైకోర్టు తీర్పుకి ప్రతిస్పందనగా విద్యార్థుల నిరసనలు మొదలయ్యాయి. సంక్లిష్ట రాజకీయ సవాళ్లున్నప్పుడు, విభిన్న ప్రయోజనాల మధ్య నేర్పుగా చర్చించటం, సమన్వయం అవసరం. కోర్టులు కొన్నిసార్లు మంచి కంటే చెడు ఎక్కువ చేయవచ్చు. మీతి తెగవారికి రిజర్వేషన్లను




# BANGLADESH CRISIS & UK RIOTS

విస్తరిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు, మణిపూర్‌లో కూడా ఇదేతరహాలో జరిగింది. బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు అప్పీలేట్ విభాగం హైకోర్టు నిర్ణయాన్ని కొట్టివేస్తూ అన్ని కోటాలను 7%కి తగ్గిస్తూ జులై 21న తీర్పునిచ్చింది. 93% ఉద్యోగాలను బహిరంగ పోటీ ద్వారా ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలి. కానీ అప్పటికే ప్రభుత్వం వేసిన వరుస తప్పటడుగులు, నిరంకుశ పాలన పట్ల ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం, బూటకపు ఎన్నికల పట్ల ప్రజల్లో విశ్వసనీయత కొరవడటం చివరికి కోటా వ్యతిరేక ప్రదర్శనల్ని కాస్తా, మొత్తం ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలుగా మార్చాయి. పక్షం రోజుల్లోగా, ప్రధానమంత్రి షేక్ హసీనా రాజీనామా చేసి దేశాన్ని వదిలి పారిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

2009 నుండి షేక్ హసీనా ప్రభుత్వం కొన్ని అభినందనీయ విజయాల్ని సాధించింది. వేగంగా ఆర్థికాభివృద్ధిని సాధించటం, మత తీవ్రవాదుల్ని అణచివేయటం కీలకమైనవి. కానీ 2009 జనవరిలో విస్తృత స్థాయి ప్రజల మద్దతుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఉన్నకొద్దీ నిరంకుశమై విశ్వసనీయతను కోల్పోయింది. పోటీతో కూడిన ఎన్నికలు ప్రజాస్వామ్య సారాంశం; కానీ ఆ తర్వాత ఎన్నికల్ని ప్రధాన ప్రతిపక్షం బహిష్కరించాయి. లేదా, భారీ రిగ్గింగ్‌తో బూటకపు ఎన్నికలు జరిగాయి. రాజకీయ స్వేచ్ఛల్ని అణచివేశారు. ప్రతిపక్షం, విమర్శకులపై ప్రభుత్వం బలప్రయోగంతో విరుచుకుపడింది. అవినీతి, అధికార దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతం వ్యవస్థీకృతమయ్యాయి. గ్రామీణ బ్యాంకు వ్యవస్థాపకుడు, నోబెల్ పురస్కార విజేత మహమ్మద్ యూనస్ లాంటి ఎంతో గౌరవప్రదమైనవారిని కూడా డజన్ల కొద్దీ అక్రమ కేసుల్లో ఇరికించి వేధించారు. జైళ్లకు పంపారు, ప్రాసిక్యూట్ చేశారు. ప్రభుత్వం చేసిన ప్రతి పనినీ ప్రతి ఒక్కరూ సమర్థించకపోవచ్చు, కానీ చాలామేర ప్రజల స్వచ్ఛంద ఆమోదం ఉంటుంది కాబట్టే పాలన సాగించగలుగుతుంది. ప్రజల స్వచ్ఛంద మద్దతు లేకుంటే, క్రూర అణచివేత, రక్తపాతం వంటి విపరీత పద్ధతుల ద్వారా మాత్రమే ప్రభుత్వం కొనసాగగలుగుతుంది. సాధారణ ప్రజాస్వామ్య మార్గాలైన హేతుబద్ధ చర్చ, ప్రభుత్వంపై విమర్శ, శాంతియుత నిరసనలను అనుమతించి అసంతృప్తులు బయటికి చెప్పుకునే అవకాశమిస్తే, సమస్యలు పెరగవు. సమస్యల్ని సమన్వయం చేయటం, శాంతియుత పరిష్కారం సాధ్యమవుతాయి. సందర్భం ఏదైనా, పనిచేసే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాల్లో కదలిక తేవటానికి, ప్రజల స్వచ్ఛంద ఆమోదాన్ని పునరుద్ధరించటానికి నిష్పాక్షిక ఎన్నికలు, శాంతియుతంగా అధికార మార్పిడి అందుబాటులో ఉన్న సాధనాలు.

ఇటువంటి సాధనాలు, వ్యవస్థలు కొరవడినప్పుడు, సమస్యలు సంక్షోభాలవుతాయి. ప్రతి సంక్షోభం సమాజం ఎదుర్కొంటున్న సవాళ్లకు నిజమైన సమాధానాలు లేకుండానే ప్రభుత్వం కూలిపోవటానికి దారితీయవచ్చు. అన్నీ అనుకూలంగా ఉన్న పరిస్థితుల్లో కూడా సోషల్ మీడియా, నకిలీ వార్తలు, తక్షణ సమాచారాల యుగంలో శాంతిభద్రతల్ని పరిరక్షించటం ప్రభుత్వానికి ఉన్నకొద్దీ కష్టమవుతోంది. ఆమధ్య కాలం వరకు సమాచారం, ప్రజలకు తెలియచేయటంలో ప్రభుత్వాలకు గుత్తాధిపత్యం ఉండేది. ఇందిరాగాంధీని దారుణంగా హత్య చేసినప్పుడు, సుమారు 12 గంటలపాటు దేశానికి తెలియకుండా గోప్యత పాటించారు! ఈవేళ్టి సాంకేతిక పరిజ్ఞాన యుగంలో తప్పుడు సమాచార వ్యాప్తిని, అరాచకవాదులు, అతి స్వేచ్ఛావాదులు రెచ్చ గొట్టే ధోరణుల్ని నియంత్రించటం ప్రభుత్వానికి అసాధ్యమవుతోంది.

ఈ సవాళ్ల కాలంలో, ఒక ప్రభుత్వం పట్ల ప్రజల్లో విశ్వసనీయత, ప్రజల స్వచ్ఛంద మద్దతు, హేతుబద్ధ చర్చ, అనుసరించాల్సిన పంథా, విధానాలపై సంపన్న వర్గాల్లో స్థూల ఏకాభిప్రాయం, ఎన్నికల తీర్పుల్ని ఆమోదించటం, ప్రజాస్వామిక ఆట నియమాలకు కట్టుబడి ఉండటం శాంతిభద్రతలకు, స్థిరత్వం, అభివృద్ధికి కీలకం. ఒక క్రియాశీల ప్రజాస్వామ్యం, సాపేక్షంగా సామరస్య సమాజం ఉండటం భారతదేశ అదృష్టం. ఆ రెంటినీ కాపాడుకుందాం. ✪

# యూపీఎస్ - ఆర్థిక క్రమశిక్షణకు మార్గం కావాలి

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్,
వ్రితి బన్సల్,
సుమేధా కూరపర్తి



ప్రజాస్వామ్యంలో ప్రజల దీర్ఘకాలిక అభివృద్ధి కోసం ప్రయత్నిస్తున్నప్పుడు తరచూ తాత్కాలిక రాజకీయ మూల్యం చెల్లించాల్సి ఉంటుంది. యూనియన్ ప్రభుత్వం తన ఉద్యోగులకు తాజాగా ఆమోదించిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్)ను ఈ నేపథ్యంలో చూడాలి. ప్రభుత్వం, ఉద్యోగులు కొంతడబ్బు కాంట్రిబ్యూట్ చేసేలా 2004లో నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను ఎంతో విజ్ఞతతో తీసుకొచ్చారు. కానీ పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్)లోలాగా నిర్దిష్ట మొత్తానికి తగ్గకుండా పెన్షన్‌కి తమకు గ్యారంటీ ఇవ్వాలని ప్రభుత్వోద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్థిక క్రమశిక్షణ రీత్యా అవసరమైన ఎన్‌పీఎస్‌కు, పెరుగుతున్న ఉద్యోగుల డిమాండ్‌కు మధ్య సమన్వయం చేసే ప్రయత్నం యూపీఎస్.

యూపీఎస్, ఎన్‌పీఎస్, ఓపీఎస్ – ఈ సంక్షిప్త నామాలపై గందరగోళాన్ని ఛేదిద్దాం. పెద్ద ఆర్థిక వ్యవస్థ గల దేశాలన్నిటిలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ పద్ధతి ఉంది. అంటే, ఉద్యోగి, యజమాని జీతాల్లోని నిర్దిష్ట శాతాన్ని ఒక ఫండ్‌లో జమ చేస్తారు. ఆ పెట్టుబడుల మీద వచ్చే లాభాలతో నిధి పెరుగుతుంటుంది. పదవీ విరమణ తర్వాత ఉద్యోగుల పింఛన్లను ఈ పెన్షన్ నిధి నుండి తీసుకుంటారు. ఎప్పటి డబ్బులు అప్పుడే కాంట్రిబ్యూట్ చేయటం వల్ల భవిష్యత్తుతరంలోని పన్ను చెల్లింపుదారుల మీద భారం ఉండదు. ఉదాహరణకు, అమెరికాలో ఉద్యోగులు, యజమాని వేతనాల్లో 6.2% (ఒక గరిష్ట పరిమితికి లోబడి) చొప్పున జమ చేస్తారు. ఉద్యోగం చేసినంతకాలం అలా చెల్లిస్తారు. ఈ పెన్షన్ నిధి పెట్టుబడుల ద్వారా పెరుగుతూ ఉంటుంది. రిటైర్‌మెంట్ తర్వాత పెన్షన్‌ని ఈ ఫండ్ నుండి చెల్లిస్తారు. అన్ని ఓఈసీడీ దేశాల్లో ఇదే తరహా పెన్షన్ నిధులు, ఉద్యోగి, ప్రభుత్వం కాంట్రిబ్యూట్ చేసే పెన్షన్ పద్ధతులు ఉన్నాయి. పెన్షన్ నిధికి ప్రతి సంవత్సరం చేసే కాంట్రిబ్యూషన్లు, దాన్నుంచి చెల్లించే పెన్షన్ల మొత్తానికి మధ్య పెద్ద అంతరం ఉండదని ఈ దిగువ పట్టికను చూస్తే అర్థమవుతుంది. ఏవైనా కొరతలు ఎదురైతే భర్తీ చేయటానికి వీలుగా క్రమంగా డబ్బు నిల్వల్ని ఆరోగ్యకరమైన రీతిలో పెంచుతారు. అయినా కూడా, జనాభాల్లో వయసు

ఎంపిక చేసిన దేశాల్లో కాంట్రిబ్యూటరి పెన్షన్ కార్యక్రమాలు

| దేశం | పెన్షన్ భారం ఏ రకంగా | దేశం మొత్తం కార్మికుల్లో ఎంతమందికి | ప్రభుత్వ ఆదాయాల్లో పెన్షన్ ఖర్చు | పెన్షన్ నిధిలో ఏటా కాంట్రిబ్యూషన్ (బిలియన్లలో) | నిధి నుండి ఏటా చెల్లించేది (బిలియన్లలో) | సంవత్సరాంతాన మిగులు నిధులు (బిలియన్లలో) |
|---|---|---|---|---|---|---|
| అమెరికా (2021) | ఫండ్ లో వాటా జమ | 94% | 14.79% | $1,088.40 | $1,144.50 | $2,852.00 |
| బ్రిటన్ (2020) | ఫండ్ లో వాటా జమ | ~100% | 12.60% | £110.64 | £104.35 | £36.93 |
| ఫ్రాన్స్ (2021) | ఫండ్ లో వాటా జమ | ~100% | 22.70% | € 299.40 | € 298.50 | € 163 |
| స్వీడన్ (2020) | ఫండ్ లో వాటా జమ | ~100% | 13.10% | 295.499ఎస్ఇకె | 326.27SEK | ~1600ఎస్ఇకె |
| ఇండియా (2021) ఓ.పి.ఎస్ | ఎటువంటి జమ చేయరు | 3.20% | 18.20% | శూన్యం | Rs 6,660 | శూన్యం |

పైబడుతున్నవారి సంఖ్య పెరుగుతున్నరీత్యా పెన్షన్ నిధి నుంచి చెల్లించే మొత్తాలు భవిష్యత్తులో జమ చేసే డబ్బుని మించిపోతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. రిటైర్మెంట్ వయసును పెంచటం, పెన్షన్ కాంట్రిబ్యూషన్లు, చెల్లింపులను సర్దుబాటు చేయటం ద్వారా ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ఈ దేశాలు ప్రయత్నిస్తున్నాయి.

అయితే, భారత్‌లో ప్రభుత్వోద్యోగుల పెన్షన్ పద్ధతి అందుకు పూర్తి భిన్నమైనది. 2004కి ముందు నియమితులయిన ప్రభుత్వోద్యోగులందరికీ ఓపీఎస్ కింద ఉద్యోగి లేదా యజమాని ఒక్క రూపాయి కూడా కాంట్రిబ్యూట్ చేయరు. పన్ను చెల్లించేవారి డబ్బుతో బడ్జెట్ నుండి కేటాయింపులు చేస్తారు. అంటే, గతంలో చేసిన సేవలకు, భవిష్యత్తులో పన్ను చెల్లించేవారిపై భారీ భారం పడుతుంది. ఓఈసీడీ దేశాల్లోలా కాకుండా మన పెన్షన్ విధానం ఎంతో ఉదారమైనది కూడా. ఉద్యోగికి చివరి జీతంలో 50% పెన్షన్ అందుతుంది; ఆ పెన్షన్ మొత్తం కూడా ధరలకనుగుణంగా (కరవు భత్యాలు), పెరిగిన జీతాలకనుగుణంగా (నిర్ణీత కాల వ్యవధిలో ఏర్పాటయ్యే పే రివిజన్లు కమిషన్లు ఎంత ఉదారంగా ఉంటాయో చెప్పనక్కర్లేదు) పెరుగుతూంటుంది. ఉదాహరణకు, అమెరికాలో 2021లో సగటు పెన్షన్ ఒక్కో వ్యక్తికి 16,920 డాలర్లు. అంటే, తలసరి ఆదాయంలో సుమారు 25%. కానీ భారత్‌లో, సగటు పెన్షన్ సుమారు రూ. 5,34,000.

2004కి ముందు నియమితులయిన ప్రభుత్వోద్యోగులందరికీ ఓపీఎస్ కింద ఉద్యోగి లేదా యజమాని ఒక్క రూపాయి కూడా కాంట్రిబ్యూట్ చేయరు. పన్ను చెల్లించేవారి డబ్బుతో బడ్జెట్ నుండి కేటాయింపులు చేస్తారు.అంటే, గతంలో చేసిన సేవలకు, భవిష్యత్తులో పన్ను చెల్లించేవారిపై భారీ భారం పడుతుంది. ఓఈసీడీ దేశాల్లోలా కాకుండా మన పెన్షన్ విధానం ఎంతో ఉదారమైనది కూడా. ఉద్యోగికి చివరి జీతంలో 50% పెన్షన్ అందుతుంది




అంటే, తలసరి ఆదాయంలో 277%! మరోవంక, ఈ పెన్షన్ భారం ప్రమాదకరంగా పెరిగిపోతుంటుంది. 2012-13 నుండి 2021-22 వరకు దశాబ్దకాలంలో జాతీయస్థాయిలో భారం మూడు రెట్లు పెరగగా, 2004-05 నుండి 2021-22 వరకు 18 ఏళ్లలో రాష్ట్రాల్లో 11 రెట్లు పెరిగింది. ఫలితంగా, జాతీయస్థాయిలో, రాష్ట్రాల్లో మొత్తం ప్రభుత్వ ఆదాయాల్లో 18.2% దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం కార్మికశక్తిలో కేవలం 3.2% ఉన్న ప్రభుత్వోద్యోగుల పెన్షన్ల మీదే ఖర్చవుతున్నాయి.

ఈ రకంగా, ఆందోళనకరమైన, ఒక్క రూపాయి కూడా జమ చేయని, నిరంతరం పెరిగిపోతుండే భారం వల్లే జనవరి 1, 2004 నుంచి యూనియన్ ప్రభుత్వోద్యోగులకు ఎన్‌పీఎస్‌ను ప్రవేశపెట్టారు. ఎన్‌పీఎస్ కింద, ఉద్యోగులు తమ జీతాల్లో 10% తమ వంతుగా జమ చేస్తారు, యూనియన్ ప్రభుత్వం 14% కాంట్రిబ్యూట్ చేస్తుంది. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీయే) నిర్వహించే పెన్షన్ ఫండ్‌లో ఈ డబ్బును పెట్టుబడిగా పెడతారు. 2004 నుంచి రిక్రూట్ అయిన ఉద్యోగులు రిటైర్‌మెంట్ తర్వాత ఈ ఫండ్ నుంచి పెన్షన్ లబ్ధిని పొందుతారు. పన్ను చెల్లింపుదారులపై భవిష్యత్తులో భారం ఉండదు.

2004 నుండి, పశ్చిమ బెంగాల్ మినహాయించి అన్ని రాష్ట్రాలూ ఎన్‌పీఎస్‌ను అమలు చేస్తున్నాయి. కానీ 2004 తర్వాత రిక్రూట్ అయిన ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్నకొద్దీ, పాత, ఎటువంటి కాంట్రిబ్యూషన్‌లేని, పెరుగుతున్న జీతాలకనుగుణంగా ఎప్పటికప్పుడు పెరుగుతూండే ఉదారమైన ఓపీఎస్‌కు తిరోగమించాలనే డిమాండ్లు మొదలయ్యాయి. భవిష్యత్తు పన్ను చెల్లింపుదారులను పణంగా పెట్టయినా సరే తమ

డిమాండ్‌ను నెరవేర్చాలన్న ప్రభుత్వోద్యోగుల ఒత్తిడికి పలు బీజేపీయేతర ప్రభుత్వాలు తలొగ్గాయి. హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో ప్రభుత్వాలు తిరిగి ఓపీఎస్‌కు మళ్లాయి. బీజేపీ అధికారంలోకి వచ్చిన చోట ఆ రాష్ట్రాల్లో మళ్లీ ఎన్‌పీఎస్ అమలుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. కర్ణాటక, తెలంగాణల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలు తిరిగి ఓపీఎస్ తెస్తామని హామీ ఇచ్చాయి. కానీ అధికారంలోకి వచ్చాక విజ్ఞతను ప్రదర్శించి మౌనం వహించాయి. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ పద్ధతిని కొనసాగిస్తూనే ఒక గ్యారంటీడ్ పెన్షన్ పద్ధతిని ప్రవేశపెట్టింది.

మార్కెట్ ఒడిదుడుకుల మీద ఆధారపడకుండా భరోసా ఉండే పెన్షన్ కావాలన్న ఉద్యోగుల డిమాండ్లకు స్పందనగా యూనియన్ ప్రభుత్వం యూపీఎస్‌ను ప్రకటించింది. స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టిన పెన్షన్ నిధులకు తగిన లాభాలు రావేమో, లేదా మార్కెట్ ఒడిదుడుకులకు గురైనప్పుడు మొత్తం ఖాళీ అవ్వొచ్చు, మార్కెట్ కుప్పకూలితే అసలుకే ఎసరు రావొచ్చు అనే ఆందోళన సమంజసమైనది. యూపీఎస్ ఇప్పుడు ఉద్యోగుల ప్రయోజనాలకు హామీ ఇస్తోంది – గ్యారంటీ పెన్షన్, కుటుంబ పెన్షన్, కనీస స్థాయి పెన్షన్, ద్రవ్యోల్బణానికి తగ్గట్లు పెంపు, పదవీ విరమణ సమయంలో ఒకేసారి పెద్ద మొత్తం చెల్లింపు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ నిధిలో తగినన్ని లాభాలు వచ్చినా, రాకున్నా ఈ గ్యారంటీలు వర్తిస్తాయి. ఇందుకోసం యూపీఎస్, ఎన్‌పీఎస్ మధ్య అంతరాన్ని తగ్గించే బాధ్యతను యూనియన్ ప్రభుత్వం తీసుకుంది. యూపీఎస్ యూనియన్ ప్రభుత్వ వ్యయాన్ని పెంచుతుంది. కానీ, ప్రస్తుతం పెంచిన కాంట్రిబ్యూషన్ల నుంచే భవిష్యత్తు చెల్లింపులు చెల్లిస్తారు. యూనియన్ ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ పెన్షన్ ఖర్చులకు తగ్గట్లు ఉందా, లేదా నిర్ణయించటానికి నిర్ణీత కాలవ్యవధిలో ఫండ్ పెట్టుబడుల రిస్కు, పెరుగుతున్న జీవనకాలం మొదలైన అంశాలను విశ్లేషణ చేస్తారు. అవసరమయితే ప్రభుత్వ వాటాని పెంచుతారు కాబట్టి, పెన్షన్ల కాంట్రి బ్యూటరీ స్వభావానికి భంగంవాటిల్లదు.

రాష్ట్రాలు కూడా ఇదేతరహాలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ నిధి నుండే చెల్లింపులు చేసే గ్యారంటీడ్ పెన్షన్ల పద్ధతినే అమలు చేయటం అవసరం. గత తరానికి గతంలో ఇచ్చిన సేవలకు చేసే చెల్లింపులకు భవిష్యత్తు పన్ను చెల్లింపుదారుల మీద భారం వేయకూడదన్నది మౌలిక సూత్రం కావాలి.

దీర్ఘకాల ప్రయోజనాన్ని, స్వల్పకాల అవసరాలతో విజ్ఞతతో యూపీఎస్ సమన్వయం చేస్తున్నప్పటికీ, రాబోయేకాలంలో కొన్ని ప్రమాదాలు పొంచి ఉన్నాయి. లాభాల్ని నిర్దిష్టంగా చెప్పలేని కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంలో (ఎన్‌పీఎస్‌లోలాగా), ఉద్యోగి ప్రభుత్వ ఖాతా నుంచి కాకుండా పీఎఫ్ఆర్‌డీయే నిర్వహణలోని నిధి నుండి పెన్షన్ అందుకుంటారు. కానీ పెన్షన్ నిధికి వచ్చే లాభాలతో సంబంధం లేకుండా నిర్దిష్ట మొత్తం లాభాలకు ప్రభుత్వమే భరోసా ఇస్తే, భవిష్యత్తులో వచ్చే ప్రభుత్వాలు పటిష్ఠ ఆర్థిక ఆరోగ్యంతో ఉండాలి. దురదృష్టవశాత్తూ అనేక రాష్ట్రాలు ఖజానా డబ్బుని ఇష్టమొచ్చినట్లు దుబారా చేస్తున్నాయి. అప్పు తెచ్చిన డబ్బుతో ఆచరణసాధ్యంకాని సంక్షేమ పథకాలకు హామీ ఇస్తున్నాయి, అమలు చేస్తున్నాయి. జీతాలు, పెన్షన్లు, వడ్డీ చెల్లింపులు, సంక్షేమం కోసం భారీగా అప్పులు చేస్తున్నాయి. దీనివల్ల, వీటిలో చాలా రాష్ట్రాలు చెల్లింపు హామీల్ని నెరవేర్చటంలో కొద్దికాలంలోనే విఫలమవుతాయి, అపరిమితంగా అప్పులు తేవటం ఎల్లకాలం సాధ్యం కాదు. భవిష్యత్తులో ఏదైనా జాతీయస్థాయి ప్రభుత్వం కూడా అదే మార్గంలో వెళ్లవచ్చు. శ్రీలంక, జింబాబ్వే, వెనిజువెలాల్లో అదే జరిగింది.

అటువంటి సంక్షోభం మన అభివృద్ధి వేగాన్ని ఛిన్నాభిన్నం చేసి, కోట్లాది ప్రజానీకం జీవితాల్లో పేదరికాన్ని కొనసాగిస్తుంది. భవిష్యత్తుని పరిరక్షించే ఆర్థిక క్రమశిక్షణ కోసం రాజకీయంగా ఆచరణసాధ్యమైన విధానచట్రాన్ని వెలువరించటానికి మనం జాతీయస్థాయి ఏకాభిప్రాయాన్ని పునర్నిర్మించాలి.

**(డా. జయప్రకాష్ నారాయణ్ లోక్‌సత్తా వ్యవస్థాపకులు, ప్రితి బన్సల్, సుమేధా కూరపర్తి ప్రజాస్వామ్య పీఠంలో పరిశోధకులు)**

**రాష్ట్రాలు కూడా ఇదేతరహాలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ నిధి నుండే చెల్లింపులు చేసే గ్యారంటీడ్ పెన్షన్ల పద్ధతినే అమలు చేయటం అవసరం. గత తరానికి గతంలో ఇచ్చిన సేవలకు చేసే చెల్లింపులకు భవిష్యత్తు పన్ను చెల్లింపుదారుల మీద భారం వేయకూడదన్నది మౌలిక సూత్రం కావాలి.**

# అభివృద్ధి కోసం చిన్న పట్టణాలు



**- సంతోషిణి**

తెలంగాణలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్ని చూస్తే, హైదరాబాద్, చుట్టుపక్కల ప్రాంతాలకు, మిగిలిన ప్రాంతాలకు మధ్య ఓటింగ్ సరళిలో వ్యత్యాసం గమనించవచ్చు. గ్రేటర్ హైదరాబాద్ నియోజకవర్గాలలో ఎక్కువ శాతం సీట్లు బీఆర్ఎస్ గెలవగా మిగతా నియోజకవర్గాలలో ఆ ఆధిక్యతను కొనసాగించలేకపోయింది. ఇదే సరళి లోక్‌సభ ఎన్నికలలో కూడా చూడవచ్చు. అభివృద్ధి ఫలితాలు పట్టణాలు, పరిసర ప్రాంత ప్రజలకు అందినంతగా తమకు అందలేదని మిగిలిన ప్రాంతాల ప్రజలు కనబరిచిన వ్యతిరేకతగా ఈ తీర్పును చూడవచ్చు.
కారణాన్ని కాస్త లోతుగా పరిశీలిస్తే, జిల్లాల్లోనూ కొంత అభివృద్ధి జరిగినట్లు కనిపిస్తుందిగానీ, గ్రామీణ-పట్టణ ప్రాంతాల మధ్య అభివృద్ధిలో సమతుల్యం కొరవడిందని స్పష్టంగా అర్థమవుతుంది.

మన దేశంలో వ్యవసాయరంగంపై సుమారు 42% జనాభా ఆధారపడినప్పటికీ, జీడీపీకి ఆ రంగం ద్వారా వచ్చే ఆదాయం 18% మాత్రమే. ఎవరో కొద్దిమందిని మినహాయించి, పనిచేయగలిగే వారిలో ప్రతి ఒక్కరూ మెరుగైన ఉద్యోగ అవకాశాలు, జీతాల కోసం, సొంత గ్రామాలను, కుటుంబాలను విడిచి వందల కిలోమీటర్ల దూరంలో ఉండే పెద్ద పట్టణాలకు వలస పోతున్నారు. వీరిలో తక్కువ నైపుణ్యం కలిగి, తక్కువ వేతనాలు పొందేవారు ఎక్కువ.
ఇక పెద్ద నగరాల విషయానికి వస్తే, ఎక్కువ నైపుణ్యం అవసరమయ్యే సాఫ్ట్‌వేర్ వంటి రంగాల్లో ఉద్యోగాలు, విశ్వవిద్యాలయాల్లో పరిశోధన, బోధన వంటి వాటికి అనువైన ప్రదేశాలు. అయితే పట్టణీకరణ పెరుగుతూ పోతుంది. 2036 నాటికి సుమారుగా 40% జనాభా పట్టణ ప్రాంతాలలో ఉంటారు. ప్రస్తుత పెద్ద పట్టణాల పరిస్థితి చూస్తే, పేదరికం గ్రామీణ ప్రాంతాల్లోకన్నా తక్కువ వేగంతో తగ్గుతోంది. మరోవంక, అధిక జీవన వ్యయం, తాగునీరు, వరద నీటిపారుదల వంటి కనీస మౌలిక సదుపాయాలు చాలాచోట్ల అధ్వాన్నంగా ఉండటం వల్ల, జీవన నాణ్యత కొరవడుతోంది. ఇటీవల బెంగళూరులో ఏర్పడిన తాగునీటి కొరత, 2020లో హైదరాబాద్‌లో వచ్చిన వరదలు మౌలిక సదుపాయాల లోపాలకి ఉదాహరణలు. వీటి ప్రభావం ముఖ్యంగా, ఎక్కువగా ఉద్యోగాల కోసం గ్రామాల నుండి వలస వచ్చే తక్కువ నైపుణ్యాలు గల కార్మికుల మీద ఉంటుంది. 2020నాటికి భారతదేశంలో సుమారు 49% పట్టణ ప్రజలు మురికివాడల్లో ఉన్నారని ఐక్యరాజ్యసమితి హ్యాబిటాట్ నివేదిక తెలియచేస్తోంది. తక్కువ నైపుణ్యాలున్న కార్మికుల్లో అధికశాతం పెద్ద పట్టణాలలో జీవన వ్యయాలను అందుకోలేక మురికివాడలు వంటి ప్రదేశాలలో ఉంటున్నారు.

అయితే పెద్ద నగరాలకు నిస్సహాయంగా వలసపోవాల్సిన అవసరం లేకుండా, ప్రతి చిన్న గ్రామానికి అవసరమయ్యే మౌలిక సదుపాయాల్ని అందించటం అసాధ్యం. అమెరికా వంటి ధనిక దేశాలు కూడా అందించలేకపోయాయి. ఈ క్రమంలో ఇటువంటి మౌలిక వసతులను ఆర్థికంగా ఆచరణసాధ్యంగా అందించటానికి, తక్కువ నైపుణ్యాలు, తక్కువ ఆదాయాలతో సొంత గ్రామాలను విడిచి పెద్ద నగరాలకు వలస వెళ్లే జనాభాకు అవకాశాలు కల్పించటానికి చిన్న పట్టణాలు పరిష్కారాలుగా ఉపయోగపడతాయి. భౌగోళికంగా కేంద్రబిందువుగా ఉండి, పరస్పర అను సంధానం కలిగిన ప్రాంతాలను ఎంచుకుని వాటికి టౌన్ ప్లానింగ్, మంచి నీటి సరఫరా, మురుగునీరు, వరద నీటి పారుదల డ్రైనేజీ, రవాణా సంధానాన్ని ప్రభుత్వం ఏర్పరచాలి. అలాగే తక్కువ నైపుణ్యాలు, తక్కువ ఆదాయాలు గల కార్మికులకు అవకాశాలు ఉండేలా ఉపాధి ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకి చర్యలు తీసుకోవాలి. ఈ పరిశ్రమలలో పనిచేయడానికి, మార్కెట్‌కి అవసరమైన నైపుణ్యాల శిక్షణతోపాటు, మౌలిక సదుపాయాలు, భూమి లభ్యతకి ప్రభుత్వం చొరవ చూపాలి. పారిశ్రామిక రంగాన్ని ప్రోత్సహించటం వల్ల తక్కువ నైపుణ్యాలున్న కార్మికులకి చిన్న పట్టణాలలో సౌకర్యవంతంగా బతకటానికి సరిపడా వేతనాలు లభిస్తాయి. వీరి జీవన ప్రమాణాలు చాలామేర నగరాల స్థాయికి సరితూగుతుంటాయి. దీనివల్ల సహజంగా పల్లెల నుండి వలసలు జరుగుతాయి.

చాలీచాలని వేతనాల కోసం పెద్ద నగరాలకు వెళ్లే అవసరం లేకుండా తమ గ్రామాలకు దగ్గరగా ఉండే చిన్న పట్టణాలలో వ్యవసాయేతర పనులు చేసుకోవడమే కాకుండా గ్రామాలలో వ్యవసాయం కూడా చూసుకోవచ్చు. ఈ చిన్న పట్టణాల వృద్ధిని ప్రోత్సహించటం ద్వారా ఇళ్లు, సేవల్లో ప్రైవేట్ పెట్టుబడులు వస్తాయి. అలాగే తమ కుటుంబాలకు దగ్గరగా ఉండవచ్చు.
ఆధునికీకరణ, పట్టణీకరణ, ఆర్థిక అభివృద్ధి పరస్పర సమన్వయంతో ముందుకెళ్తుంటాయి.

**Growth is necessary but not suffucient. To attain a broad societal consensus there is a need for inclusive growth.To ensure the fruits of growth reach every-one in situ urbanisation through development of small towns becomes imperative.**

★

# పట్టణ జనాభా పెరుగుతున్నా తగ్గని గ్రామీణుల సంఖ్య




భారతదేశంలో పట్టణ జనాభా వేగంగా పెరుగుతోందని, అదే సమయంలో గ్రామీణ జనాభా తగ్గటం లేదని యూనియన్ గణాంకాల శాఖ ఆధ్వర్యంలోని సామాజిక గణాంక విభాగం తాజా నివేదిక వెల్లడించింది. పట్టణ జనాభా 2011లో ఉన్న 37.7 కోట్ల నుంచి 2036 నాటికి 59.4 కోట్లకు చేరనుంది. గ్రామీణ జనాభా 83.3 కోట్ల నుంచి 92.7 కోట్లకు చేరనుంది. దీనివల్ల పట్టణ, గ్రామీణ అంతరాల సంక్షోభం భారత ఆర్థిక, సామాజిక, రాజకీయ స్థిరత్వానికి పెనుసవాలు కానుందని స్పష్టమవుతోంది. అదేవిధంగా 15 ఏళ్లలోపు వయసున్నవారి సంఖ్య కొంత తగ్గనుంది. సంతాన సాఫల్యం తగ్గటమే ఇందుకు ప్రధాన కారణం. ఇదే సమయంలో 60 ఏళ్లు పైబడిన వారి సంఖ్య భారీగా పెరగనుంది. 2021లో దేశ జనాభాలో పదిహేనేళ్లలోపువారు సుమారు 26 శాతం ఉంటే, 2036 నాటికి వారు 20.1 శాతానికి తగ్గనున్నారు. అదేసమయంలో 60 ఏళ్లకు పైబడిన పురుషులు 9.5 శాతం నుంచి, 13.9 శాతానికి, మహిళలు 10.7 శాతం నుంచి 16 శాతానికి పెరగనున్నారు. దానివల్ల జనాభా పిరమిడ్‌లో 2036 కల్లా అనూహ్య మార్పులు రానున్నాయి. ఆ పిరమిడ్‌లో ప్రాథమిక భాగం తగ్గిపోయి, మధ్యస్థాయి భాగం విస్తృతం కానుంది. దక్షిణ భారత రాష్ట్రాలతోపాటు హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లలో వృద్ధుల సంఖ్య జాతీయ సగటును మించి పోనుందని, వచ్చే పుష్కర కాలంలో తెలంగాణలో యువజనాభా 6.2 శాతం, ఏపీలో 5.6 శాతం చొప్పున తగ్గనుందని ఐక్యరాజ్యసమితి ఇప్పటికే వెల్లడించింది.

పనిచేసే వయసులో 15-59 ఏళ్ల మధ్య ఉన్న జనాభా 2011 నాటి 60.7% నుండి 2036 నాటికి 64.9 శాతానికి పెరుగుతున్నప్పటికీ, జనాభా పిరమిడ్‌లో వచ్చే మార్పు ఉత్పాదకత, సంక్షేమ వ్యయంపై ప్రతికూల ప్రభావం చూపనుంది.

గ్రామీణ జనాభా తగ్గకపోవటం, ఉపాధి ఆశించేవారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో వలసలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. గ్రామాల్లో వృద్ధులే ఎక్కువగా కనిపిస్తున్నారు. దేశంలో జరుగుతున్న ఆర్థికాభివృద్ధి వల్ల గ్రామీణుల వినిమయశక్తి మెరుగవుతున్నా, పట్టణ ప్రాంతాల స్థాయిలో అక్కడ అభివృద్ధి జరగటం లేదు. ఇదే సమయంలో ఉపాధి కోసం అత్యధికులు సరైన నైపుణ్యాలు లేకుండా మహానగరాలకు వలస వెళ్తూ అక్కడ రెక్కాడితేగానీ డొక్కాడని పరిస్థితిలో బిక్కుబిక్కుమంటూ దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ఇది ఆర్థిక, రాజకీయ, సామాజిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. ఆర్థికాభివృద్ధి నగరాలకు పరిమితం కావాల్సిన అవసరం లేకుండా గ్రామీణ ప్రాంతాలకు కూడా విస్తరించటం ఇప్పుడు అత్యవసరం. అభివృద్ధికి పట్టణీకరణ పర్యాయపదం కాబట్టి గ్రామాలలో పట్టణ సౌకర్యాలు అవసరం. గ్రామాలు వాటంతటవే పట్టణీకరణ వైపు నడిచేదాకా వేచిచూడకుండా, పట్టణ ప్రాంత సదుపాయాలను గ్రామాలకు అందుబాటులోకి తేవాలి. దేశంలో ఆరు లక్షలకు పైగా ఉన్న గ్రామాలు, ఆవాసాలకు పట్టణ సౌకర్యాలు అసాధ్యం కాబట్టి, గ్రామాల మధ్య చిన్న పట్టణాలను సహజంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు చొరవ చూపాలి. ఆ పట్టణాల్లో ఆర్థికాభివృద్ధికి అవకాశాల్ని పెంచేందుకు మౌలిక వసతుల్ని కల్పించటం, పరిశ్రమల్ని ప్రోత్సహించటం, అందుకోసం తగిన వసతుల్ని కల్పించటం అవసరం. సంఘటిత రంగంలో ఉపాధి అవకాశాలు పెరగటానికి, నైపుణ్యాల శిక్షణ, నాణ్యమైన విద్యకు కావలసిన ఏర్పాట్లు చేయాలి. ఓపక్క సగటు ఆయుర్దాయం పెరిగి, మరోపక్క జీవనశైలి వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఆరోగ్య సంరక్షణకి సమగ్ర ఏర్పాట్లు అవసరం. అభివృద్ధి చిట్టచివరి పౌరునికి కూడా అందేలా పర్యావరణహితకరమైన రీతిలో చిన్న పట్టణాల వృద్ధి దేశాభివృద్ధికి, రాజకీయ పార్టీలకు కూడా అవసరం.

**'ఉమెన్ అండ్ మెన్ ఇన్ ఇండియా 2023' నివేదికలోని మరికొన్ని ముఖ్యాంశాలు:**

- దేశ జనాభా 2036 నాటికి 152.2 కోట్లకు చేరనుంది. ఇందులో మహిళల నిష్పత్తి కొంత పెరగనుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం 48.5% మహిళలతో 121.1 కోట్లున్న దేశ జనాభా 2036 నాటికి 48.8% మహిళలతో 152.2 కోట్లకు చేరనుంది.
- 2011 నాటికి ప్రతి వెయ్యిమందికి 943 మంది మహిళలు 2036 నాటికి 952కు చేరతారు. ఇది లింగ సమానత్వానికి సానుకూల సంకేతం.
- 2036 నాటికి పనిచేసే వయసున్న జనాభా పెరుగుతుంది. 2011 నాటికి 60.7% జనాభా 15-59 ఏళ్ల మధ్య ఉండగా.. 2036 నాటికి ఇది 64.9 శాతానికి చేరనుంది.
- 2011 జనాభాలో 10-14 ఏళ్ల వయసున్నవారు అత్యధికంగా 10.8% ఉండగా, 2036 నాటికి 35-39 ఏళ్ల వయసువారి సంఖ్య అత్యధికం (8.3%) కానుంది. 80 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 0.5% నుంచి 1.5%కి పెరగనుంది.



## భారత్

# సంపన్న దేశమవటం సాధ్యమా?

***స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్‌తో ప్రముఖ సినీ దర్శకులు కొరటాల శివ జరిపిన ఇంటర్వ్యూ సంభాషణలోని కొన్ని ముఖ్యాంశాలు:***

**కొరటాల శివ: 77 ఏళ్ల భారతదేశం. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లాంటి దేశాలతో పోల్చి చూస్తే ఒక సైడ్ హ్యాపీనెస్, అదేసమయంలో జపాన్, సింగపూర్, చైనాలాంటి దేశాల్ని చూస్తే ఇంకా వెనకబడిపోయామన్న బాధ. భారత్ అభివృద్ధి చెందుతున్న దేశమని చిన్నప్పటి నుంచి వింటున్నాం.**

**జేపీ:** మీరు చెప్పింది వాస్తవం. ఆర్థికంగా బంగ్లాదేశ్ మనకంటే కొంత బెటర్‌గా ఉన్నా, మిగతా విషయాల్లో మనం మెరుగు. అక్కడ గత కొన్ని రోజులుగా పరిణామాల్ని చూస్తే వేరే చెప్పనక్కర్లేదు. 2006లో ఎలక్షన్స్‌లో ఏదో సంక్షోభం వచ్చిన సమయంలో బంగ్లాదేశ్‌కి నన్ను ఆహ్వానించారు. కాకతాళీయంగా ఇప్పుడు తాత్కాలిక ప్రధాని/ చీఫ్ అడ్వయిజర్‌గా ఉన్న మహమ్మద్ యూనస్ ఆ సమావేశానికి ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. ఓటరు జాబితాలు, ఎన్నికల్లో డబ్బులు, దుష్పరిపాలన ఇలా మన దేశంలో సమస్యలన్నీ చెప్పాను. వాళ్లు ఆశ్చర్యపోయారు. భారత్‌లో ఇన్ని సమస్యలున్నాయా అన్నారు. మన మూలాలు ఒకటేనయ్యా అని చెప్పా. మనం కొన్ని పనులు సరిగా చేశాం. ఈసీ లాంటివి. కానీ మనం చేయాల్సినవి చాలా ఉన్నాయి. మనం సరైన పనులు చేస్తే మిగతావి కూడా బాగుపడతాయి. తప్పుడు పనులు చేస్తే మంచి ఫలితాలు ఎలా వస్తాయి? ఉదాహరణకు, ఐదేళ్ళలో రూ.1,16,000 కోట్ల మిగులు బడ్జెట్‌తో ప్రారంభమై పచ్చగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో ఈవేళ పెండింగ్ బిల్లులే రూ.75,000 కోట్ల దాకా ఉన్నాయి. తరగనిగని హైదరాబాద్ ఉంది కాబట్టి

తట్టుకోగలుగుతుంది కానీ, జరిగిన నష్టానికి మూల్యం చెల్లించాలిగా. అదేవిధంగా విభజన వల్ల లోటు ఉన్నా, అంతకంటే ఎక్కువగా అభివృద్ధి గురించి పట్టించుకోని దుష్పరిపాలనతో ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా నష్టపోయింది. కాంట్రాక్టర్లు, ఇతరులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు రూ.1,30,000 కోట్లున్నాయి. ఆర్థికాభివృద్ధికి, యువత ఉపాధికి కీలకమైన విద్యను నిర్లక్ష్యం చేశారు. ప్రమాణాలు, స్కిల్స్‌లేని విద్యను అందిస్తున్నారు. సమాజానికి పనికొచ్చే ఏ పనైనా గౌరవప్రదమైనదే అని కాకుండా, చిన్న పని, పెద్ద పని అని యువత మనసుల్లో పాతుకుపోయిన భావాన్ని కొనసాగిస్తున్నారు.

***కొరటాల: ఐఏఎస్‌కి రాజీనామా సరైన నిర్ణయం అనుకుంటున్నారా?***
***జేపీ:*** *ఏనాడూ మనసులో శంక కలగలేదు. 1973-74 నుంచే, 18 ఏళ్ల వయసు నుంచే మనకున్న అవకాశాలు, సామర్థ్యాన్ని ఈ దేశం కోసం వినియోగించాలని నిర్ణయించుకున్నాను. ఈ 50 ఏళ్లలో అదే ఆలోచన. అందులో ఎదగలా నేను. రేపేం చేయాలి అన్న సందేహం ఎప్పుడూ కలగలేదు. జీతం, హోదా తప్ప ప్రభుత్వంలో, బయటా లక్ష్యంలో మార్పు లేదు. అదే లక్ష్యం కోసం పనిచేశా. ఆ స్పష్టత ఉంది కాబట్టే నిరాశ లేదు. నాకున్న ఆవేదన, ఆందోళన ఏమైనా ఉంటే, వేగంగా మార్పు వచ్చే అవకాశముంటే ఎందుకు ఆలస్యమవుతోంది ఈ దేశంలో అని.*

**కొరటాల: మనం హైవే మీద కారు టైరు పంక్చరయితే హైరానా పడతాం. అమెరికాలో వాళ్లే పంక్చర్ వేసుకుంటారు. ఒక సినిమా షూటింగ్‌కి ఇటలీలోని మారుమూల ప్రాంతానికి వెళ్లినప్పుడు చూశా. అక్కడ ఒక తండ్రి, ఇద్దరు కొడుకులు టూరిస్టుల కోసం సొంతంగా ఇల్లు కడుతున్నారు. డిజైన్, నిర్మాణం కూడా చాలా గొప్పస్థాయిలో ఉన్నాయి.**

**జేపీ:** మనకు ఇల్లు కట్టటం నరకం. ప్రతిదీ ఇండివిడ్యువల్ కస్టమైజేషన్ తప్ప, స్టాండర్డైజేషన్ లేదు. మనకు ఆ దృష్టి లేదు. ఎక్కడో ఉన్న కలెక్టర్ కంటే మనకు దగ్గరలో బాత్‌రూంల పూడిక తీసే ప్లంబర్ మిన్న అన్న ఆలోచన మనకు పెరగలేదు. ఆ మధ్య ఉత్తరాదిన రైల్వేలో గ్యాంగ్‌మెన్ వంటి 90 వేల చిన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇస్తే 2 కోట్ల 30 లక్షల మంది దరఖాస్తు చేశారు. అంత జనాభా ఉన్న దేశాలు ప్రపంచంలో 20 ఉంటాయి. బాధ్యత, నైపుణ్యంలేని ఉద్యోగాలు అని తప్ప, సేవ, పనితో సంబంధం ఉన్న ఉపాధి అనే భావాన్ని సమాజం నుంచి వేరు చేశారు. కొంతమంది యువత కొన్నిచోట్ల అద్భుతంగా చేస్తున్నారు. కానీ వారి సంఖ్య పెరగటంలా ఇంకా.

**కొరటాల: వచ్చే తరం కూడా భారత్ అభివృద్ధి చెందుతున్న దేశమే అని చదువుకోవాలా?**

**జేపీ:** అభివృద్ధి చెందిన దేశం అంటే ముందు, సమాజానికి అవసరమైన వస్తువులు, సేవలు ఉత్పత్తి కావాలి. మనకు కావటంలా. రోడ్లు, ఇతర మౌలిక వసతులుకొరవడుతున్నాయి. అదేవిధంగా అందరికీ ఆదాయం గౌరవప్రదంగా అందాలి. అందరికీ సమానాదాయాలు సాధ్యం కాదు, అవసరం కూడా లేదు. కానీ అవకాశాలు అందరికీ ఉండాలి. మన ప్రస్తుత తలసరి ఆదాయం 2,700 డాలర్లు. ఇది చాలదు. అమెరికా ప్రకారం చూస్తే, కొనుగోలు శక్తి రీత్యా ఇందుకు 3.5 రెట్లు ఎక్కువగా భావించాలి. డాలర్‌కి 83,84 రూపాయలిచ్చినా, రూ.24తో వచ్చేది డాలర్‌తో రాదు. కాబట్టి బహుశా ఈవేళ భారతదేశ తలసరి ఆదాయం విలువ 10,000-12,000 డాలర్ల దాకా ఉండవచ్చు. అమెరికా తలసరి ఆదాయం 70,000 డాలర్లు. మన తలసరి ఆదాయం విలువ ఆ స్థాయికి పెరగాలంటే ఆర్థికాభివృద్ధి రేటు కీలకం. 7-8 శాతం ప్రతి సంవత్సరం ఆర్థికాభివృద్ధి ఉండాలి. నిజంగా ఆ స్థాయిలో రేటు పెంచితే చాలా తొందరగా ఎదగగలం. చైనా 1980లో మనకంటే వెనక ఉండేది. కానీ ఆ వృద్ధి రేటును నిలకడగా కొనసాగించి 2004-05 నాటికి 25 ఏళ్లలోనే అద్భుత ఫలితాలు సాధించారు. కాబట్టి 20-25 ఏళ్లలో, 2050 కల్లా మనం నాలుగురెట్లు కొనుగోలుశక్తిని పెంచుకోగలం. 60,000 డాలర్లకు చేరగలం. డబ్బు రూపంలో కాకపోయినా జీవన ప్రమాణాల్ని దాదాపు సంపన్న దేశాలకు సమానంగా అందుకోగలం. అందుకు ఏర్పాట్లు అవసరం. కనీస వసతుల్లో ప్రపంచంలోనే కాస్త చెప్పుకోదగిన ఆర్థిక వ్యవస్థల్లో మనం అట్టడుగు అయిదు స్థానాల్లో ఉన్నాం. మౌలిక సదుపాయాల్లో ఇప్పుడిప్పుడు కొంత చేస్తున్నాం. అదేవిధంగా ఆరోగ్యం, చట్టబద్ధపాలన, విద్యలో కొన్ని పనులు చేయాలి. ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి. కొన్ని రాష్ట్రాలు చాలా బాధ్యతారహితంగా అప్పు చేసి ఉచితాలు పంచుతున్నాయి. అలాంటి పాలన వల్లే ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది.

**కొరటాల: ప్రయివేటు విద్యాసంస్థలు కొన్ని ఎల్‌కేజీ, యూకేజీకి కూడా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. వీటిని నియంత్రించలేమా?**

**జేపీ:** సమస్య అదే అయితే పరిష్కారం అయిదు నిముషాల్లో సాధ్యం. కానీ సమస్య తీవ్రమైనది. మన ప్రభుత్వాలేమీ పాఠశాల విద్యపై తక్కువ డబ్బు ఖర్చు చేయటం లేదు. ఏపీలో ఏడాదికి ఒక్కో విద్యార్థిపై రూ. 90,000 నుంచి రూ.లక్ష వరకు ఖర్చు చేస్తున్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వం కంటే ప్రయివేటు బెటరని సామాన్యులు అప్పులు చేసి మరీ ఆ స్కూళ్లకి పంపుతున్నారు. కానీ పాస్‌లు, మార్కులు, బట్టీ పట్టటం, మాస్ కాపీయింగ్ తప్ప నిజంగా చదువు రావటం లేదు. ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యలో కూడా అదే పరిస్థితి. ఐఐటీలు, కొన్ని కళాశాలల్లో విపరీత డిమాండ్ తప్ప, మిగిలిన వేలాది కాలేజీల్లో ఎందుకు సరైన చదువు అందటం లేదన్న చర్చ లేదు. డిమాండ్‌కు తగ్గ సప్లయ్ లేకపోవటం వల్ల కోచింగ్ సెంటర్లు పెరిగిపోయాయి. సమస్య సరైన వ్యవస్థని నిర్మించకపోవటంలో ఉంది. ప్రభుత్వం ఇదే ఖర్చుతో నిజమైన విద్యని అందిస్తే ప్రయివేటు విద్య మీద మోజు తగ్గుతుంది.

**కొరటాల:**

**రైతుల్ని ఓటుబ్యాంకుగా చూస్తున్నారు తప్ప, వారిని పాపం అనటం తప్ప వారికి ఎదిగే అవకాశాలు ఇవ్వటం లేదు.**



**జేపీ:** రైతుకి ఆదాయం వచ్చే విధానాలన్నిటికీ వ్యతిరేకంగా వ్యవహరిస్తూ వారి సంక్షోభాన్ని ఏమాత్రం పరిష్కరించకపోగా మరింత పెంచే రుణమాఫీ వంటి చర్యలతో రైతుని బిచ్చగాడ్ని చేస్తున్నారు. డబ్బులు ఇస్తామంటే ఎవరికి చేదు? ఓట్ల కోసం దేశాన్ని నాశనం చేసినా ఫర్వాలేదని కొన్ని పార్టీలు అనుకుంటున్నాయి. రైతుల్లో అపోహల్ని పెంచి వాళ్లకు నిజంగా మేలు చేసే వ్యవసాయ చట్టాల్ని మాత్రం వెనక్కి తీసుకునేలా చేశారు. ఆ చట్టాల వల్ల అద్భుతాలు జరుగుతాయని కాదు. కానీ రైతులకున్న సంకెళ్లు పోయి ఆదాయాలు పెరుగుతాయి. ఈ వాస్తవాల్ని విశ్వసనీయత ఉన్న నాయకులు చెప్పాలి. సామాన్య పౌరునిగా కూడా రైతుల కోసం ఎంతో పోరాడినవాడిగా ఈ మాటలు ఎంతో సాధికారతతో చెబుతున్నా. రుణమాఫీలు వంటి వాళ్ల విధానాలు అంత గొప్పవైతే, ఎందుకు రైతులు వ్యవసాయం నుంచి పారిపోతున్నారు? ఇది రైతులు అర్థం చేసుకోవాలి.

**కొరటాల: అన్ని ఉచితాలూ అమలు సాధ్యం కాదు అని చెప్పే అథారిటీ లేదా? అలాంటి అథారిటీ ఉంటే ఏ ఉచితాలు ఆచరణసాధ్యం, ఏవి కావు అని ప్రజలకు కూడా అర్థమవుతుంది కదా.**

**జేపీ:** ఇటీవల హైదరాబాద్‌లో ఒక ప్రయివేట్ ఫంక్షన్‌లో ఏపీ మంత్రొకరు కలిశారు. హామీలు, అభివృద్ధికి నిధుల్లేక తలలు పట్టుకుంటున్నాం, ఆర్థిక పర్యవేక్షణ చేయాల్సిన అధికార యంత్రాంగం, రాజ్యాంగ సంస్థలు, యూనియన్ ప్రభుత్వం ఏం చేస్తున్నాయని అడిగారు. ఓ మంత్రి స్వయంగా అన్న మాటలివి. ఏ రాష్ట్రం చూడనంత తీవ్ర సంక్షోభాన్ని ఈవేళ ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొంటోంది. మన ఫెడరల్ వ్యవస్థలో రాష్ట్రంలో రాష్ట్రానిదే అధికారం. జాతీయ స్థాయిలో యూనియన్ ప్రభుత్వం, పార్లమెంటుది తుది అధికారం. కానీ ఒక దేశంగా చూసినప్పుడు, రాజ్యాంగంలోని 293వ ఆర్టికల్ ప్రకారం, ఒక రాష్ట్రం అప్పు చేసినట్లయితే ముందస్తుగా జాతీయ ప్రభుత్వ అనుమతి కావాలి. 1) నియంత్రణ 2) ఏ షరతులపైన అనే అంశాల్లో. మన దేశంలో రాష్ట్రం దివాళా తీయదు. దేశం దివాళా తీస్తుంది కాబట్టి. అవసరమైతే ఆర్థిక ఎమర్జెన్సీని 362 కింద విధించవచ్చు. అంతకుమించి, రోజువారీ మీ రాష్ట్రం మీరు నాశనం చేసుకుంటే ఏమీ చేయలేం. చాలా రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా సంక్షోభాన్ని సృష్టించుకున్నాయి. సంక్షేమానికి, అభివృద్ధికి మధ్య ఒక బ్యాలెన్స్ అవసరం. తెలుగు ప్రజలు కూడా ఇప్పటికైనా నష్టాన్ని గుర్తించాలి. పార్టీల్ని పక్కనపెట్టి ఆర్థిక క్రమశిక్షణ, అప్పు చేసిన డబ్బుతో పందేరం విషయంలో స్పష్టమైన విధాన నిర్ణయానికి దేశమంతా ఒక చర్చ రాజకీయాలకు అతీతంగా జరగాలి.

**కొరటాల: అధికారంలో ఉన్న పార్టీ మారిపోగానే అధికారులు కూడా మారిపోవాలా? ఐఏఎస్, ఐపీఎస్‌లకు జవాబుదారీతనం లేదా? ప్రభుత్వానికి భయపడుతున్నారా? ప్రక్షాళన ఎలా?**

**జేపీ:** యూపీఎస్సీ ఉన్నంతలో సమర్థంగా, మెరుగైన అభ్యర్థులనే ఎంపిక చేస్తోంది. అదృష్టమో, తెలివితేటలో మీరు సివిల్స్‌కి ఎంపిక కావచ్చు. కానీ, అది మీ జీవితానికి నిర్వచనం కాదు. మీకో అవకాశం. ఆ అవకాశాన్ని ఉపయోగించి ప్రజలకు మేలు చేస్తున్నారా, లేదా? ముందు అది తేల్చుకోండి. చేరేటప్పుడు ఉన్న ఆలోచన, నైపుణ్యం ఆ



తర్వాత ఉండటం లేదు. వాళ్లు ఊహించుకున్నది వేరు, కొలువులో రోజువారీ పరిస్థితులు, ఇక్కడ జరుగుతున్నది వేరు. ప్రతిభ కన్నా ఏలినవారి కాళ్లు పడితే బతుకుతారు హాయిగా అనుకునే వాతావరణం ఉంది. ఇదే ప్రతిభ గల మిగిలినవాళ్లు బయట కోట్ల రూపాయలు నిజాయతీగా సంపాదించుకుంటున్నారు. ఐఏఎస్‌లకి గతం కంటే ఇప్పుడు జీతాలు ఎక్కువైనా బయటతో పోలిస్తే తక్కువ. కానీ ప్రభుత్వ సర్వీసులో అక్రమార్జనకు అవకాశం ఎక్కువ. దానికి చాలామంది లొంగిపోతున్నారు. రాజును మించిన రాజభక్తి ప్రదర్శిస్తున్నారు. రాజకీయ పార్టీల్లోనూ విజ్ఞత లోపించింది. ఇప్పటికీ మణిమాణిక్యాలున్నారు. ఒకసారి ఐఏఎస్‌లో చేరితే మూడు తప్పులు జరుగుతున్నాయి. ఒకటి, అవినీతి, పెద్ద నేరాలకు పాల్పడినా శిక్ష పడదు, జీవనపర్యంతం పదవిలో కొనసాగవచ్చు. రెండు, కీలక పదవుల్లో వాళ్లకి పోటీ లేదు. మూడు, స్పెషలైజేషన్ లేదు. ఇవాళ ఒక రంగంలో పనిచేస్తే, రేపు మరో రంగం. ప్రపంచంలో ఎవరూ అన్ని రంగాల్లో నిపుణులు కారు. ఈ మూడు లోపాల్నీ సరిచేస్తే ఇదే ఐఏఎస్, ఐపీఎస్‌లు అద్భుతంగా పనిచేస్తారు. ఏ ప్రభుత్వం వచ్చినా అధికారులు వాళ్లే ఉంటారు. కమ్యూనిస్టు విప్లవం, ఇంకో విప్లవం వచ్చినా మళ్లీ వాళ్లే అధికారులు. కాబట్టి వ్యవస్థను మార్చాలి.

**కొరటాల: భయం వల్ల నిజాలు చెప్పటం తగ్గిపోయిందా?**

**జేపీ:** సోషల్ మీడియా వచ్చాక అసంబద్ధ, అహేతుక విమర్శలు, బూతులు, ప్రతి దానికి కులాన్ని, ప్రాంతాన్ని అంటగట్టటం ఎక్కువయ్యాయి. కానీ, ప్రజాప్రయోజనాల కోసం పనిచేస్తున్నవారు దూషణ, భూషణ, తిరస్కారాల్ని పక్కనపెట్టాలి. లోపం ఎవరిలోనైనా ఉండొచ్చు, సమాచార లోపం ఉండొచ్చు. కానీ హేతుబద్ధంగా, అంగీకరించే విధంగా చెప్పాలి. కాబట్టి, అబద్ధాలు వదిలేయాలి. ఒప్పించాలి. దూషణం, భూషణం రెండూ వద్దు. సోషల్ మీడియాతో మంచితోపాటు, ఈ సమస్య ప్రపంచమంతా ఉంది. పరిష్కారం అంత తేలిక కాదు.

**కొరటాల:డబ్బున్నవాళ్లంటే మన దేశంలో ఎక్కువమందికి ఎందుకో ద్వేషం**

**జేపీ:** మనం 60 ఏళ్లపాటు అదే భావజాలాన్ని సమాజం మీద రుద్దాం. సంపదసృష్టిని పాపంగా చిత్రించాం. ఇప్పుడిప్పుడే మార్పు వస్తోంది. సినిమాలు ఎంటర్‌టైన్‌మెంట్ కోసం. సరదా సినిమాలు డబ్బుల కోసం తీసేవాళ్లు చాలామంది ఉన్నారు. కానీ మీరు ఎంటర్ టైన్‌మెంట్‌తో పాటు కొంత మెస్సేజ్‌ని కూడా జొప్పిస్తారు. గతంలో కూడా మనం కూర్చున్నాం. అవసరం లేకున్నా సందేశాన్ని ఎలా అందించాలా అని ప్రయత్నం చేశారు. ఇందులో రిస్క్ లేదా, మెస్సేజ్ ఉంటే ఎవరు చూస్తారు?

**కొరటాల:** వేధించే ప్రశ్నలకు పరిష్కారం చెప్పే ప్రయత్నం చేస్తున్నాం. జనాన్ని చేరటం కోసం దానికి కొన్ని హంగులు అద్ది తీస్తుంటాం. పదిమంది ఆలోచిస్తారనే తపన. ఈ షో కూడా పదిమందికీ చేరి, కొందరైనా యువత, తల్లిదండ్రులు స్కిల్స్ గురించి ఆలోచిస్తే సంతోషం. యువతలో స్కిల్స్ పెంచేందుకు ఏమైనా చేయవచ్చేమో త్వరలో మీతో కూర్చుని చర్చిస్తా.

**జేపీ:** తప్పకుండా. పెద్దగా సినిమాలు చూడకపోయినా, మీ అందరి విజయాలు నాకు ఉత్సాహాన్నిస్తుంటాయి.

(Full interview conversation@ https://www.youtube.com/@JPLoksattaOfficial ) ❖

# ఇతర దేశాల్లో పరిణామాలపై ఇంకొంత చర్చ

ఆర్థికాభివృద్ధి పెరుగుతున్నకొద్దీ విదేశీ వ్యవహారాల్లో దేశ ప్రాధాన్యత పెరుగుతుంటుంది. సంపన్న దేశాలతో పోటీపడగలిగే ఆర్థికాభివృద్ధి అవకాశాలు భారత్‌కు ఉండటంతోపాటు ఇటీవలికాలంలో విదేశాంగ విధానంలో పరిణతి, క్రియాశీలత పెరగటం వల్ల భారత్ ఇటీవల అంతర్జాతీయంగా కీలకశక్తిగా ఎదుగుతోంది. అయితే కొన్ని దేశాల మధ్య యుద్ధాలు, దాడులు, రాజకీయ అస్థిరతలు భారత్‌ను ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఇటీవలికాలంలో చుట్టుపక్కల దేశాల్లో పరిణామాలు మన విదేశాంగ విధానానికి పరీక్షగా మారాయి. నేపాల్, మాల్దీవులు, భూటాన్, మయాన్మార్, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్ మొదలైన దేశాల్లో పరిణామాలు భారత్‌కి జాగ్రత్త పాటించాల్సిన అవసరాన్ని చెబుతున్నాయి. చైనా, పాకిస్థాన్‌లతో సరిహద్దు వివాదాలు, ఆఫ్ఘనిస్థాన్ సంక్షోభం కొనసాగుతూ ఉన్నాయి.




బంగ్లాదేశ్‌తో మనకున్న స్నేహసంబంధాలు, అక్కడి పరిణామాలు ఒక సంచలనంలా జరగటం, పదవి నుంచి దిగిపోయిన ఆ దేశ ప్రధానమంత్రి షేక్ హసీనా మన దేశంలో ఆశ్రయం తీసు కోవటం వల్ల అక్కడి పరిణామాల గురించి మన దేశంలోనూ బాగా ప్రచారం జరిగింది. అంతకు ముందు మాల్దీవుల గురించి కొంత హడావుడి జరిగింది. అయితే ఏ దేశానికి సంబంధించిన పరిణామాలపై కూడా ప్రజాస్వామిక సంస్కరణలకు సంబంధించిన చర్చ జరగటం లేదు. జాతీయ స్థాయి పత్రికల్లో కూడా సైనిక పరమైన, దౌత్యపరమైన అంశాలకు సంబంధించి, భారత్ ఎంత జాగ్రత్తలు తీసుకోవాలి అని మాత్రమే ఎక్కువ చర్చ జరుగుతోంది.

విదేశీ పరిణామాలను మనం మరింత ప్రజాస్వామ్యయుతంగా అర్థం చేసుకుంటే, ఆ దేశాలతో సంబంధాలు మెరు గవటమేకాదు, మన దేశంలోనూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం గావించుకునే అవకాశాలుంటాయి. ఉదాహరణకు, బంగ్లాదేశ్‌నే తీసుకుంటే, మారిన పరిస్థితుల్లో ఒప్పందాలు, ఉగ్రవాదం, ఈశాన్య రాష్ట్రాల ప్రయోజనాలరీత్యా మనం మరింత అప్రమత్తంగా, వ్యూహాత్మకంగా వ్యవహరించాలనటంలో సందేహం లేదు. అదేసమయంలో, ప్రభుత్వం గద్దె దిగాక కూడా భారత్ తమ దేశంలోని పరిణామాలను సక్రమంగా అర్థం చేసుకోలేదని అక్కడ పలువురు భావిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో మార్పుల్ని భారత్ తప్పుగా అర్థం చేసుకుంటున్నట్లుందని, ప్రత్యేక పరిస్థితిని అర్థం చేసుకుని ఇతర పార్టీలతోనూ సత్సంబంధాలు పెంపొందించుకోవాలని అక్కడి ఆర్థిక, సామాజికవేత్తలు, నిపుణులు అంటున్నారు. ప్రజలు విప్లవం తీసుకొచ్చారనే వాస్తవాన్ని భారత్ గుర్తించాలని 'బంగ్లాదేశ్ శాంతి, భద్రత అధ్యయనాల సంస్థ' ప్రతినిధులు అన్నారు. అధికారంలో కొనసాగటం కోసం బంగ్లాదేశ్‌లో ప్రతి వ్యవస్థనూ హసీనా నాశనం చేశారని, నిరంకుశ అణచివేతకు పాల్పడ్డారని యూనస్ ఆరోపించారు. రాజకీయ నేతలు, కార్యకర్తల పోషణ కోసం బ్యాంకుల్ని దోచేశారన్నారు. ఎన్నికల సంఘం, న్యాయవ్యవస్థ, పౌర పరిపాలన, భద్రతాదళాలు, మీడియా.. ఈ రంగాల్లో సంస్కరణలు తీసుకురావటంపై దృష్టి సారించామన్నారు. వీటన్నిటినీ పట్టించుకోకుండా, కేవలం కొందరు నేతలతో వ్యక్తిగత సంబంధాలకు ప్రాధాన్యతనిస్తే దీర్ఘకాలంలో ఆ దేశంతో సత్సంబంధాల్లో సమస్యలు తలెత్తుతాయి.

అదేవిధంగా, బంగ్లాదేశ్ కంటే మన ప్రజాస్వామ్యం మెరుగ్గా ఉన్నమాట వాస్తవం, కానీ అక్కడివారు చెబుతున్న లోపాలు, ఆరో పణలు మనదేశంలోనూ లేవా? బంగ్లాదేశ్‌లో కనీస ప్రజా స్వామ్య ప్రమాణాల్లో అత్యధికం లేవన్న మాట నిజం. మనదేశం లో ఆ ప్రమాణాలున్నా కూడా ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం గావించు కోవాలంటే, బంగ్లాదేశ్‌లో వినిపిస్తున్న విమర్శలను పట్టించు కోవాల్సిందే. వ్యవస్థల్ని బలోపేతం చేసు కోవాల్సిందే. అదేవిధంగా థాయ్ లాండ్‌లో అక్కడ ప్రధానమంత్రిని రాజ్యాంగ న్యాయ స్థానం అధికారం నుంచి తొలగించింది.

థాయ్‌లాండ్ రాజ్యాంగ రాచరిక దేశమైనా, మన ప్రజాస్వామ్యానికి పనికొచ్చే ఒక కీలక అంశాన్ని అక్కడి రాజకీయ అస్థిరత నుంచి మనం గమనించవచ్చు. నైతిక ఉల్లం ఘనలకు పాల్పడ్డారనే అభియోగాలపై థాయ్‌లాండ్ ప్రధాన మంత్రి స్రెట్టా థావిసిన్‌ను రాజ్యాంగ న్యాయస్థానం పదవి నుంచి తొలగించింది. ఒక న్యాయమూర్తికి లంచం ఇవ్వటానికి ప్రయత్నించాడనే నేరంపై ఆరు నెలలు జైలుశిక్ష విధించిన వ్యక్తిని మంత్రివర్గంలోకి తీసుకోవటం ఆయనపై అభియోగం. ఆయన జైలుశిక్ష పూర్తి చేసుకున్నప్పటికీ నిజాయతీలేని వ్యక్తిగా పేర్కొంటూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని రాజ్యాంగ న్యాయస్థానం ప్రస్తావించింది. ప్రధానమంత్రిగా తన క్యాబినెట్ సభ్యుడి అర్హతలు పరిశీలించాల్సిన పూర్తి బాధ్యత స్రెట్టాదేనని స్పష్టం చేసింది. పిచిత్ గతం గురించి తెలిసినప్పటికీ ఆయనను క్యాబినెట్‌లోకి ప్రధాని తీసుకున్నారని, ఇది నైతిక ఉల్లంఘనలకు పాల్పడటమేనని పేర్కొంది. థాయ్‌లాండ్‌లో న్యాయవ్యవస్థ స్వతంత్రమైనది. ఆ తీర్పు ఆధారంగా రాజ్యాంగ న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సరైనదేనా, దేశాభివృద్ధికి విఘాతం కలిగించటం లేదా, మెరుగైన ప్రజాస్వామ్యం కోసం ఈ ప్రమాణాలు మనం పాటించాలా, వద్దా అన్నది తర్వాతి చర్చ. కానీ మన దేశ రాజకీయాల్లో నేర చరితులు సమస్యగా ఉంది గదా! నేరారోపణలున్నవారు ఎన్నికల్లో గెలవటం సాధారణమైపోయింది. చట్టసభ సభ్యులుగా ఎన్నికవటమే కాదు, మంత్రివర్గంలో కూడా నేరచరితులు ఉన్నారనే ఆరోపణ లున్నాయి. అందరి మీదా అభియోగాలు తీవ్రమైనవి కాక

పోవచ్చు, కానీ ఆ ఆరోపణల్లో తీవ్రమైన నేరాలకు పాల్పడ్డవారు కూడా ఉన్నారు. అవినీతిపరులుగాని, వ్యక్తిగతంగా నిబద్ధులైన ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రి ఉన్నా కూడా నేరచరితులను మంత్రివర్గంలోకి తీసుకోవాల్సి వస్తోంది. ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తున్నా, ఎన్నికల్లో గెలిచాక ప్రత్యర్థి పార్టీలను వేధించటమే తప్ప, నేరరహిత రాజకీయాల కోసం ఎటువంటి చర్యలూ తీసుకోవటం లేదు. అవినీతి, ఇతర నేరాలకు పాల్పడ్డ నేతలు ప్రతిపక్షాల్లో ఉంటే, వారిపై దాడులు చేయటం, బెదిరించి తమ రాజకీయ అవసరాలకు ఉపయోగపడేలా లొంగదీసుకోవటం తప్ప పరిష్కారాలకు ప్రయత్నం చేయటం లేదు. నేరస్తులు రాజకీయాల్లోకి ఎందుకు అవసరమవుతున్నారు? రాజకీయాల్లో అవినీతి ఎందుకు పెరుగుతోంది? మన పోటీ రాజకీయంలో ఎన్నికల వ్యవస్థ ఒక సమస్యగా ఉంది. ఒక్క ఓటు ఎక్కువ వస్తే చాలు గెలవవచ్చు అనే మన ఎన్నికల పద్ధతి, మన పేదరికం, నాణ్యమైన విద్య కొరవడటం మొదలైనవి పోటీలో ఉన్న బలాన్ని బలహీనతగా మారుస్తున్నాయి. దీనివల్ల లెక్కలు చూపని డబ్బు, కులం, మతం వంటివి అవసరమవుతున్నాయి. నేరచరితులను ఆశ్రయించాల్సి వస్తోంది. నిజాయతీపరులు, ఏదోకరకంగా డబ్బు సంపాదించాలనే యావ లేనివారు కూడా మన ఎన్నికల వ్యవస్థ విషవలయంలో కూరుకుపోయి ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అవినీతికి పాల్పడుతున్నారు. మన ఎన్నికల పోటీ అబద్ధంతోనే మొదలవుతుందని వాజపేయి ఎప్పుడో దశాబ్దాల క్రితమే చెప్పారు. ఇప్పటికీ ఆ అబద్ధాన్ని మనం బహిరంగ రహస్యంలా కొనసాగిస్తున్నాం. ఎన్నికల వ్యవస్థను మార్చటం, చటబద్ధపాలనను సంస్కరించటంపై ఇప్పటికైనా దేశవ్యాప్త చర్చ, ఏకాభిప్రాయ సాధనకు ప్రయత్నం జరగాలి గదా!

ఇక మరో దేశం జపాన్. ఆ దేశంలో రాజకీయ అస్థిరత లేదు గానీ, అక్కడి ఒక ప్రజాస్వామిక పరిణామం మనం నేర్చుకోవాల్సిన పాఠం. సెప్టెంబర్‌లో జరిగే డెమోక్రాటిక్ పార్టీ (ఎల్‌డీపీ) అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయటం లేదని ప్రధానమంత్రి ఫుమియో కిషిద ప్రకటించారు. పార్టీ సారథ్యానికి పోటీ చేయకపోవటం వల్ల ప్రధానమంత్రి పదవి నుంచి వైదొలగాల్సి ఉంటుంది. కొత్తగా ఎన్నికైన పార్టీ అధ్యక్షుడు ప్రధాని బాధ్యతలు స్వీకరిస్తారు. ఎందుకీ నిర్ణయం అంటే, అక్కడో అవినీతి కుంభకోణం జరిగింది. కిషిద ఆ కుంభకోణం నుంచి బయటపడ్డారు గానీ, అప్పటి నుంచి ఆయనకు మద్దతు 20 శాతం కంటే తక్కువకు పడిపోయింది. ఏమిటీ కుంభకోణం? పార్టీ కార్యక్రమాలకు టికెట్లు విక్రయించి రాజకీయ నిధులను సేకరించి కుంభకోణానికి పాల్పడ్డారని, ఇందులో 80కి పైగా ఎల్‌డీపీ చట్టసభ సభ్యుల భాగస్వామ్యం ఉందంటూ గతంలో విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కిషిద తన కేబినెట్‌లో పలువురు మంత్రులను, పార్టీ కార్యనిర్వాహక సభ్యులను పదవుల్లో నుంచి తొలగించారు. ఆపై రాజకీయ నిధుల నియంత్రణ చట్టాన్ని కఠినతరం చేస్తూ కొత్త చట్టం తీసుకొచ్చారు. అయినప్పటికీ కిషిదకు ప్రజాదరణ తగ్గిపోవటంతో ఈ ఏడాది ప్రారంభంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో పార్టీ పరాజయం పాలైంది. దీంతో వచ్చే సాధారణ ఎన్నికల్లో కొత్త వ్యక్తులను బరిలోకి దింపే అవసరం ఎంతో ఉందని ఎల్‌డీపీ సభ్యులు ఆయనను కోరినట్లు సమాచారం. 2021లో కిషిద ఎల్‌డీపీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయన మూడేళ్ల పదవీకాలం ఈ నెలతో ముగుస్తుంది. ఈ నేపథ్యంలో ఆయన ప్రకటన వెలువడింది. నిజానికి జపాన్‌లో జరిగింది మన దేశం ఉన్న పరిస్థితుల్లో నేరంగానే భావించే పరిస్థితి లేదు. మన దేశంలో చాలా రాజకీయ పార్టీలకు ఆ తరహా విరాళాలు వస్తుంటాయి. జపాన్‌లో అలాంటి విరాళాల్ని అవినీతిగా భావించి ప్రజలు నిరసించారు. అవినీతి కుంభకోణం నుంచి ప్రధాని బయట పడినా ప్రజలు వ్యతిరేకించారు. మన దేశంలో ఆ స్థాయిలో ప్రజలు తిరగబడే పరిస్థితి ఇంకా లేకున్నా, కనీసం చట్ట విరుద్ధంగా, రాజ్యాంగ విరుద్ధంగా జరుగుతున్న ఎన్నికల వ్యయాన్ని నియంత్రించేందుకు, అందుకు ప్రజలకు ఓ మార్గం చూపేందుకు మన రాజకీయ వ్యవస్థ కనీస ప్రయత్నం చేయటం లేదు. పార్టీ నిధుల సేకరణకు లోక్‌సత్తా కృషితో వచ్చిన చట్టంలో మార్పులు చేసి బాండ్ల విధానం ప్రవేశపెడితే, అందులోని లోపాల గురించి కాకుండా పార్టీ రాజకీయాలతో ఒకరి మీద ఒకరు బురద జల్లుకున్నారు. ఆ చట్టం ద్వారా విరాళాలకు ప్రతి రూపాయికీ లెక్కలు ఉన్నా, అంతకంటే అనేకరెట్లు ఎక్కువ డబ్బుని ఎన్నికల్లో చట్టవిరుద్ధంగా ఎందుకు ఖర్చు చేయాల్సి వస్తోంది అన్న చర్చను తీసుకురాలేదు. నిజాయతీ రాజకీయానికి నిజాయతీ డబ్బు అవసరం. అదేవిధంగా పార్టీలో ఎంత పెద్ద నాయకుడైనా సభ్యుల నిర్ణయాన్ని ఆమోదించాల్సి ఉంటుందని జపాన్ రాజకీయ వ్యవస్థ స్పష్టం చేసింది. అలాంటి ప్రజాస్వామ్య వాతావరణం మన రాజకీయ పార్టీల్లో ఉందా? అలాంటి ప్రజాస్వామికీకరణ లేకుండా రాజకీయంలో, పాలనలో ప్రజా స్వామ్యం ఎలా సాధ్యమవుతుంది?

ఈ నేపథ్యంలో ఇతర దేశాల్లో పరిణామాలను మనం మరింత బహుముఖంగా, లోతుగా చర్చించాలి. కొన్ని విషయాల్లో చాలా దేశాల కంటే, చివరకు ప్రపంచంలోని పరిణతి చెందిన ప్రజా స్వామ్య దేశాల కంటే కూడా మెరుగ్గా ఉన్నాం. అదే సమయంలో వారి నుంచి మనం నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. ఆర్థిక రంగంలో ఉన్న అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవటంతో పాటు, ప్రజాస్వామ్య సంస్కరణల్ని వేగవంతం చేస్తే ఎదిగే అవ కాశాలు అందరికీ అందుబాటులోకి వచ్చి సుస్థిరాభివృద్ధి సాధ్యమవుతుంది.

❖

### దేశీయంగా సత్తా పెంచుకోవాలి

అంతర్జాతీయ సంబంధాలు, రాజకీయంలో పోటీతత్వం ఉంటుంది. చైనా వంటి పొరుగుదేశం ఉన్నప్పుడు.. పోటీ పడటాన్ని మనం నేర్చుకోవాలి. మనం పదే పదే ఫిర్యాదులు చేసినా చైనా తన చర్యలను ఆపబోదు. దేశీయంగా మన సత్తా పెంచుకోకుంటే.. మన విదేశీ విధానం మన దేశీయ విధానమంత మెరుగ్గా ఉండబోదు. తయారీ రంగాన్ని బలోపేతం చేసుకుంటే మన సామర్థ్యాలు మెరుగుపడతాయి. దీనివల్ల.. ప్రపంచాన్ని ప్రభావితం చేసేలా మన విదేశాంగ విధానానికి మరిన్ని వనరులు సమకూరుతాయి.

– జైశంకర్, విదేశీ వ్యవహారాల మంత్రి

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## September 2024! జుగాడ్ 50:50 రాజనీతి

### కోట్లాది భావజాలాల సంకెళ్లనుండి విముక్తి చెందిన "ఓటర్లే" ప్రభువులు!

### నమూనామార్పుకి సమయం ఆసన్నమైంది.

### "జుగాడ్ ఓటర్ల మద్యపాన స్వయం-నియంత్రణ" ప్రతిపాదన

(ముందుగా జుగాడ్ ఓటర్ గా నమోదైన KHS శర్మ గారికి స్వాగతం!) "మన పొలిటికల్ పార్టీలు మనని 1) డబ్బు 2) మద్యం ద్వారా blackmail చేస్తూ మనజీవితాల్ని శాసిస్తున్నాయి. దేశంలో జరుగుతున్న పరిణామాలే అందుకు సాక్ష్యం" - అని జనబలం ఏప్రిల్ 2024 సంచికలో ప్రస్తావించడం జరిగింది. ఎన్నికల జూదంలో డబ్బు,మద్యం పార్టీలకు ప్రధానపెట్టుబడి. ఓట్ల కొనుగోలుకి డబ్బునీ, ఓటర్ల ను నిషాలో ముంచడానికి మద్యాన్నీ ఉపయోగించుకుంటాయి. అందుకు జాతీయఎన్నికల కమిషన్ పరోక్షంగా. సహకరిస్తోందా ?! ఓటర్ల మద్యపానపు అలవాట్లను పార్టీలు తమ పార్టీ సంక్షేమంగా భావించి, ఐదేళ్లపాటు నిరాటంకంగా నడిపేప్రభుత్వాలు ఓటర్లకు అనవసరం. అటువంటి అన్నిపార్టీల "అధినేతలకూ", "సుప్రీమోలకూ" జుగాడ్ ఓటర్లు గౌరవపూర్వకంగా సమర్పిస్తున్న ప్రతిపాదనలు:

1) ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ 2023 డిసెంబర్ లోనూ మరియూ 2024 ఏప్రిల్ లో జరిగిన ఎన్నికలలో ఓటు వేసిన తమరుకూడా ఓటర్లే. "సంపూర్ణమద్యపాన నిషేధం" అనే అద్భుతాన్ని సంపూర్ణంగా మహిళలే పురుషుల సంపూర్ణ సహకారంతో సాధించినరోజు పేద-మధ్య తరగతి ప్రజల సంపూర్ణారోగ్యం సాధ్యం. అంతవరకూ, సుపరిపాలన దిశగా, తెలుగు రాష్ట్రాలు సమిష్టిగా కృషి చేయాలి. IASలు - IPSలు, MLAలు, MPలు, మంత్రులు, ముఖ్యమంత్రులు, నేటి ఆధునిక స్త్రీలతోసహా, అందరిలోనూ మద్యపానప్రియులు ఉన్నారని (ముఖ్యంగా పాత్రికేయులు) గ్రహించి, ఈ ఓటర్ల నందరినీ మద్యం వినియోగదారులు (consumers)గా ఏపార్టీకి చెందిన ప్రభుత్వమైనా ఆమోదించాలి.

2) మద్యం సేవించడం నైతికమా అనైతికమా అనే విషయాన్ని స్వయంగా ఓటర్లే తేల్చుకోగలరు. మద్యనిషేధం వంకతో - స్వార్థంతో చట్టాలను తయారు చేసి ఓటర్లను మోసం చేయడం కొన్ని పొలిటికల్ పార్టీలఅధినేతలకు అలవాటుగా మారింది. నీతి శాస్త్రానికి సంబంధించిన విషయాలను 1997 లో ఏర్పడ్డ మన రాజ్యసభలోని ఎథిక్స్ కమిటీ ద్వారా చర్చించి, అనంతరం ఒక జాతీయ లిక్కర్ పాలసీ అమలులో పెట్టాలి.

3) ఈ మధ్యనే మళ్ళీ అధికారంలోకి వచ్చిన ఏపీ ముఖ్యమంత్రి తొందరపడి, ఆల్కహాల్ 40 శాతం ఉన్న క్వార్టర్ బాటిల్ కలిన మద్యం ధర మాత్రమే 200 రూపాయల నుండి నూరు రూపాయలు తగ్గిస్తామని ప్రకటించారు. కానీ, ఆల్కహాల్ 5 శాతం లోపున ఉండే తేలికపాటి బీరుని ఆహారపానీయంగా చట్టసవరణ చేసి. ప్రస్తుతం 150 రూపాయిలకు అమ్ముతున్న 650 ML సీసాబీరుని, పదేళ్లుగా గత ప్రభుత్వాలు ఇప్పటిదాకా చేసిన దోపిడీని నియంత్రించి, 50 రూపాయిలకు సూపర్ మార్కెట్ల ద్వారా GSTవిధానం ద్వారా అందించవచ్చు.

4) మద్యం అమ్మకం ప్రభుత్వమే నిర్వహిస్తే నిరుద్యోగ సమస్య తగ్గుతుంది. రెండు రాష్ట్రాల సంబంధిత అధికారులు మాట్లాడుకుని ఒకే రేట్లు ప్రకటిస్తే స్మగ్లింగ్ జరగదు. ప్రీపెయిడ్ కార్డు ద్వారా అమ్మకాలు జరిపి వినియోగదారులకు స్వయం నియంత్రణ వీలు కల్పించాలి.

**Contact: Jugaad Parthasarathy (9866416798) With (1) MLA Constituency name (2) your name and gender (3) your age (4) your. Cell No:**

Advt

# చేనేతరంగ సంక్షోభం

చేనేత వస్త్రాలు కళాత్మక రూపాలు. వాటి తయారీకి వెచ్చించాల్సిన కార్మికుల శ్రమ, తయారీకి పట్టే కాలం రెండూ ఎక్కువే. చేనేత పరిశ్రమకు యంత్రాలతో తయారయ్యే మిల్లు, పవర్‌లూమ్ వస్త్రాలతో పోటీపడే పరిస్థితి లేదు. నేత కళాకారుల కష్టాలు తీరితేనే ఈ రంగం వెలుగులు విరజిమ్ముతుంది.

చేనేత రంగాన్ని మెరుగు పరిచేందుకు చాలాకాలంగా కృషి జరుగుతోంది. హ్యాండ్లూమ్ (రిజర్వేషన్ ఆఫ్ ఆర్టికల్స్ ఫర్ ప్రొడక్షన్) యాక్ట్, 1985 ప్రకారం కాటన్, సిల్క్, ఊలుతో తయారయ్యే చీరలు, ధోవతులు, లుంగీలు, తువాళ్లు, అంగవస్త్రాలు, శాలువాలు తదితర పదకొండు రకాల ఉత్పత్తులు చేనేత రంగానికి రిజర్వు చేశారు. చేనేత మగ్గాలకు అవసరమయ్యే చుట్టల రూపంలో ఉండే నూలు కొరత రాకుండా చూడటం అవసరం. అందుకుగానూ స్పిన్నింగ్ మిల్లుల్లో తయారయ్యే నూలులో ముప్పయి శాతం తప్పనిసరిగా చుట్టల రూపంలో ఉండాలనే నిబంధన విధించారు. చేనేత అభివృద్ధికి అనేక పథకాలు జాతీయ స్థాయిలో అమలవుతున్నాయి. 2021-26 వరకు అమలు చేయడానికి జాతీయ చేనేత అభివృద్ధి కార్యక్రమాన్ని (ఎన్‌హెచ్‌డీపీ) రూపొందించారు. ఇందులో పలు పథకాల ద్వారా చేనేత ఉత్పత్తులకు, కార్మికులకు తోడ్పాటు అందిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు దేశంలో అభివృద్ధి చేయడానికి ఎనిమిది పెద్ద చేనేత క్లస్టర్లను గుర్తించారు. వాటిలో ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి, అస్సాంలోని శివసాగర్, తమిళనాడులోని విరుధనగర్, తిరుచ్చి, పశ్చిమబెంగాల్‌లోని ముర్షీదాబాద్, ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, ప్రకాశం జిల్లాలు, ఝార్ఖండ్‌లోని గొడ్డా, దాని చుట్టుపక్కల జిల్లాలు, బిహార్‌లోని భాగల్పూర్ వంటివి ఉన్నాయి. ప్రభుత్వ పథకాలు చేనేతకు కొంతమేర చేయూత ఇస్తున్నా, ఆదరణ తగినంత పెరగడం లేదు. చేనేత కార్మికుల ఆర్థిక స్థితిగతులు పెద్దగా మెరుగుపడటం లేదు.

**చుట్టుముట్టిన సమస్యలు**

చేనేత ఉత్పత్తులకు పవర్‌లూమ్, మిల్లు వస్త్రాల నుంచి తీవ్ర పోటీ ఉంది. ఈ రంగానికి రిజర్వు చేసిన ఉత్పత్తులను పవర్‌లూమ్స్ కూడా తయారుచేసి విక్రయిస్తున్నాయి. వాటినీ చేనేత వస్త్రాలుగానే చలామణి చేస్తున్నారు. దానివల్ల నేత కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటున్నా, పవర్‌లూమ్స్ చేనేత ఉత్పత్తులను తయారుచేసే ప్రక్రియకు అడ్డుకట్ట పడటం లేదు. చేనేత ఉత్పత్తులపై, నూలు, రంగులు మొదలైన ముడిసరకులపై పన్నుపోటు మరో పెద్ద సమస్య. వీటన్నింటిపై జీఎస్టీ ఎత్తివేయాలని చేనేత కార్మికులు, కార్మిక సంఘాలు విజ్ఞప్తులు చేస్తున్నా ఫలితం ఉండటం లేదు. అన్ని రకాల వస్త్ర ఉత్పత్తులపై పన్ను పెరిగినా, వివిధ వర్గాల ఆందోళనలతో అమలును వాయిదా వేశారు. ఇలాంటి సమస్యలకు తోడు, చేనేత వస్త్రాల మార్కెట్ విస్తరించకపోవడం ఆ రంగాన్ని పట్టిపీడిస్తోంది. చేనేత వస్త్రాల గురించిన సరైన అవగాహన ప్రస్తుత యువతరానికి కొరవడింది. మరోవైపు యువత అభిరుచులు, ఫ్యాషన్ల గురించిన అవగాహన చేనేత కార్మికులకు ఉండటం లేదు. ఈ పరస్పర అవగాహనారాహిత్యం చేనేత వస్త్రాల మార్కెట్ విస్తృతికి అడ్డంకిగా మారుతోంది. డిజైన్లు, రంగులు, శైలి మొదలైన అంశాల్లో ఆధునికీకరణ లేకపోవడం చేనేత మార్కెట్ విస్తరణకు అవరోధమవుతోంది. వీటి ఎగుమతులు కొన్నేళ్లుగా ఏటా రూ.2500 కోట్లు మించి పెరగడం లేదు. ఈ రంగంలోని స్తబ్దత, కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

– వర్షిత్



**మారితేనే భవిత**

చేనేత రంగం ఆధునికతను సంతరించుకొని, ప్రస్తుత ధోరణులకు తగ్గట్లుగా రూపాంతరం చెందకపోతే భవిష్యత్తు

లేదు. కాబట్టి, ఇందుకు ప్రభుత్వాలతోపాటు ఆ రంగం అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలు తోడ్పడాలి. ప్రస్తుతం అన్ని రకాల వస్తువుల అమ్మకాలు అధికంగా ఇ-కామర్స్ వేదికల ద్వారా జరుగుతున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా డిజిటల్ మార్కెటింగ్ పెరుగుతోంది. ఇలాంటి అవకాశాలను చేనేత కార్మికులు, సంస్థలు ఉపయోగించుకోవాలి. మారుతున్న యువతీయువకుల దుస్తుల శైలినీ అధ్యయనం చేయాలి. కొనుగోలుదారుల్లో చేనేత ఉత్పత్తులపై అవగాహన పెంచాలి. ప్రభుత్వాలు అప్పుడప్పుడు తమ ఉద్యోగులు తప్పనిసరిగా వారానికి ఒకరోజు చేనేత ఉత్పత్తులు ధరించాలని సూచిస్తుంటాయి. ఈ సూచనలను ఉద్యోగులు నిర్దిష్టంగా పాటిస్తే, సమాజంలోని మిగిలిన వర్గాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ప్రభుత్వమే కాకుండా ప్రైవేటు సంస్థలు కూడా ఇటువంటి సూచనలు తమ ఉద్యోగులకు ఇవ్వడం ద్వారా ఈ రంగానికి తోడ్పాటు అందించవచ్చు. చేనేత ఒక గొప్ప సాంస్కృతిక వారసత్వమనటంలో సందేహం లేదు. ఉత్పత్తులు, మార్కెటింగ్‌లో ఆధునిక పోకడలను అందుకోగలిగితే ఆదాయాలు కూడా పెరుగుతాయి. కానీ ఎంతచేసినా ఒక పరిధి దాటి చేనేత రంగం ఆదాయాలున్న ఉపాధిని అందించలేదు. సాంస్కృతిక వారసత్వం పేరుతో పేదరికాన్ని కొనసాగించలేం. అందువల్ల ఆసక్తి ఉన్నవారికి ప్రత్యామ్నాయ రంగాల్లో నైపుణ్యాల శిక్షణ ఇవ్వటంతోపాటు చేనేత కుటుంబాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించే ఏర్పాటు చేయాలి. తమకు నచ్చిన రంగంలో సంపద సృష్టించే అవకాశం ఇవ్వాలి. అదేవిధంగా చేనేత కార్మికుల్లో అనారోగ్య సమస్యలు ఎక్కువ. దీనివల్ల వారి ఉత్పాదక శక్తి దెబ్బతింటోంది. అందువల్ల ప్రతి చేనేత కుటుంబానికి ఎటువంటి ఆర్థికభారం లేకుండా మంచి ప్రమాణాల వైద్యం అందించాలి. చేనేతల జీవితాల్లో మార్పుకి అందరూ అండగా నిలవాలి. ❖

**ఎంతచేసినా ఒక పరిధి దాటి చేనేత రంగం ఆదాయాలున్న ఉపాధిని అందించలేదు. సాంస్కృతిక వారసత్వం పేరుతో పేదరికాన్ని కొనసాగించలేం. అందువల్ల ఆసక్తి ఉన్నవారికి ప్రత్యామ్నాయ రంగాల్లో నైపుణ్యాల శిక్షణ ఇవ్వటంతోపాటు చేనేత కుటుంబాల్లో పిల్లలకు నాణ్యమైన విద్య అందించే ఏర్పాటు చేయాలి. తమకు నచ్చిన రంగంలో సంపద సృష్టించే అవకాశం ఇవ్వాలి.ప్రతి చేనేత కుటుంబానికి ఎటువంటి ఆర్థికభారం లేకుండా మంచి ప్రమాణాల వైద్యం అందించాలి.**

# రెవెన్యూ సదస్సులపై శిక్షణ ఇవ్వండి

రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయటానికి ముందే రెవెన్యూ సమస్యలు, పరిష్కారంపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్నతాధికారులకు తగిన శిక్షణ ఇవ్వాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ఈ మేరకు రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి ఆర్.పి సిసోడియాని విజయనగరం కలెక్టర్ కార్యాలయంలో కలసి వినతిపత్రం ఇచ్చారు. ప్రజల ఫిర్యాదుల్లో రెవెన్యూ వివాదాలు ఎక్కువగా ఉన్నాయని, అర్జీలు తీసుకుని పరిష్కరించకపోతే ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం ఉండదన్నారు. చట్టబద్ధపాలన పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగేలా సమస్యల్ని పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో పౌర వేదిక కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములయ్యే విధానాలు

భారతదేశం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని, అందుకు తగిన అవకాశాలు, వనరులు ఈవేళ అందుబాటులో ఉన్నా యని బాబ్జీ అన్నారు. అభివృద్ధి కోసమే కాకుండా, అందరూ భాగస్వాములయ్యేలా విధానాలను అమలు చేయాలన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయనగరంలో నిర్వహిం చిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

స్వాతంత్ర్య యోధుల త్యాగఫలాలు సామాన్యులకు అందేట్లు చూడా లన్నారు. విద్యాప్రమాణాల్ని పెంచాలని, యువతకి నైపుణ్యాలు అందించే చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఢిల్లీ నుంచి పల్లె వరకు ప్రభుత్వాలు తగిన ఏర్పాట్లు చెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి, సంక్షేమనాన్ని పాలకులు రెండు కళ్లుగా పరిపాలన సాగిం చాలన్నారు. పౌరుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడినప్పుడే దేశం లో సమానత్వం, సౌభ్రాతృత్వం లభిస్తాయన్నారు. జెండా పండుగలో పార్టీ నాయకులు నాగభూషణం, రాజా రావు, పి.ఎల్.ఎన్ రాజు, రాయి పద్మావతి, అప్పారావు, లక్ష్మణ్, రమేష్, సిమ్మ శ్రీను, పౌర వేదిక ప్రతినిధులు ప్రభాకరరావు, ఇప్పలవలస గోపి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# సమ్మిళిత అభివృద్ధి కోసం సరైన ప్రశ్నలు అడుగుదాం

2024 ఎన్నికల సమయంలో మన దేశంలో రాజకీయ విమర్శలు ఏ స్థాయికి చేరాయో అందరం చూశాం. ఎన్నికలకు ఎండా కాలం కూడా తోడవటంతో విమర్శలు ప్రకంపనల స్థాయికి చేరాయి. మోదీ ఎన్నికైతే రాజ్యాంగాన్ని తిరగరాస్తారని, దేశంలో ఇక ఎన్నికలు జరగవని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ 'ఇండియా' కూటమి ప్రచారం చేయగా, కాంగ్రెస్ పార్టీ కూటమి అధికారంలోకి వస్తే దేశంలో మెజారిటీ మత విశ్వాసుల ఆస్తులను లాక్కొని ముస్లింలకు పంచుతారని మోదీ మతపరంగా వ్యాఖ్యలు చేశారు. ఇక ఈవీఎంల మీదయితే ప్రధాన విపక్షాలు విపరీత ఆరోపణలు చేశాయి. ఈ ఎన్నికల్లో మోదీ ఈవీఎంల ట్యాంపరింగ్ ద్వారా ఫలితాల్ని



మారుస్తున్నారన్నట్లు, ఈసీ విశ్వసనీయతపై ఆరోపణలు చేశారు. ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో సుప్రీంకోర్టు సూచించినట్లు ప్రధాన న్యాయమూర్తికి అవకాశం ఇవ్వకపోవటం ఎన్నికల్లో అక్రమాల కోసమేననే రీతిలో ఆరోపణలు చేశారు. కానీ, ఎన్నికల ప్రక్రియ అంటే కమిషనర్లు మాత్రమే కాదు, మొత్తం ప్రభుత్వ యంత్రాంగమంతా ఆ సమయంలో ఎన్నికల సంఘంలా పనిచేస్తారన్నది వాస్తవం. ఎన్నికల కమిషనర్లుగా ఎవరిని నియమించినా ఫలితాల్ని తారుమారు చేసిన దాఖలాలు లేవు. ఎమర్జెన్సీ తర్వాత ఇందిరాగాంధీ ప్రధానిగా ఉన్నప్పుడు కూడా ఎన్నికల్ని నిష్పాక్షికంగా, నిర్భీతితో నిర్వహించిన చరిత్ర మన ఎన్నికల సంఘానికి ఉంది. ఈ వాస్తవాల్ని పరిగణలోకి తీసుకోకుండా, ఈసీ విశ్వసనీయతను దెబ్బతీయటం వల్ల ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయత దెబ్బతింటుందన్న బాధ్యతాయుత ఆలోచన సైతం లేకుండా ఆరోపణలు చేశారు. మన దేశంలో ప్రజాస్వామ్యం ఎంత మెరుగ్గా ఉందో బంగ్లాదేశ్‌లో ఇటీవలి పరిణామాల్ని చూసినా అర్థమవుతుంది.

**ప్రజాస్వామ్యమంటే, కొన్ని ప్రమాణాలు అవసరం:**

1) పోటీతో కూడిన ఎన్నికలు జరగాలి. ఎక్కువమంది ప్రజలు ఎవరిని ఎన్నుకుంటే వారు ప్రభుత్వ నేతలవుతారు.

2) ప్రజలను సమీకరించటానికి ప్రతిపక్ష రాజకీయ పార్టీలకూ హక్కు ఉంటుంది.

3) ఎన్నికలలో ఓడిపోయిన ప్రభుత్వాలు దిగిపోతాయి, గెలిచినవారు ఓడిపోయినవారిని జైల్లో పెట్టరు.

ఈ కనీస ప్రమాణాలు కొరవడటం వల్ల బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యం బలహీనపడి ప్రజల్లో అసంతృప్తి పేరుకు పోయింది. వారి ఫిర్యాదుల్ని, అభిప్రాయాల్ని స్వేచ్ఛగా చెప్పుకోవటానికి ప్రతిపక్షం కరువవటం, ఎన్నికల్లో పోటీ చేయటానికి మార్గం లేకుండా ప్రతిపక్షాన్ని అణచివేయటం, ఎన్నికల్ని ఏకపక్షంగా జరపటం వల్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు మరింత పెరిగాయి. రిజర్వేషన్ల పరిణామాల వల్ల అవి ఒక్కసారిగా బద్దలయ్యాయి. భారత్‌లో ప్రజాస్వామ్యానికి ఈ కనీస ప్రమాణాలున్నాయి. మిగతా అనేక లోపాల గురించి ఎన్నయినా మాట్లాడొచ్చు, వాటిని సవరించటానికి సంస్కరణలు తేవటం లేదని విమర్శించొచ్చు, తాము అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యాన్ని ఎలా బలోపేతం చేస్తామో చెప్పవచ్చు, కానీ మన దేశంలో ప్రజాస్వామ్యమే లేదు, ఒక వ్యక్తిని గద్దె దించితే ప్రజాస్వామ్యం ఉంటుందని చెప్పటం ముందుచూపు లేకుండా వ్యవహరించటం, ప్రజల్ని పక్కదోవ పట్టించటం. వారి వాదనల్లో పస లేదని ఎన్నికల ఫలితాలు స్పష్టం చేశాయి. మన ప్రజాస్వామ్యం లోపభూయిష్టమైనదేగానీ, నిజమైనది, బలమైనది అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డా. జయప్రకాష్ నారాయణ్ లాంటి వారు చెబుతున్న మాటలు వాస్తవమని రుజువు చేశాయి. ఈవీఎంలపై, అక్కడక్కడా జరిగిన కొన్ని ఘటనలపై ఈసీ విఫలమైందన్నట్లు ఆరోపణలు చేసిన ప్రతిపక్షాలు ఆ విషయాలపై ఆ తర్వాత నిశ్శబ్దమయ్యాయి. గతంలో కూడా ఎన్నికల్లో ఓడిపోయినప్పుడు ఈవీఎంలపై ఆరోపణలు చేసినవారు ఆ తర్వాతి ఎన్నికల్లో గెలిచాక ఈవీఎంల మీద ఎటువంటి ఫిర్యాదులు లేకుండా సంబరాలు చేసుకున్నారు. కాబట్టి ఎన్నికల సంఘంపై ఆరోపణలను పట్టించుకోకుండా, ఏ ఆకాంక్షలతో తాము ఓటు వేశారో ఆ ఆ ఆకాంక్షల్ని ప్రభుత్వాల ద్వారా ఎలా సాధించుకోవాలో ప్రజలు ఆలోచించటం అవసరం. ప్రలోభాలపర్వంలో చిక్కుకుని తమ ఆకాంక్షల

విషయంలో భ్రమపడకూడదంటే, ఏ ఎజెండా ద్వారా ఇవి సాధ్యమో గుర్తించాలి. లేకుంటే మరికొన్నేళ్లపాటు, ఇంకా చెప్పాలంటే కొన్ని ఎన్నికలపాటు ఈ లక్ష్యం వాయిదా పడే అవకాశముంది.

తాజా ఎన్నికల్లో ప్రజలు ప్రస్తుత సాంప్రదాయ రాజకీయ పరిధిలోనే తెలివిగా ఓట్లు వేశారు. పోలింగ్ బూత్ బయట ఎన్ని ప్రలోభాలున్నా, ఓట్ల కొనుగోలున్నా ప్రజలు బూత్ లోపల స్వేచ్ఛగా ఓటు వేసి తమ అభిప్రాయాల్ని చాటారు. ఎన్నికలు స్వేచ్ఛగా జరగటమేకాకుండా, ప్రజాస్వామ్యంలో ప్రజల్ని ఎవరూ తక్కువగా అంచనా వేయవేయకూడదనే సందేశాన్నిస్తూ, ఉన్నంతలో తమ సాధికారతను పెంచుకునేలా, తద్వారా మెరుగైన ప్రజాస్వామ్యానికి దోహదం చేసేలా తీర్పునిచ్చారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొదటిసారిగా ప్రజలు ఈ ఎన్నికల్లో ఒక విస్పష్ట సందేశాన్నిచ్చారు. తమకు సంక్షేమం మాత్రమే చాలదు, అభివృద్ధి కూడా కావాలని చాటారు. అదేవిధంగా, ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి చాలదని, అభివృద్ధి కొందరికే పరిమితం కాకుండా అందరికీ కావాలన్నారు. ఈ సందేశం 2023లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లోనే కనిపించగా, ఆ ఒరవడి ఈ ఏడాది ఎన్నికల్లో కూడా దేశంలోని చాలాచోట్ల కనిపించింది. అందువల్ల అభివృద్ధి కనిపిస్తున్న పట్టణ ప్రాంతాలలో అధికార పార్టీకి అనుకూల ఫలితాలు రాగా, ఆ ఫలాలు అంతగా అందని, ప్రజల జీవితాల్లో అభివృద్ధి అంతగా కనిపించని పలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రతికూల ఫలితాలు వచ్చాయి. ప్రజలు అభివృద్ధికి పట్టం కడుతూనే, ఆ అభివృద్ధి అందరికీ అందాలి, సమ్మిళిత అభివృద్ధి కావాలనే సందేశాన్నిచ్చారు.

**ఈ లక్ష్యాన్ని ప్రభుత్వాల ద్వారా సాధించుకోవటం ఎలా?**

అభివృద్ధి గురించి ప్రభుత్వాలు, కొందరు నాయకులు మాట్లాడుతున్నారు. ముఖ్యంగా జాతీయస్థాయిలోని మోదీ ప్రభుత్వం ఆర్థికాభివృద్ధి విషయంలో రాజకీయ సంకల్పంతో వ్యవహరిస్తోంది. నాలుగు ట్రిలియన్ డాలర్ల జాతీయాదాయంతో ప్రస్తుతం భారత్ ప్రపంచంలో అయిదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, జర్మనీని అధిగమించి త్వరలో మూడో ఆర్థిక వ్యవస్థగా రూపుదిద్దుకుంటుందని చెబుతున్నారు. 2047 సంవత్సరానికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధిస్తుందని ప్రకటిస్తున్నారు. కచ్చితంగా భారత్‌కి ఈ అరుదైన అవకాశం ఉంది. యువ జనాభా అతి ఎక్కువగా ఉండటం, సాంకేతిక పరిజ్ఞానం, గతంలో పాలకులు తప్పనిసరి పరిస్థితుల్లోనైనా తెచ్చిన సంస్కరణలు, చేసిన కొన్ని మంచి పనుల వల్ల మనకు ఈ అవకాశం లభించింది. కానీ ఇదేమీ మన హక్కు కాదు. మనం కొన్ని పనులు సవ్యంగా చేయటం, కొన్ని తప్పులు చేయకుండా ఉండటం ద్వారా మాత్రమే సాధ్యం. మనకున్న వృద్ధి రేటు 7% పైగా ఉందని ఇప్పుడు నమ్మకంగా ఉన్నాం. గతంలో అనేక

**2047 సంవత్సరానికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని సాధిస్తుందని ప్రకటిస్తున్నారు. కచ్చితంగా భారత్‌కి ఈ అరుదైన అవకాశం ఉంది. యువ జనాభా అతి ఎక్కువగా ఉండటం, సాంకేతిక పరిజ్ఞానం, గతంలో పాలకులు తప్పనిసరి పరిస్థితుల్లోనైనా తెచ్చిన సంస్కరణలు, చేసిన కొన్ని మంచి పనుల వల్ల మనకు ఈ అవకాశం లభించింది. కానీ ఇదేమీ మన హక్కు కాదు. మనం కొన్ని పనులు సవ్యంగా చేయటం, కొన్ని తప్పులు చేయకుండా ఉండటం ద్వారా మాత్రమే సాధ్యం.**

దేశాలు ఈ స్థాయికి చేరుకున్నాయని మనం విస్మరించ కూడదు. అయితే అభివృద్ధి చెందిన దేశం కావటానికి వాటిలో చాలావరకు చివరి దశలో విఫలమయ్యాయి. 'వరల్డ్ డెవలప్‌మెంట్ రిపోర్ట్ 2024: ద మిడిల్ ఇన్‌కం ట్రాప్' పేరిట ప్రపంచ బ్యాంక్ ఇటీవలి నివేదిక ప్రకారం, 1990 నుంచీ చూస్తే.. కేవలం 34 మధ్యాదాయ దేశాలే, అధికాదాయ దేశాలుగా మారాయి. అందులో మూడోవంతు దేశాలు యూరోపియన్ యూనియన్‌లోకి వెళ్లటం వల్ల ప్రయోజనం పొందినవే. వచ్చే కొన్ని దశాబ్దాల్లో అధికాదాయ దేశాలుగా మారటానికి భారత్ సహా 100కి పైగా దేశాలు తీవ్ర అడ్డంకులను అధిగమించాల్సి రావొచ్చు. తలసరి ఆదాయం విషయంలో సంపన్న దేశాలతో పోటీపడటానికి సవాళ్లు ఇంకా తీవ్రమైనవి. భారత్‌కు అటువంటి వైఫల్యంలో చిక్కుకోకూడదంటే, ప్రభుత్వం చెబుతున్నట్లు 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే, 7-8 శాతం వృద్ధి రేటుని వచ్చే పాతికేళ్లపాటు తదేకంగా మనం కొనసాగించగలగాలి. ఇది సాధ్యం, గతంలో చైనా సాధించి చూపింది. కానీ మనం విధానాలు మార్చుకోకుండా ఇది సాధ్యం కాదు. ఇందుకోసం సమ్మిళిత అభివృద్ధి ఎజెండాను ఆర్థిక క్రమశిక్షణతో అమలు చేయాలి. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, మౌలిక సదుపాయాలు, స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు, గ్రామాలకు, పట్టణాలకు మధ్య అంతరాన్ని తగ్గించటానికి చిన్న పట్టణాల అభివృద్ధి, వ్యవసాయంలో ఆదాయాల్ని పెంచటం, పెట్టుబడుల్ని, తయారీ రంగాన్ని ప్రోత్సహించి ఉపాధి అవకాశాల్ని సృష్టించటం మొదలైన అంశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అమలు చేయాలి. ప్రతి పార్టీ ఈ ఎజెండాను ఎన్నికలకతీతంగా చూడాలి. ఆర్థిక అసమానతల పేరుతో

**ఎన్నికలు పార్టీల కోసం కాదు, పార్టీల్ని ఓటు వేసే ఆ ఒక్కరోజు మనం నియంత్రించగలం, బుద్ధి చెప్పగలం. మిగతాదంతా పార్టీల మధ్య వ్యవహారం, అని ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడుతారు అని ఉత్కంఠగా ఎదురుచూడటం, ఎన్నికలైపోయాక వాళ్లూవాళ్లూ తేల్చుకుంటారు, మనం వచ్చే ఎన్నికల వరకు ఎదురుచూడటం తప్ప చేయగలిగిందేమీ లేదు అనికాకుండా, ఎన్నికల మధ్యకాలం నుండీ మనం గొంతు వినిపిస్తుండాలి. అన్ని వైపుల నుండి ప్రజాభిప్రాయం వస్తుంటే, ప్రభుత్వాలు కచ్చితంగా ఆ ఎజెండాకు అనుగుణంగా పాలనను మళ్లించకతప్పదు.**

అభివృద్ధికి అవరోధాలు కల్పిస్తున్నవారు, అప్పులు చేసైనా వ్యక్తిగత తాత్కాలిక సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నవారు కూడా అభివృద్ధి ద్వారా మాత్రమే ఆదాయాలు పెరుగుతాయని, ఆదాయాలుంటేనే ఆర్థిక అసమానతల్ని పరిష్కరించటం సాధ్యమని గుర్తించాలి. ఆదాయాలే లేకుంటే అసమానతలు అన్న చర్చ కూడా రాదు గదా! ఉదాహరణకి, స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఆర్థిక సంస్కరణల్ని ప్రారంభించిన 1991 వరకు దేశంలో పేదరికం రేటు 50% దాకా ఉంది, సోషలిస్టు విధానాలను అనుసరించినా సరే. అయితే 1991 నుండి 2011 మధ్యకాలంలో భారత్‌లో పేదరికం 20% మేర తగ్గింది. సుమారు 35 కోట్ల మందిని ఈ సమయంలో దుర్భర పేదరికం నుంచి బయటపడ్డారు. వాస్తవానికి ప్రజలు కోరుతున్న సమ్మిళిత అభివృద్ధికి, ప్రభుత్వాలు చెబుతున్న, మనందరం ఆశిస్తున్న 2047 లక్ష్యానికి ఇదెంతో కీలకం. ఈ వాస్తవాల్ని గుర్తించకుండా 30 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం భారత్‌కి వచ్చి తీరుతుందన్నట్లు, విజయం సాధించేసినట్లు వ్యవహరించటం వల్ల ఎంత ప్రమాదమో గతంలో అలాంటి దేశాల అనుభవాల నుంచి నేర్చుకోవాలి.

**ఈ నేపథ్యంలో, సమ్మిళిత అభివృద్ధి కోసం ప్రజలు సరైన ప్రశ్నల్ని సంధించాలి.**

☞ ఎందుకు రోజుకు లక్షన్నర మంది కేవలం ఆస్పత్రుల్లో వైద్యం కోసం అప్పులు చేసి పేదలుగా మారిపోతున్నారు?

☞ ఎందువల్ల ఏటా లక్షలమంది అకాల మరణం బారినపడుతున్నారు, నివారించదగ్గ రోగాలకు గురై ఉత్పాదకశక్తిని కోల్పోతున్నారు?

☞ ఎందుకు హైస్కూలు విద్యార్థి రెండో తరగతి లెక్కలు చేయలేకపోతున్నాడు?

☞ 16 ఏళ్ల వయసొచ్చినా గడియారం చూసి నిమిషాలు, సెకన్లతో టైమ్ చెప్పలేని విద్యార్థులు నూటికి 40-50 మంది ఉండటానికి కారణమేమిటి?

☞ ఇంజినీరింగ్ చదివినా, మార్కెట్లో ఉపాధి అవకాశాలున్నా, వాటిని అందుకునే నైపుణ్యాలు ఎక్కువమందికి ఎందుకు ఉండటం లేదు?

☞ ఎవరోకరి సిఫార్సు లేకుండా పోలీస్ స్టేషన్‌కి వెళ్లటానికి ప్రజలు అంత భయపడాల్సిన పరిస్థితులు ఎందువల్ల కొనసాగుతున్నాయి?

☞ ఎందుకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు లేకుండా పనులు జరగటం లేదు?

☞ కార్మికశక్తిలో మహిళల భాగస్వామ్యం చాలా వెనుకబడిన దేశాల్లో కంటే మన వద్ద తక్కువగా ఉండటానికి కారణ మేమిటి?

☞ ఎందువల్ల చట్టం అందరికీ సమానంగా అమలవటం లేదు? డబ్బున్నవాళ్లలా పేదవాళ్లు ఎందుకు బెయిల్ తెచ్చుకోలేకపోతున్నారు? కోర్టులకెళ్తే న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేక సెటిల్‌మెంట్ల కోసం గూండాలను ఆశ్రయిస్తున్నారు?

☞ స్థానికంగానే పరిష్కారమవ్వాల్సిన పనులకు ఎందుకు హైదరాబాద్, అమరావతి, ఢిల్లీలకు వెళ్లాల్సి వస్తోంది?

☞ ఎందువల్ల రైతులు కష్టపడి పండించిన పంటకు న్యాయమైన ధర రావటం లేదు?

☞ ఇప్పటికీ దేశంలో పనిచేసేవారిలో 85 శాతం మంది జీవనభద్రత లేకుండా అసంఘటిత రంగంలో ఉన్నారు?

ఎన్నికల సమయంలోనే మనం ఈ ప్రశ్నలు అడగగలం అనుకోవాల్సిన పనిలేదు. అది వాస్తవం కాదు. ఎన్నికల మధ్య కాలంలో ఈ ప్రశ్నలు అన్ని వైపుల నుండి వస్తుంటే ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయలేవు. ఎన్నికలు పార్టీల కోసం కాదు, పార్టీల్ని ఓటు వేసే ఆ ఒక్కరోజు మనం నియం త్రించగలం, బుద్ధి చెప్పగలం. మిగతాదంతా పార్టీల మధ్య వ్యవహారం, అని ఎవరు గెలుస్తారు, ఎవరు ఓడుతారు అని ఉత్కంఠగా ఎదురుచూడటం, ఎన్నిక లైపోయాక వాళ్లూవాళ్లూ తేల్చు కుంటారు, మనం వచ్చే ఎన్నికల వరకు ఎదురు చూడటం తప్ప చేయగలిగిందేమీ లేదు అని కాకుండా, ఎన్నికల మధ్యకాలం నుండీ మనం గొంతు వినిపిస్తుండాలి. అన్ని వైపుల నుండి ప్రజాభిప్రాయం వస్తుంటే, ప్రభుత్వాలు కచ్చితంగా ఆ ఎజెండాకు అనుగుణంగా పాలనను మళ్లించక తప్పదు. ప్రతిపక్షాలు కూడా అందుకోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించే కార్యక్రమాల్ని రూపొందించకతప్పదు.

ఏదోకరకంగా ప్రజలను బురిడీ కొట్టిస్తూ వారి ఆకాంక్షల్ని వాయిదా వేసే కంటే, అరకొర అమలుతో, ఓటుబ్యాంకు రాజ కీయాలతో రిస్కు తీసుకునే కంటే సమ్మిళిత అభివృద్ధికి అవ సరమైన ఎజెండాను అమలు చేయటం రాజకీయ పార్టీలకు కూడా లాభం. ❖

# శక్తికి మించిన హామీలు, నాణ్యత లేని వ్యయం

## -ప్రభుత్వాలపై పెరుగుతున్న అపనమ్మకం-




**భారత్‌లో రాజకీయ పార్టీలు శక్తికి మించిన హామీలిస్తున్నాయని ఆర్థికవేత్త, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా అర్థశాస్త్ర ఆచార్యులు కార్తీక్ మురళీధరన్ పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యయంలో నాణ్యత చాలా తక్కువగా ఉంటోందన్నారు. పౌర సేవల్లో లోపాల కారణంగా తీవ్ర నష్టం వాటిల్లుతోందని విశ్లేషించారు. సర్కారీ సేవలు ప్రజలకు సక్రమంగా చేరకపోవడం ప్రధాన సమస్యగా మారిందన్నారు. చెన్నైకి చెందిన కార్తీక్ మురళీధరన్.. 'సెంటర్ ఫర్ ఎఫెక్టివ్ గవర్నెన్స్ ఆఫ్ ఇండియన్ స్టేట్స్' అనే సంస్థ సహ వ్యవస్థాపకులు. 'యాక్సలరేటింగ్ ఇండియాస్ డెవలప్‌మెంట్' అనే పుస్తకం రచించారు. భారతదేశ ఆర్థిక పరిస్థితి, పరిపాలనలో పారదర్శకత, హామీల అమలులో వైఫల్యం, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం దక్కకపోవడం తదితర అంశాలను అందులో విశ్లేషించారు. వాటిపై 'ఈనాడు' ప్రత్యేక ప్రతినిధి ఎం.ఎల్ నరసింహారెడ్డికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆచార్య కార్తీక్ వెల్లడించిన ముఖ్యాంశాలివీ..**

**ప్రభుత్వంపై నమ్మకం దెబ్బతింటుందని మీరు అంటున్నారు. రాజకీయపార్టీలు ప్రజావిశ్వాసానికి ప్రాధాన్యం ఇస్తున్నాయంటారా?**

అధికార పక్షాలు చేయగలిగినదాని కన్నా ఎక్కువ చేస్తామని హామీలిచ్చి, అందులో కొన్ని చేయలేక తప్పుకోవడం వల్ల ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య నమ్మకం సన్నగిల్లుతుంది. ప్రస్తుత మన వ్యవసాయ పద్ధతులు ద్రవ్యపరంగా, పర్యావరణపరంగా సుస్థిరమైనవి కావని, సంస్కరణలు అవసరమని నిపుణులందరూ చెబుతున్నారు. అయితే వాటి గురించి చర్చించటం సంక్లిష్టంగా మారింది. 2021లో రైతుల ఆందోళన సందర్భంగా ఏర్పడిన ప్రతిష్టంభనకు నమ్మకం లేకపోవటమే ప్రధాన కారణం.

**ప్రభుత్వాలు చేసే వ్యయంలో నాణ్యత లోపించిందనే అంశంపై మీ విశ్లేషణ ఏమిటి?**

ప్రభుత్వ పెట్టుబడుల నుంచి రాబడి చాలా తక్కువగా ఉంటోంది. సంక్షేమ పథకాల అమలు సరిగా లేదు. ప్రాజెక్టులు దీర్ఘకాలం కొనసాగడం వల్ల వాటి నిర్మాణ వ్యయం గణనీయంగా పెరుగుతోంది. సంక్షేమ కార్యక్రమాలు ఆర్థిక సామర్థ్యాన్ని తగ్గిస్తున్నాయి. రైతు సంక్షేమం గురించి ఖర్చు చేయటాన్ని విమర్శించటం కాదు. కానీ, ఉచిత విద్యుత్తు చూడండి. దీని వల్ల ఎక్కువ భూమి ఉన్న రైతులకే అధిక ప్రయో జనం. ప్రజల కోసం చేసే ఖర్చు ఎంత నాణ్యతతో కూడు కున్నదనేది చాలా ముఖ్యం.

**ఈ విశ్లేషణకు దోహదపడిన అంశాలేంటి?**

ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలు సమర్థంగా పనిచేయకపోవడానికి గల కారణాలపై జరిగిన ఓ అధ్యయనం ప్రకారం అవినీతి వల్ల వృధా అవుతున్నది 17 శాతం సొమ్మే. అసమర్థత, యాజమాన్య లోపం, గవర్నెన్స్ సరిగా లేకపోవడం మిగిలిన 83 శాతం వృధాకు ప్రధాన కారణం. పెట్టుబడి వ్యయానికి తగ్గట్టుగా తిరిగి ఫలితాలు వస్తున్నాయా లేదా అన్నది ఆలోచించడం లేదు. ప్రాజెక్టుల నిర్మాణంలో, నిర్వహణలో అన్నింటా లోపాలే. కాగ్ నివేదికలు చూస్తే ఈ విషయాలు తేట తెల్లమవుతాయి. ప్రభుత్వాలు వీటి గురించి పట్టించుకోవడం లేదు. దేశవ్యాప్తంగా పరిస్థితి ఇలాగే ఉంది.

**దేశంలో ప్రభుత్వ యంత్రాంగ సామర్థ్యాన్ని మీరెలా చూస్తున్నారు?**

కొన్ని విషయాల్లో అది అద్భుతంగా ఉంది. అతి పెద్ద జనాభా లెక్కల సేకరణ, ఎన్నికలు, టీకాలు వంటి కార్యక్రమాలు ఈ కోవలోనివే. కానీ అదే యంత్రాంగం విద్య, ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రజాభద్రత, న్యాయం తదితర మౌలికమైన ప్రజాసేవ




**భారతదేశం ఒకవైపు వేగంగా వృద్ధి చెందుతోందని చెబుతున్నా, ఇంకోవైపు నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండటానికి కారణమేంటి?**

నా అంచనా ప్రకారం ఎగువన ఉన్న పదిశాతం దేశ ఆర్థిక వృద్ధిలో ఎక్కువగా భాగస్వాములయ్యారు. వారు కల్పించే ఉద్యోగాలు, ఇతర సర్వీసు రంగాల్లో 30 నుంచి 40 శాతం జనాభా ఉపాధి పొందుతున్నారు. మరో 50 శాతం ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి ప్రభుత్వసాయం అవసరమవుతోంది. ఈ కారణంగానే దేశ రాజకీయాలు సంక్షేమ కార్యక్రమాల చుట్టూ తిరుగుతున్నాయి. ఈ పార్టీ ఎన్ని ఎక్కువ సంక్షేమ పథకాలు ప్రకటిస్తుందా అని చూసే పరిస్థితి నెలకొంది. సరళీకరణ తర్వాత పెట్టుబడి సామర్థ్యం, విద్య ఉన్నవారి వృద్ధి పెరిగింది. అయితే వృద్ధిలో భాగస్వాములు కాలేకపోతున్నవారికి సరైన చేయూతనివ్వాలి. ఇది వారి పురోగతికి, దేశ పురోగతికి ఉపయోగపడుతుంది. ఇది జరగాలంటే మంచి విద్య, ఆరోగ్యం లాంటి ప్రాథమిక సేవలు సక్రమంగా అందేలా చూడాలి.

లను పటిష్ఠంగా అమలు చేయడానికి ఇబ్బంది పడు తోంది. ఒక లక్ష్యం ఉండి, నిర్దిష్ట గడువుతో పనులు చేయవలసి వచ్చినప్పుడు ఇండియన్ బ్యూరోక్రసీ విజయవంతమవుతోంది. రోజువారీ కార్యక్రమాలు, అవసరమైన నిధులు, సిబ్బంది, నైపుణ్యం, స్వతంత్రత, పనులకు నిర్దిష్టమైన లక్ష్యం లేనప్పుడు విఫలమవుతోంది.

**స్వతంత్ర వ్యవస్థలు, ప్రభుత్వాల మధ్య సమన్వయంపై మీ విశ్లేషణ..**

దేశంలో స్వతంత్రత కలిగిన వ్యవస్థలు ఉండటం చాలా ముఖ్యం. ప్రభుత్వాల సామర్థ్యం పెరగటానికి అవి దోహదపడతాయి. ఈ కారణంగానే ప్రత్యేక బాధ్యతలతో కొన్ని సంస్థలు పనిచేస్తున్నాయి. సివిల్ సర్వీసు నియామకాల్లో నాణ్యత కోసం యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్, ప్రజాధనం వినియోగంలో ప్రభుత్వ శాఖలు ఎంత బాధ్యతగా వ్యవహరించాయో నిర్ధారించడానికి కాగ్, సరైన గణాంకాల సేకరణకు నేషనల్ స్టాటిస్టికల్ కమిషన్ (ఎన్ఎస్‌సీ), అలాగే ఆర్‌బీఐ వంటి సంస్థలన్నీ స్వాతంత్ర్యం తర్వాత దేశ నిర్మాణంలో భాగంగా ఏర్పాటయ్యాయి. ఇవన్నీ కాలానుగుణంగా మారలేదు.

**స్వతంత్ర వ్యవస్థల్లో రావాల్సిన మార్పులేంటి?**

తగినన్ని నిధులు ఇవ్వకపోవడం, దూరదృష్టి లేకపోవడం వల్ల ప్రభుత్వ సామర్థ్యాన్ని పెంచడంలో ఈ వ్యవస్థలు ఆశించిన ఫలితాలు సాధించలేదు. యూపీఎస్సీని తీసుకుంటే నియామకాలు చేయడం వరకు సరే, తర్వాత సివిల్ సర్వీసు అధికారులు సమర్థంగా పనిచేస్తున్నారా లేదా అని చూసే విధానం లేదు. కాగ్ కూడా అంతే. ఏమి లోపాలు ఉన్నాయో చూడటం తప్ప ప్రజాధనం వ్యయంలో నాణ్యత ఉందా లేదా అని చూసే పరిస్థితి లేదు. గణాంకాల నమోదులో ఎన్ఎస్‌సి సమర్థంగా లేదు. ఇలాంటి సంస్థలను ఇంకా బలహీనపరచకుండా స్వతంత్రంగా పనిచేసేలా చూడాలి. తగిన నిధులు ఇవ్వాలి. దీర్ఘకాలంలో దేశ ప్రయోజనాలు, లక్ష్యాల గురించి ఈ వ్యవస్థలు ఆలోచించేలా తీర్చిదిద్దాలి.

> **మన దేశంలో వికేంద్రీకరణ గురించి మాట్లాడటం తప్ప ఆచరణలో అంతా కేంద్రీకృతమే. జీడీపీలో సుమారు మూడు శాతం నిధులనే స్థానిక సంస్థల ద్వారా ఖర్చు చేస్తున్నాం. అదే అంతా కేంద్రీకృతమనుకొనే చైనాలో 50 శాతం నిధులు వికేంద్రీకరణతో స్థానిక సంస్థలు ఖర్చు చేస్తున్నాయి.**

**75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత కూడా ఇండియా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలేమిటి?**

విద్య, వైద్యం, పౌష్టికాహార లోపం, ప్రజాభద్రత, న్యాయం, సామాజిక రక్షణ, ఉద్యోగుల నైపుణ్యం లాంటి అంశాల్లో అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. వాటిలో విద్య, వైద్యం ప్రధానమైనవి. విద్యకు ఏటా జీడీపీలో సుమారు మూడు శాతం వరకు ఖర్చు చేస్తున్నాం. 'ప్రథమ్' సర్వే లాంటివి రెండు దశాబ్దాలుగా చెబుతున్నదేమిటంటే.. గ్రామీణ ప్రాంతాల్లో అయిదో తరగతి పూర్తిచేసిన వారిలో సగం మంది పిల్లలు రెండో తరగతి పాఠ్యపుస్తకాన్ని చదవలేకపోతున్నారు. ఇది పెద్ద సమస్య. మొదట చదవడం నేర్చుకుంటాం, తర్వాత నేర్చుకోవడానికి చదువుకుంటాం, కానీ అయిదో తరగతి పూర్తయినా చదవలేకపోతున్నారంటే వారి విద్య అంతటితో ఆగిపోయినట్లే!

> **పౌర సేవలు అందించటంలో లోపం ఎక్కడుంది?**
>
> ఫెడరల్ వ్యవస్థలో అధికార వికేంద్రీకరణ చాలా ముఖ్యం. పౌర సేవల్ని స్థానిక ప్రభుత్వాలకు అప్పగించడం వల్ల ఫెడరల్ వ్యవస్థ పటిష్ఠంగా తయారవుతుంది. ఉద్యోగుల్లో కూడా జవాబుదారీతనం పెరుగుతుంది. ప్రపంచంలో అధికారాలను ఎక్కువగా కేంద్రీకృతం చేసిన దేశాల్లో ఇండియా ఒకటి. ప్రభుత్వాలు సమర్థంగా పనిచేస్తే దానివల్ల భారతీయులందరూ ప్రయోజనం పొందుతారు. పౌర సేవల్లో ప్రభుత్వాలు బలహీనంగా ఉండటం దేశ పురోభివృద్ధికి అడ్డంకిగా మారింది.

**మీరు ఎంతో ప్రధానమైనవిగా భావిస్తున్న విద్య, వైద్య రంగాలకు సంబంధించి మీ అధ్యయనాలు ఏవైనా ఉన్నాయా?**

ఉపాధ్యాయులు, వైద్యుల హాజరుకు సంబంధించి కొన్నేళ్ల క్రితం ఓ అధ్యయనం చేశాం. దేశంలో రెండువేల పాఠశాలలను పరిశీలిస్తే ఏ రోజు చూసినా 23.5 శాతం టీచర్ల గైర్హాజరీ ఉంది. వారి మీద పెట్టే ఖర్చు ఎంత అని అంచనా వేస్తే ఏడాదికి రూ.పదివేల కోట్లు! నిరంతర పర్యవేక్షణ ఉండే పాఠశాలల్లో తక్కువ గైర్హాజరీ ఉంది. పర్యవేక్షించే సూపర్‌వైజరీ పోస్టులు చాలావరకు ఖాళీగా ఉన్నాయి. సూపర్‌వైజరీ పోస్టులను భర్తీ చేస్తే వచ్చే ప్రయోజనం అధికం. అలాగే 40 శాతం వైద్యులు కూడా గైర్హాజరవుతున్నట్లు తేలింది.

**ఈ పరిస్థితుల్ని అధిగమించడం ఎలా?**

ఉపాధ్యాయుల జీతాలు పెంచడం వల్ల విద్యార్థుల లెర్నింగ్ స్కిల్స్ మెరుగుపడవు. టీచర్ల పనితీరు ఆధారంగా మూడు నుంచి అయిదు శాతం అదనపు చెల్లింపుల వల్ల ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. ఎలాంటి షరతులు లేకుండా జీతాలు పెంచడం కంటే ఇలా చేయడం వల్ల విద్యావ్యవస్థ పటిష్ఠంగా మారుతుంది. ఇంతమంది విధులకు హాజరుకావడం లేదంటే ప్రజాధనం వినియోగంలో నాణ్యత లోపించినట్లే కదా! పౌష్టికాహార లోపంతో ఉండే పిల్లల సంఖ్య మరే దేశంతో పోల్చిన భారత్‌లోనే ఎక్కువ. మరోపక్క ప్రభుత్వ ఆసుపత్రుల్లో తగినంతమంది సిబ్బంది లేరు. వనరులు తక్కువ. సిబ్బంది తరచూ గైర్హాజరవుతుంటారు. దీంతో 70 శాతం మంది ప్రజలు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్యంలో తగిన శిక్షణ లేనివారు కూడా ఎక్కువమంది ఉన్నారు. ప్రజలు ఆరోగ్యకరంగా ఉంటే ఆర్థిక పురోభివృద్ధిలో పాలుపంచుకొంటారు. ప్రభుత్వంలోని అన్ని స్థాయిల్లోనూ నిర్వహణపరంగా మార్పు జరగాలి. రాష్ట్రాలు, ముఖ్యమంత్రులు ఈ విషయంలో ముందడుగు వేయాలి. ❖


> **సంక్షేమ వ్యవస్థ సరైన తీరులో లేకపోవడం, నాణ్యమైన ఉద్యోగాలు కల్పించలేకపోవడం ఇండియా ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాళ్లలో కొన్ని. విద్య, వైద్యం, ప్రజాభద్రత తదితర సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. పన్ను వసూళ్లు కూడా జీడీపీలో సుమారు 18 శాతమే. అమెరికా, యూకేలతో పోలిస్తే ఇవి సగం కూడా లేవు.**

# ప్రాథమిక స్థాయి నుండి విద్యాప్రమాణాలు

- శ్రీరామ్



మన పాఠశాలల్లో ఎంత నాసిరకం విద్య మన పిల్లలకు అందిస్తున్నామో తెలియాలంటే మనం ఒకసారి అసర్ నివేదిక చదవాలి. అంతకంటే పెద్దషాక్, 2005 నుంచి వరుసగా వచ్చిన వార్షిక నివేదికల్ని చూస్తే, అన్ని నివేదికలూ కాస్త అటూఇటుగా ఒకేలా కనిపిస్తాయి. అంతలా పాఠశాల విద్యావ్యవస్థని నిర్లక్ష్యం చేశాం. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే కాదు, బడ్జెట్ ప్రైవేటు పాఠశాలల్లో కూడా పరిస్థితి ఇంచుమించు ఇలాగే ఉంది. కొంత నయం అంతే. అదేవిధంగా, అసర్ సర్వేలు ఎక్కువగా గ్రామీణ భారతదేశంలో జరిగినా, పట్టణ భారతంలో కూడా విద్యాప్రమాణాలు కాస్త అటూఇటుగా అంతే అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే ఈ సంక్షోభానికి పునాదులు పడుతున్నాయి. విద్యార్థులకు కాన్సెప్ట్‌లు పట్టుబడక ఫౌండేషనల్ లిటరసీ కొరవడుతోంది. మన పిల్లలకు ఏడాదికి 800 గంటల పాటు పాఠశాలలో విద్య బోధించాలి అని నిబంధనలు పెట్టారు. కానీ ఎందుకు ఇది అందడం లేదు, దానికి కారణాలు ఏంటి? మన టీచర్, స్టూడెంట్ రేషియో 18గా ఉంది. చూడటానికి ఇది బాగానే ఉన్నా మొత్తం రాష్ట్రంలో ఉన్న ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్యను బట్టి లెక్కవేశారు. అయితే లోతుగా చూస్తే పరిస్థితి వేరుగా ఉంది. ప్రాథమిక విద్యలో పాఠశాలలు ఎక్కువ, విద్యార్థులు తక్కువగా ఉన్నారు. దీనివల్ల ఏమి అవుతుందంటే ఒకే గదిలో 1-5 వరకు అన్ని తరగతుల పిల్లలు కూర్చుంటారు. ఒకే ఉపాధ్యాయుడు అన్ని తరగతుల పిల్లలకు విద్యాబోధన చేయవలసి రావడంతో ఎవరికీ సరైన సమయం కేటాయించలేకపోతున్నారు. పెద్దవారికి చెబుతున్నప్పుడు చిన్నవాళ్లకి, చిన్నవారికి చెబుతున్నప్పుడు పెద్దవాళ్లకి చెప్పే విషయంపై ఆసక్తి ఉండటం లేదు. పిల్లలకి 800 గంటలు కాదు కదా, సంవత్సరానికి 300 గంటల బోధన కూడా అందటం లేదు. పిల్లలకు ఫౌండేషన్ లిటరసీ అందకపోవటానికి ఇది ఓ  కారణంగా ఉంది. అదేవిధంగా ఎక్కువ సమయం పిల్లల్ని తరగతి గదుల్లో కూర్చోపెట్టే స్కూళ్లలో బోధన అంటే ఎక్కువగా బట్టీ పట్టించటంగా సాగుతోంది. అందువల్ల పైతరగతులకు వెళ్ళినప్పుడు వారిలో కూడా ఎక్కువమంది సరిగ్గా చదవలేకపోతున్నారు.
మరి పరిష్కారం ఏంటి? పాఠశాలలు మూసివేయండి. అవును, పాఠశాలలు కొన్ని మూసివేసి హేతుబద్ధీకరిస్తే, మిగిలిన వాటిల్లో తరగతికి కనీసం 30 మంది ఉంటే అప్పుడు పాఠశాలలు పాఠశాలల్లా నడుస్తాయి. ఒక తరగతిలో విద్యార్థికి ఉపాధ్యాయులు సరైన సమయం




కేటాయించగలుగుతారు. అప్పుడు ప్రతి విద్యార్థికి ఏడాదికి కనీసం 800 గంటలు ఆసక్తికరంగా నేర్చుకోవటానికి కావలసిన వైవిధ్యభరిత బోధన లభిస్తుంది. ఇలా కొన్ని పాఠశాలలు మూసివేయాలంటే 2 పనులు చేయాలి.

ఒకటి, ప్రతి ఊరిలో 2 కిలోమీటర్ల దూరంలో ఒక పాఠశాల అని కాకుండా, రెండు కిలోమీటర్ల దూరంలో లేక బస్సు ప్రయాణం అందుబాటులో ఉండేట్లు దగ్గరలో అని నిబంధన ఏర్పరచుకోవాలి.

రెండు, పిల్లలకు బస్సులో పాఠశాలకు వెళ్లే సదుపాయం ఏర్పాటు చేయటం. ఈ పని ఆర్టీసీ సహాయంతో తక్కువ ఖర్చుతోనే చేయవచ్చు. అలాగే మనకి రోడ్ల సదుపాయం బాగానే ఉంది కాబట్టి కొన్ని చోట్ల బస్సు సదుపాయం లేకపోయినా పిల్లలని వాళ్ళ తల్లిదండ్రులు పాఠశాలకి పంపిస్తారు. పాఠశాలలో మంచి విద్య నేర్పిస్తారని నమ్మకం కలిగించాలి గాని తల్లిదండ్రులు ఏమైనా చేస్తారు.

**ఇవి కాకుండా చేయవలసినవి ఇంకొన్ని ఏంటంటే:**

1. పిల్లలు ప్రతి తరగతిలో ఏమి నేర్చుకోవాలి అనే విషయం గూర్చి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తే వాళ్ళు కూడా కొంత పట్టించుకుంటారు.
2. ఏడాదికి 2,3 సార్లు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు (పీటీఎంలు) నిర్వహించాలి. ఎప్పుడైతే పిల్లలు ఏమి నేర్చుకోవాలో తల్లిదండ్రులకు ముందుగానే అవగాహన ఉంటుందో, అప్పుడు ఈ పీటీఎంలు చాలా బాగా ఉపయోగపడతాయి. కొంతమంది తల్లిదండ్రులు ఉపాధ్యాయులని కనుక్కుంటున్నా పాఠశాలలో కొంతమార్పు కచ్చితంగా వస్తుంది.
3. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలని బలపరిచి వారిని ప్రతి 2,3 నెలలకి సమావేశమయ్యే ఏర్పాటు చేయాలి. ప్రతి ఎస్ఎంసీలో పూర్వ విద్యార్థులు, ఎన్ఆర్ఐలను చేర్చాలి.
4. పిల్లలు, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే పిల్లలు, చూడటం, చేయటం వల్ల ఎక్కువ నేర్చుకుంటారు. వాళ్ళు గణితం, సైన్స్ నేర్చుకోవటానికి అనుగుణంగా కొన్ని కిట్స్ ఏర్పాటు చేయాలి. వాటికి పెద్ద ఖర్చు కూడా అవ్వదు.
5. ప్రాథమిక పాఠశాలల్లో కొంత డిజిటల్ కంటెంట్ వీడియోలు, కామిక్స్ ఏర్పాటు చేస్తే పిల్లలు చాలా తేలిగ్గా నేర్చుకుంటారు.


ఎప్పుడైతే ప్రాథమిక పాఠశాలలల్లో విద్యార్థులు కొంత (ఫౌండేషనల్ లిటరసీ) నేర్చుకోగలుగుతారో పై తరగతుల లోకి వెళ్లిన తరువాత ఇంకొంత రాణించ గలుగుతారు. విద్యాప్రమాణాలు తొలిస్థాయి నుంచే మొదలవటం ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలను అందించే నాణ్యమైన విద్యకు ఎంతో అవసరం. ❖

## పాఠశాలల్ని హేతుబద్ధీకరించండి

**ప్రభుత్వ పాఠశాలలను హేతుబద్ధీకరించాల్సిన అవసరముందని యూనియన్ విద్యాశాఖ తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల ఆధ్వర్యంలో 30,023 పాఠశాలలు నడుస్తుండగా.. వాటిలో 45.18% చోట్ల విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి దారుణంగా ఉన్నట్లు తెలిపింది. ఏకంగా 13,364 పాఠశాలల్లో పిల్లలు 50 మంది లోపే ఉన్నారని పేర్కొంది. సమగ్ర శిక్షా ప్రాజెక్టు ఆమోదిత మండలి (పీఏబీ) సమావేశం కోసం తెలంగాణ నుండి అందిన వివరాలను విశ్లేషించిన యూనియన్ విద్యాశాఖ.. వివిధ అంశాలపై రాష్ట్రానికి దిశానిర్దేశం చేసింది. పీఏబీ తీర్మానాలను ఇటీవల విడుదల చేసింది. రాష్ట్రంలోని 1213 పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా లేదని, 5821 పాఠశాలలు ఒకే ఉపాధ్యాయుడితో నడుస్తున్నాయని తెలిపింది. ఈ పరిస్థితుల్లో పాఠశాలలను హేతుబద్ధీకరించాలని, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలల్లో తగినంతమంది ఉపాధ్యాయులను నియమించాలంది. అంటే పిల్లలులేని పాఠశాలలను సమీపంలోని బడిలో విలీనం చేస్తే అప్పుడు అక్కడ ఉపాధ్యాయుల సంఖ్య పెరుగుతుందని యూనియన్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రాలకు సూచనలు చేసింది. తెలంగాణ పాఠశాల విద్యాశాఖ వర్గాలు మాత్రం తాజా బదిలీలు, పదోన్నతులతో చాలావరకు పరిస్థితిలో మార్పు వచ్చిందని చెబుతున్నాయి.**

**జాతీయస్థాయి ప్రభుత్వం మంజూరు చేసినా ఇప్పటికీ తెలంగాణలో 18.13% సైన్స్ ల్యాబ్‌లు, 11.70% కంప్యూటర్ ల్యాబ్‌లు, 71% నైపుణ్య విద్య ల్యాబ్‌లు పూర్తి చేయలేదని, వీటిని అందుబాటులోకి తేవాలని, డైట్లను విశిష్ట ప్రతిభా కేంద్రాలుగా మార్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా యూనియన్ సూచించింది.**

# ప్రగతి కోసం మతం




**శ్రీ నారాయణ గురు ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ సొసైటీ, గురు ధర్మప్రచారణ సభ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన 'సర్వమత సమ్మేళనం, వైక్కోమ్ సత్యాగ్రహం' శతాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ప్రసంగం ముఖ్యాంశాలు:**

ఏ మతంలోనూ లేని రీతిలో హైందవంలో పుట్టుకతో అసమానతల్ని మనం సృష్టించుకున్నాం. దాన్ని పూర్తిగా ఘనీభవింపచేశాం. ఓ మనిషిని ఎప్పుడైనా అంచనా వేయవలసింది ఆ మనిషి శక్తిసామర్థ్యాలు, ప్రతిభా పాటవాలు, పడే కష్టం, ఆ మనిషి వల్ల ఇతరులకు కలిగే ప్రయోజనం. ఈ మూడే మనకు కావాలి. ఈ మూడూ కాకుండా నువ్వు ఫలానా కులంలో, ఫలానా కుటుంబంలో, ఫలానా తల్లికో తండ్రికో పుట్టావు కాబట్టి గొప్పవాడివి, మరో బిడ్డ ఎంత అద్భుతమైన తెలివితేటలున్నా, ఎంతమంచి మనసున్నా, సమాజహితం కోసం ఎంతగా పోరాడినా కూడా నువ్వు ఫలానా తల్లి గర్భాన పుట్టావు కాబట్టి తక్కువ అని చూస్తే, అంతకంటే మానవజాతికి అవమానం ఇంకోటి లేదు. దురదృష్టంకొద్దీ మనం కొన్ని వేల సంవత్సరాలపాటు దాన్ని ఈ దేశంలో కొనసాగించాం, ఇప్పటికీ కొంతవరకు కొనసాగుతోంది. దీని వల్ల నష్టపోయేది మన సమాజం మొత్తం. అణగారిన వర్గాలు ఎలాగూ నష్టపోయారు, కానీ మిగతా సమాజం కూడా నష్టపోతోంది. ఓ మనిషి శక్తిసామర్థ్యాలను బట్టి, ప్రతిభను బట్టి సమాజం గుర్తించకపోతే, ఆ సమాజం మొత్తం ఆ మనిషి వల్ల కలిగే ప్రయోజనం పొందకుండా నష్టపోతుంది. ఆ నేపథ్యంలో నారాయణగురు అద్భుతమైన రీతిలో మార్పుని సాధించారు. తాను ఏ సాంప్రదాయంలో పుట్టారో ఆ సాంప్రదాయాన్ని, మతాన్ని త్యజించలా నారాయణ గురు. దాన్లో ఉన్న మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని, కులవ్యవస్థని త్యజించారు. మన సాంప్రదాయంలో ఉన్న గొప్ప విలువేమిటంటే, అద్వైతం. ప్రతి మనిషిలో దైవత్వం ఉంది. దేవుడు ఎక్కడో లేడు, జీవాత్మ, పరమాత్మ అంతా కలిసే ఉన్నాయన్నది అద్వైతం. పాశ్చాత్య సంస్కృతిలో ఈ మధ్యకాలంలో పాన్‌థీయిజం అంటున్నారు దానినే. భగవంతుడ్ని మనిషిలో చూసే శక్తి. ఆ దైవత్వాన్ని పెంచటం ఎట్లాగ, ఇతరుల్లో ఉన్న దైవత్వాన్ని గౌరవించటం, మానవ సంబంధాన్ని మెరుగుపరచటం ఎట్లాగ? దాని చుట్టూ ఆయన కేంద్రీకరించారు. అందుకే ఆచరణసాధ్యమైన ఒక తాత్విక చింతనను ప్రవేశపెట్టి, ఆ చింతనకు, మనిషి జీవితానికి మధ్య సంబంధాన్ని స్పష్టంగా అర్థమయ్యేట్లు చేసి మనుషుల ప్రవర్తనను మార్చ గలిగారాయన. చాలా కొద్దికాలంలో మార్చగలిగారు. అందుకే నారాయణ గురుని భారతీయ సమాజం నిరంతరం గుర్తుంచుకోవాలి, అనుసరించాలి. ఏ రకంగా ఈ సమాజంలో మనందరం ఒకే అంశం నుంచి వచ్చాం, ఏ రకంగా మనం వేర్వేరు కాదు, ఆ భావనని నరనరాల్లో ఇంకేట్లుగా ఎలా చేయాలి – ఈ విషయంలో నారాయణ గురు గొప్ప పని చేశారు. ఆయన 1856లో పుట్టి 1928లో పోయారు. అదే ప్రయత్నం నారాయణ గురు తర్వాత, 1920లో పుట్టి 2003లో పోయిన పాండురంగ అథవాలె చేశారు. పశ్చిమ భారతాన గుజరాత్, మహారాష్ట్ర తీరప్రాంతాల్లో స్వాధ్యాయ ఉద్యమాన్ని నిర్మించి, దాదాపు ఇదే బోధనలు, ఇదే పద్ధతి కొన్ని పదుల లక్షల జీవితాల్ని తన జీవితకాలంలో మార్చారు. ఆచరణసాధ్యమైన,

సమాజంలో సమూల మార్పు తెచ్చే తాత్విక చింతనకి నారాయణ గురు ఆద్యులయ్యారు. ఓ గౌతమబుద్ధుడు జీవితకాలంలో చేయలేనిది, ఒక మహావీర్ జైన్ చేయలేనిది, ఎందరో సంస్కర్తలు మన సాంప్రదాయంలో పుట్టినవారు చేయలేనిది నారాయణగురు చేశారు. అందుకే మనం శిరసు వంచి నమోవాకాలు అర్పించాలి.

రెండోది, అంతటితో ఆగకుండా నా మతం గొప్పది, నా సాంప్రదాయం గొప్పది, అందులో అందరూ సమానంగా ఉండాలి అనుకోలా ఆయన. మళ్లీ భారతీయ సాంప్రదాయంలోకి వెళ్తే, చాలాసార్లు చెప్తూ ఉంటాంగానీ, ఆచరించం. సత్యం ఏకత్ - విప్రా బహుధా వదన్తి. సత్యం ఒక్కటే, కానీ సత్యానికి వెళ్లే దారులు చాలా ఉన్నాయి. విజ్ఞులైనవాళ్లు రకరకాల దారులు వెతుక్కుంటారు. కానీ సత్యం వేరు కాదు. మతం అనేది మనిషి సృష్టించుకున్నటువంటి గొప్ప కాల్పనిక వ్యవస్థ. జంతువులకు మతం లేదు, జంతువులు ఇన్‌స్టింక్ట్‌తో బతుకుతాయి. తాము బతకటానికి, వేటాడో, కందమూలాలు తినో తనను తాము కాపాడుకోవటం, సంతానోత్పత్తి. ఏ రకంగా చూసినా, జంతువుల ప్రవర్తన ఈ రెంటి చుట్టూ తిరుగుతుంది. మానవ సమాజం వివిధ కారణాల వల్ల, ఒక విస్తృతమైన సమాజంగా ఏర్పాటైన తర్వాత భగవంతుడు అవసరమయ్యాడు. ప్రతి వ్యక్తి తన కోర్కెలు, తన స్వేచ్ఛ, తను అనుభవించాలనే కోర్కెతో ఇతరుల స్వేచ్ఛకు గనక అడ్డుకట్ట వేసినట్లయితే, సమాజం అల్లకల్లోల మవుతుంది. ఇన్‌స్టింక్ట్‌ని దాటాం కాబట్టి, ప్రకృతిని దాటాం కాబట్టి మనం కొన్ని నిబంధనలను సృష్టించుకోవాలి. అలా మతం ఉత్పన్నమైంది. వ్యక్తి మనుగడకి, సమాజ హితానికి మధ్య సంధానం చేయటం ఎట్లా? నా మనుగడ కోసం, నా కోర్కె తీర్చటం కోసం, నా అవసరం కోసం కచ్చితంగా నేను పోరాడాలి. మనందరం ఆ ప్రయత్నం చేస్తున్నాం. ఆకలేస్తే అన్నం తింటాం మనం. ప్రతి మనిషి చేసేది అదే. కానీ నా అవసరం తీర్చుకోవటం, నా మనుగడ కోసం ఇతరులకు అన్యాయం జరిగేట్లయితే, ఇతరుల స్వేచ్ఛకు ప్రతిబంధకం అయ్యేట్లయితే, ఇతరులను దెబ్బతీసినట్లయితే, వాళ్లు కూడా అట్లా చేస్తే మన బతుకు ఏమైపోతుంది? కాబట్టి వ్యక్తి స్వేచ్ఛ/ ప్రవర్తన, సమాజహితం ఈ రెంటినీ సంధానించటం అవసరం. దేవుడు, పుణ్యం, పాపం, స్వర్గం, నరకం అనే సాంప్రదాయాలను బట్టి. ఈ చింతన సమాజంలో తీసుకురావటం కోసం మతం వచ్చింది. వివిధ రూపాల్లో ఒక ప్రాంతంలో, ఒక ప్రవక్త వివిధ రీతుల్లో ప్రవచించి ఉండొచ్చుగానీ, మౌలికమైన అంశం ఇది.

ప్రతి మతం మనకు చెబుతున్నది, మన ప్రవర్తన ఎందుకని,

**ఆకలేస్తే అన్నం తింటాం మనం. ప్రతి మనిషి చేసేది అదే. కానీ నా అవసరం తీర్చుకోవటం, నా మనుగడ కోసం ఇతరులకు అన్యాయం జరిగేట్లయితే, ఇతరుల స్వేచ్ఛకు ప్రతిబంధకం అయ్యేట్లయితే, ఇతరులను దెబ్బతీసినట్లయితే, వాళ్లు కూడా అట్లా చేస్తే మన బతుకు ఏమైపోతుంది? కాబట్టి వ్యక్తి స్వేచ్ఛ/ ప్రవర్తన, సమాజహితం ఈ రెంటినీ సంధానించటం అవసరం.**

ఏ రీతిలో ఉండాలి అని. సరైన, క్రమశిక్షణతో కూడిన మార్గం. బలంతో చెలాయించే స్వేచ్ఛ కాకుండా, ఇతరులకు ఇబ్బంది కాకుండా మన ప్రవర్తన ఎట్లా ఉండాలి? అది మరచిపోతున్నారు. వివిధ ప్రాంతాల్లో, వివిధ రూపాల్లో మతం అనేది తీసుకొచ్చారు కాబట్టి, ఈ మతానికి, ఆ మతానికి మధ్య బోలెడంత యుద్ధం. అందుకే వివేకానందగానీ, నారాయణ గురు గానీ చెప్పారు - వివేకానందుడు చెప్పింది 'ఒక శంకరాచార్యుని జ్ఞాన సంపద, విజ్ఞత, ఒక బుద్ధుడి కారుణ్యం, ఒక జీసస్ క్రీస్తు ప్రేమ, ఒక మహమ్మద్ ప్రవక్త సౌభ్రాతృత్వం, సమానత్వ భావన' ఇవన్నీ కలిసిన సమాజం కావాలి. ఇవన్నీ మానవుడి అవసరం. కొన్ని మతాలు కొన్ని కోణాల్లో నుంచి సృష్టించి ఉండొచ్చు. కానీ ఈ నాలుగూ లేకుండా, జ్ఞాన సంపద, విజ్ఞత లేకుండా, కారుణ్యం, సానుభూతి, సమాజం పట్ల ప్రేమ లేకుండా, అందరూ సమానమనే భావం లేకుండా, సమాజం నడవదు. అది గుర్తించి, స్వామీజీ ఎక్కడో ప్రపంచంలో ఉన్న అన్ని మతాల పండితుల్ని, మత గురువుల్ని కేరళ తీసుకొచ్చారు. ఒక చిన్న పట్టణానికి తీసుకొచ్చారు. అలువ అనే పట్టణానికి 1924లో. అది కేవలం వందేళ్లు జరుపుకోవటం కాదు, ఇవాళ మతాల పేరుతో ప్రపంచంలో, దేశంలో ఘర్షణల నేపథ్యంలో మనకు మార్గనిర్దేశం. మనం మధ్యప్రాచ్యంలో చూస్తున్నాం, ఇతర దేశాలల్లో చూస్తున్నాం, మన దేశంలో అడపాదడపా చూస్తున్నాం, సత్యం ఏకత్, విప్రా బహుధా వదన్తి అని తెలిసినా కూడా కొన్ని సందర్భాల్లో అజ్ఞానానికి, మూర్ఖత్వానికి గురవుతున్నాం. నిరంతరం మనం అర్థం చేసుకోవాలి. వివేకానంద ఒక సందర్భంలో చెప్పారు - చీమకే గనక ఊహించే శక్తి ఉన్నట్లయితే, చీమకే దేవుడు ఉండేట్లయితే, చీమ దేవుడ్ని ఒక పేద్ద చీమగా ఊహించుకుంటుంది. మనం మనుషులం కాబట్టి, పేద్ద

మనుషుల్లా ఊహించుకుంటున్నాం. మతానికున్న ఆంతర్యాన్ని గుర్తించి, మనిషికి, సమాజానికి ఉన్న సంబంధాన్ని అన్వేషించటానికి వ్యక్తి ప్రవర్తన సమాజాన్ని దెబ్బతీయకుండా ఉండాలి. సమాజం వ్యక్తిని క్రూరంగా అణచివేయకుండా ఉండాలి. వ్యక్తి స్వేచ్ఛని కాపాడాలి, సమాజహితాన్ని కొనసాగించాలి.

మన దేశంలో నూటికి 99 మందికి భక్తి ఉన్నది, ఏదోకరకంగా దేవుడ్ని ఆరాధించేవాళ్లు. నిజమైన భక్తి ఉన్నట్లయితే, నిజమైన ఆధ్యాత్మికత ఉన్నట్లయితే, ఆ ఆధ్యాత్మికత వ్యక్తి ప్రవర్తనను నియంత్రించి మనిషిని సన్మార్గంలో నడిపిస్తే అంతకంటే గొప్ప మతం ఇంకోటి లేదు. అలాకాకుండా మతం పేరుతో వాడు తక్కువ, నేను ఎక్కువ అని చూపెట్టుకునేందుకైతే, అది మతం కాదు, రాక్షసత్వం. ఏ మతమైనా సరే. ఈ మాటలు కొంచెం పదునుగా అనిపించొచ్చు. కానీ మనిషిని మనిషిగా చూడనిది మతం కాదు. మానవత్వం కాదు.

మనం ఈవేళ ఏం చేయాలి? ఇప్పటికి కూడా కులవివక్ష, కులం అనే స్పృహ ఉన్నప్పటికీ, ముఖ్యంగా రాజకీయం దాన్ని పెంచి పోషిస్తోంది. కొద్దికొద్దిగా తగ్గేకాలంలో కూడా కులం పేరుతో మనం రాజకీయం నడుపుతున్నాం చాలావరకు. ఎందుకంటే, ప్రజల్ని ఒప్పించి, ప్రజల సమ్మతి పొంది, జనహితం కోసం పనిచేసే శక్తి ఎప్పుడైతే కొరవడిందో, వివిధ కారణాల వల్ల కులం పేరుతో, మతం పేరుతో, ప్రాంతం పేరుతో ప్రజల్ని సమీకరించటం చాలా తేలికైపోయింది. దేనికైనా స్పందించని వాళ్లయినా 'మన కులంరా' అనగానే పూనకం వచ్చేస్తుంది, 'మన మతంరా', 'మన ప్రాంతంరా' అనగానే పూనకం వచ్చేసింది. ఇంకా తప్పితే మన భాష అనగానే పూనకం వచ్చేస్తుంది. దేశాన్ని దోచుకునేవాళ్ళు కూడా చాలా తేలిగ్గా భక్తుల్లా నటించొచ్చు. ఎందుకంటే, నా కులానికి చెందినవాడు కదా, ఇక వాడు ఎలాంటివాడైనా మనోడు, ఆ మతంవాడు మనోడు, ఆ ప్రాంతంవాడు మనోడు, ఆ భాషవాడు మనోడు. చాలా తేలికైపోయింది. ఈ నేపథ్యంలో ఇవాళ మనం ఏం చేయాలి?

ఒక్కసారి రాజకీయాన్ని చూడండి. నేను మిగతా లోతుల్లోకి వెళ్లటంలా. ఎన్నికల్లో ప్రజలు ఏం చెబుతున్నారు అన్ని పార్టీలవాళ్లకీ? తాత్కాలికమైన వ్యక్తిగత సంక్షేమం కచ్చితంగా అవసరం ఈ దేశంలో. పేదరికం ఎక్కువ ఉన్నప్పుడు ఆ కష్టాల నుంచి ఉపశమనం అవసరం. కానీ అది చాలదు అని ప్రజలు చెబుతున్నారు. మీరు తెలంగాణ తీసుకోండి, కర్ణాటక తీసుకోండి, సంక్షేమాన్ని ప్రభుత్వాలు ఆ పేరుతో ఓటు తీసుకుని అధికారంలోకి వచ్చి అమలు చేసినా కూడా తిరస్కరిస్తున్నారు. అభివృద్ధి అవసరం ప్రజలకి. దానికి ఓటు

**మతం**
**పేరుతో వాడు తక్కువ, నేను ఎక్కువ అని చూపెట్టుకునేందుకైతే, అది మతం కాదు, రాక్షసత్వం. ఏ మతమైనా సరే. ఈ మాటలు కొంచెం పదునుగా అనిపించొచ్చు. కానీ మనిషిని మనిషిగా చూడనిది మతం కాదు. మానవత్వం కాదు.**

వేస్తున్నారు.
కానీ అభివృద్ధి ఒక్కటే
చాలదు అని చెబుతున్నారు, ఒక మోదీ గారు గానీ, గతంలో ఉన్న తెలంగాణ ప్రభుత్వం కావచ్చు, మరికొన్ని రాష్ట్రాల్లో కావచ్చు, అంటే ఏం చెబుతోంది సమాజం? అభివృద్ధి కావాలి, సంక్షేమం కావాలి, కానీ నా ఎదుగుదల కావాలి, నా పిల్లలకి ఎదిగే అవకాశాలు కావాలి. నేను బిచ్చగాడ్ని కాదు, నువ్వు దానకర్ణుడివి కాదు. అభివృద్ధి జరిగితే, దాని ఫలాలు కొందరికే అందితే అది చాలదు. నా పిల్లల సంగతేంటి? నాకెట్లా అందుతుంది? అంటే, ప్రజలు ఓటు భాష ద్వారా పుట్టుకతో వివక్షలేని సమాజాన్ని తీసుకురండి, ఎదిగే అవకాశాన్ని అందరికీ ఇవ్వండి అని కోరుతున్నారు. రాజకీయం నేర్చుకోవాల్సిన పాఠమది. ఒకరినొకళ్లు తిట్టుకోవటం కాదు, తొడ చరచుకోవటం కాదు, అవమానించుకోవటం కాదు. ఒక విశిష్టమైన సమాజం మనది, సంక్లిష్టమైన సమాజం. ఎన్ని కులాలు, ప్రాంతాలు, మతాలు, వర్గాలు, భాషలు! ప్రపంచంలో ఏ సమాజంలో చూడనన్ని ఉన్నాయి ఈ దేశంలో. ప్రపంచ జనాభాలో 18% మన దగ్గరుంది. ప్రపంచంలో ఎక్కడా లేనంత వైవిధ్యం ఉన్నది, బీదరికం ఉన్నది, కష్టం ఉన్నది, రుగ్మత ఉన్నది, అవిద్య ఉన్నది, అయినా ఈ సమాజం ఏకంగా ఉన్నది. కొన్ని అద్భుతాలు సాధిస్తోంది. కానీ ఈ ప్రజలు చెప్తున్నదాన్ని మనం అర్థం చేసుకోకపోతే, ఒక నారా యణ గురు బోధనల్ని ఈవేళ్టి అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దకపోతే ఇవన్నీ పోసుకోలు కబుర్లు అవుతాయి.

ఏ రకంగా ఎదిగే అవకాశాల్ని ప్రతి బిడ్డకీ కల్పించాలి? మంచి ప్రమాణాల విద్య, దేవుడో, ప్రకృతో, మీరు ఏది నమ్మితే అది అందించిన ఆ ప్రతిభ వికసించటం కోసం, విద్య ప్రతి బిడ్డకూ అందకపోతే, ఏ తల్లి గర్భాన పుట్టినా, మారుమూల పల్లెటూళ్లో పుట్టినా, మహానగరంలో పుట్టినా, అక్షరజ్ఞానంలేని తల్లిదండ్రులకు పుట్టినా, మహాజ్ఞాన సంపన్నులకు పుట్టినా, ఆ దేవుడో, ప్రకృతో ఇచ్చిన ప్రతిభాపాటవాల్ని వెలికితీయకపోతే, ఆ సమాజం చేస్తోంది భయంకరపాపం. ఆ పాపం భారతదేశంలో జరుగుతున్నంత

ప్రపంచంలో మరెక్కడా జరగటం లేదు. నేను ఈ దేశం పట్ల అపారమైన నమ్మకం ఉన్నవాళ్లలో ఒకడ్ని. ఆశావాదిని. కాబట్టి నేను కసితో, కోపంతో చెప్పటంలా. ఆవేదనతో, ఆర్తితో చెబుతున్నా. నా పిల్లలకు మంచి విద్య వస్తే, నా పిల్లలకు ఎదిగే అవకాశం ఉంటే తప్పకుండా మనం ప్రయత్నం చేయాలి. కానీ సమాజంలో మిగతా పిల్లల సంగతేంటి? వాళ్లు ఏ పాపం ఎరగకుండా, ఫలానా తల్లి గర్భాన పుట్టిన పాపానికి వాళ్లకి విద్య అందకపోతే? ఏం విద్య అందుతోంది మనకి? అందరినీ స్కూళ్లకి పంపుతున్నాం. నూటికి నూరుమందీ స్కూళ్లలో ఉన్నారు. కానీ నూటికి 80 మందికి పొట్టకోస్తే అక్షరం ముక్క రాని విద్య అందిస్తున్నాం, అబద్ధాలాడుతున్నాం, మనల్ని మనం మోసం చేసుకుంటున్నాం. ప్రపంచంలో అట్టడుగు స్థాయిలో ఉన్నాయి మన విద్యాప్రమాణాలు. ప్రతి బిడ్డా ఒక మాణిక్యమయ్యే అవకాశముంది. మట్టిలో మాణిక్యాల్లా నలిపేస్తున్నాం మనం. ఇంతకు మించిన పాపం లేదు. చాలా సులువుగా మార్చవచ్చు ఈ రాజకీయ వ్యవస్థ, ఈ పాలనా వ్యవస్థ, ఈ సమాజం తల్చుకుంటే, ప్రతి బిడ్డ శక్తిసామర్థ్యాలను వెలికితీయమే నిజమైన భక్తి. భగవంతుడుంటే ఆయన అనుగ్రహిస్తాడు. ప్రతి బిడ్డా దేవుడి ప్రతిరూపం అని మనం గుర్తించినట్లయితే, అంతకంటే మతానికి గొప్ప అర్థం ఇంకోటి ఉండదు.

రెండవ మహాపాపం, నివారించదగ్గ క్లేశం. మనిషన్నాక చనిపోవటం అనివార్యం. కానీ నివారించదగ్గ బాధలకు గురవటం అనివార్యం కాకుండా కాపాడుకునే ప్రయత్నం చేయాలి. నివారించదగ్గ క్లేశం – అకాల మరణం కావచ్చు, రోగం కావచ్చు, బాధ కావచ్చు, ఉండకూడదు. ఈ దేశంలో 5.5 కోట్ల మంది ఏడాదికి, సంవత్సరం మొదట బీదలుకానివారు సంవత్సరాంతానికి అనారోగ్యం కారణంగా బీదలైపోతున్నారు. ఇది నివారించదగ్గ క్లేశం. చాలా సులువుగా దీన్ని మార్చగలం. నా చిటికెన వేలికి దెబ్బ తగిలితే అది ప్రపంచ సమస్య, దానికి అత్యుత్తమ డాక్టర్ కావాలి, వైద్య చికిత్స కావాలి, లక్షల ఖర్చు కావాలి. అవతల అకారణంగా ప్రాణం పోతుంటే, వాడి జీవితం మసిబారు తుంటే, మనకేమీ పట్టదు. మనం డ్రామాలాడు తుంటాం. అదేం దైవభక్తి, దేశభక్తండీ, అదేమి సమాజ చింతనండీ!

మూడోది, మనకు ఇష్టమున్నా లేకున్నా, మనందరం పట్టణాల్లో ఉంటున్నాం. మాలో పెద్దతరం వాళ్లు, గ్రామాల నుంచి వచ్చాం, కుర్రాళ్లంతా పట్టణాల నుంచి వచ్చిన వాళ్లే. సంపద పట్టణాల్లో ఉంది. అవకాశాలు పట్టణాల్లో ఉన్నాయి, నైపుణ్యాలు అక్కడొస్తున్నాయి, ఆర్థిక వ్యవస్థ అక్కడ పెరుగుతోంది, దాన్ని మనం మార్చలేం. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో అది అనివార్యమైంది. అందరూ మహానగరాలకు వలస పొమ్మంటే, మారుమూల గ్రామాల నుంచి పొట్ట చేత పట్టుకుని ఆలనాపాలనా లేకుండా ఏం జరుగుతుందో కొవిడ్ టైంలో చూశాం. లక్షలమంది పొట్ట చేత పట్టుకుని కాలినడకన సొంతూళ్లకు వెళ్లారు. నరకం అనుభవించారు. మనకు మనసంటూ ఉంటే చెరువైపోవాలి. ఏనాటికీ దాన్ని స్మృతి పథంలో చెరిపివేయకూడదు. గుర్తుంచుకోవాలి. కాబట్టి చిన్న పట్టణాలు. చిన్న నైపుణ్యాలతో ఉపాధి పొందే అవకాశాలు. చుట్టూ సామాజికంగా కాపాడేవాళ్లుండే చిన్న పట్టణాలు పెరగాలి. ఒక సోషల్ సెక్యూరిటీ ఉండే ఏర్పాటు కావాలి. పెద్ద కష్టమైన పనులు కాదు మనసుంటే.

ఈ డ్రామాలు ఆపితే, సమాజం మనసు పెట్టి ఆలోచిస్తే, ఈ దేశంలో కులం, మతం, ప్రాంతంతో నిమిత్తం లేకుండా ప్రతి బిడ్డకీ ఎదిగే అవకాశాలు నూటికి నూరుపాళ్లూ ఇవ్వగలం. అప్పుడు మాత్రమే ఈ దేశంలో రాజకీయ స్థిరత్వం ఉంటుంది, అప్పుడు మాత్రమే నిజమైన దీర్ఘకాల ప్రగతి ఉంటుంది, అప్పుడు మాత్రమే ఈ సమాజంలో శాంతి ఉంటుంది. ఎవరి పట్లో ప్రేమతో మనం చేయనక్కర్లా, మన పిల్లల పట్ల మనకు ప్రేమ ఉన్నట్లయితే, ఈ సమాజంలో ప్రగతి కావాలి, సమాజంలో శాంతి కావాలి, సమాజంలో రాజకీయ స్థిరత్వం కావాలి, మనందరం స్వేచ్ఛను అనుభవించగలగాలి అన్నట్లయితే ఇది చేయటం అనివార్యం. ఇది చేయకపోతే మన తరాన్ని భగవంతుడనేవాడుంటే క్షమించడు. ఎందుకంటే, అద్భుతమైన అవకాశం ఈవేళ ఉంది. మానవ చరిత్రలో ఎప్పుడూలేని అవకాశం ఉంది. ఓ పక్కన వనరులూ ఉన్నాయి. ప్రపంచంలో ఎంత గొప్పవాడైనా, ఎంత గొప్ప సంపన్నుడైనా కోర్కెలకు తగ్గట్టుగా డబ్బులుండవు, కానీ నిజంగా మనం గనక భవిష్యత్తును కాపాడుకోవాలంటే, మనకు వనరులున్నాయి, పెరుగుతున్నాయి, అంతకుమించి సాంకేతిక విజ్ఞానం అందుబాటులోకి వస్తోంది. ఈ రెంటినీ సరిగ్గా ఉపయోగించుకునే మంచి విధానాలు ఉన్నట్లయితే, ఓ గౌతమ బుద్ధుడి కరుణ, ఓ శంకరుడి విజ్ఞత, ఓ జీసస్ ప్రేమ, ఓ మహమ్మద్ ప్రవక్త సౌభ్రాతృత్వం, దానిలో కొద్దిగానైనా, ఒక్క శాతమైనా అలవరచుకొన్నట్లయితే ఈ సమాజాన్ని సుసంపన్నం చేయగలం, ఈ సాంప్రదాయంలోని గొప్పతనాన్ని వెలికితీయగలం, దానిలో ఉన్న దుర్మార్గాన్ని అణచివేయగలం. ఈ శుభసందర్భంలో నారాయణ గురు స్మృతికి అంజలి ఘటిస్తూ, మీ అంద రితోపాటు, నోటి మాటలుగా, పైపైన కాకుండా మౌలికమైన మార్పుకి ఒక తరం కాలం లోపల నాంది పలికే అవకాశం ఉంది, ఆ నాంది పలకాలని, ప్రతి బిడ్డా ఆ మార్పుని చూసి సగర్వంగా తలెత్తుకు బతుకుతారని ఆశిస్తూ, మీ అందరికీ నమస్కరిస్తూ జైహింద్.

❖

## తెలుగు రాష్ట్రాల ప్రగతికి కీలకం

# పాఠశాల విద్యను బాగుచేయటం

**- అర్జున్**

ఇప్పటికే అప్పుల్లో కూరుకుపోయి ఆర్థిక సంక్షోభంలో ఉన్న ఆంధ్రప్రదేశ్‌కి తాత్కాలిక సంక్షేమ పథకాల ఖర్చు పెద్దభారంగా మారాయి. ఈ నేపథ్యంలో అభివృద్ధికి వేగంగా చర్యలు తీసుకోవటంతోపాటు, అందులో అందరికీ అవకాశం ఉండేలా, ఖర్చు తగ్గేలా సంక్షేమ పథకాలను కూడా పునర్వ్యవస్థీకరించాల్సి ఉంది. సమ్మిళిత అభివృద్ధిలో పాఠశాల విద్య అత్యంత కీలకమైనది. ఒక మెరుగైన ప్రైవేటు పాఠశాలలో ఫీజు కంటే ఎక్కువ మొత్తాన్ని ఏపీ ప్రభుత్వం ఇప్పటికే ప్రతి సంవత్సరం ఒక్కో విద్యార్థి మీద ఖర్చు చేస్తోంది. అయితే విద్య మాత్రం అందటం లేదు. నిజానికి తెలంగాణలోనూ ఇదే పరిస్థితి. సమాజంలో డిమాండ్ ఉండటం, అదనపు వనరులు అవసరంలేక పోవడం వల్ల ఏపీ ప్రభుత్వం చాలా తేలిగ్గా ఈ సంక్షోభాన్ని చక్కదిద్దగలదు. ఏపీ, ఆ మాటకొస్తే తెలంగాణ, ఇతర



రాష్ట్రాల పాఠశాల విద్యలో అవసరమైన, వెంటనే తేగలిగిన కొన్ని మార్పులపై చర్చించే ప్రయత్నం ఈ వ్యాసం:

**ప్రతిభను వెలుగులోకి తేవడంలో విద్య ప్రాముఖ్యత**

ప్రతీ వ్యక్తిలో సహజసిద్ధమైన సామర్థ్యాలు ఉంటాయి. ఇవి నాణ్యమైన విద్య ద్వారా పూర్తిగా వెలుగు చూస్తాయి. సరైన విద్యావకాశాలు లేకుండా, వ్యక్తులు తమ పూర్తిస్థాయి సామర్థ్యాలను అందుకోలేక సవాళ్లు ఎదుర్కొంటారు. ఫలితంగా పుట్టిన స్థలం, సామాజిక, ఆర్థిక నేపథ్యాలు వారి జీవితాల్ని శాసిస్తుంటాయి. అసమానతలు కొనసాగుతాయి.

**విద్యకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాధాన్యత**

వ్యక్తిగత, సామాజిక అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అంగీకరిస్తుంది. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు, ప్రతి ఏడాది సుమారు రూ.35,000 కోట్లను (2022-23 ఆర్థిక సంవత్సరం) పాఠశాల విద్యకు కేటాయిస్తోంది. ఉచిత యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, ఇతర సహాయక పథకాలు, ప్రచార కార్యక్రమాల ద్వారా ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలలో విద్యార్థుల నమోదు సంఖ్యను నూరుశాతం దాకా పెంచడంలో గణనీయ పురోగతిని సాధించింది. విద్యాహక్కు (ఆర్‌టీఇ) చట్టం ద్వారా నిర్ణయించిన జాతీయ ప్రమాణాలను మించిపోయి, ప్రాథమిక స్థాయిలో 25:1, ప్రాథమికోన్నత స్థాయిలో 15:1, ఉన్నత పాఠశాల స్థాయిలో 10:1 ఉపాధ్యాయులు-విద్యార్థుల నిష్పత్తిని కొనసాగిస్తోంది.

**తలసరి విద్యా ఖర్చులు**

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలో చేరిన ప్రతి విద్యార్థికి తలసరి వ్యయం రూ.82,272 (2022-23 ఆర్థిక సంవత్సరం). ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ పాఠశాలలో 1% నమోదు కోసం జీఎస్‌డీపీ వాటా 0.056% గా ఉంది. ఇది అమెరికా (0.036%), బ్రిటన్ (0.039%) తో పోలిస్తే గణనీయంగా ఎక్కువగా ఉంది.

**విద్యాఫలితాల్లో ఎదురవుతున్న సవాళ్లు**

ఈ భారీ పెట్టుబడులు, ప్రయత్నాలు ఉన్నప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో విద్యలో ఫలితాలు మాత్రం ఇంకా అధ్వాన్నంగా కొనసాగుతూన్నాయి. జాతీయ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) 2021 ప్రకారం, రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి స్థాయిలో గణితంలో 15% విద్యార్థులు మాత్రమే నైపుణ్యం కలిగివున్నారు.

**రాష్ట్రం ఏ దిశలో దృష్టి సారించాలి?**

**మూల్యాంకనం, విజయాన్ని పునర్నిర్వచించడం**

10వ తరగతి వార్షిక బోర్డు పరీక్షల ఉత్తీర్ణత శాతాలు, జాతీయ అచీవ్‌మెంట్ సర్వే (ఎన్ఏఎస్) ఫలితాలను పరిశీలిస్తే ఒక ఆందోళనకరమైన వ్యత్యాసం కనిపిస్తోంది. 10వ తరగతి బోర్డు పరీక్షలలో గణితంలో ఉత్తీర్ణత శాతం 80.3% కాగా, ఎన్ఏఎస్ డేటా ప్రకారం ప్రభుత్వ పాఠశాలల్లో 15%, ప్రైవేట్ పాఠశాలల్లో 27% విద్యార్థులు మాత్రమే గణితంలో తరగతి స్థాయి నైపుణ్యంతో ఉన్నారు. ఈ భారీ అంతరం బోర్డు పరీక్షల ప్రస్తుత మూల్యాంకన

విధానాల్లో లోపాన్ని సూచిస్తుంది. దీనివల్ల విద్యార్థులు సబ్జెక్ట్ మీద కాన్సెప్ట్ పరంగా లోతైన అవగాహన లేకపోయినా ఎక్కువ మార్కులతో ఉత్తీర్ణులు అవుతున్నారు.

**విజయాన్ని పునర్నిర్వచించడం**

తల్లిదండ్రులు అధిక ఫీజులు ఉన్నప్పటికీ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపడానికి మొగ్గు చూపుతున్నారు. యుడిఐఎస్ఇ+ డేటా ప్రకారం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో (గ్రేడులు 1-5) నమోదు 2015-16లో 56% నుండి 2019-20లో 50%కు తగ్గిపోయింది. అదే సమయంలో పై స్థాయిలో నమోదు 65% నుంచి 62%కు తగ్గింది.

ప్రైవేట్ పాఠశాలలు మెరుగైన విద్యాఫలితాలను అందిస్తాయనే భావన వల్ల ఈ మార్పు ఏర్పడింది. ప్రైవేట్ పాఠశాల విద్యార్థుల ప్రదర్శన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో పోలిస్తే స్వల్పంగా మెరుగ్గా ఉన్నదని అంచనా వేశారు. అయితే, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాఫలితాలు ప్రభుత్వ పాఠశాలల కంటే స్వల్పంగా మాత్రమే మెరుగ్గా ఉంటాయి.

ప్రభుత్వ పాఠశాలలే కాకుండా ప్రైవేట్ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందించడంలో లోపం ఉంది. నాణ్యమైన విద్యను మెరుగుపరచడానికి, ప్రభుత్వ పరీక్షా విధానాన్ని మార్చడం కీలకం. పరీక్షలను బట్టీవిధానాన్ని ప్రోత్సహించేలా కాకుండా, ఆలోచనాత్మకంగా, కాన్సెప్చువల్ అవగాహనను మెరుగుపరిచే విధంగా రూపొందించడం అవసరం.

**ప్రస్తుత పరీక్షా నమూనాలో 40% ప్రశ్నలు కాన్సెప్ట్‌కు సంబంధించి ఉండాలని ఆదేశించినప్పటికీ, ఈ ప్రశ్నలు తరచుగా పాఠ్యపుస్తకాల నుండి నేరుగా తీసుకుంటున్నారు. ఫలితంగా, విద్యార్థులు కాన్సెప్ట్‌లను నిజంగా అర్థం చేసుకోకుండానే సమాధానాలను కేవలం బట్టీపట్టి రాసే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించటానికి పరీక్షా విధానాన్ని సవరించటం అవసరం. విద్యార్థులు విమర్శనాత్మక ఆలోచన, విజ్ఞానాన్ని ఉపయోగించేలా పరీక్షలు నిజమైన కాన్సెప్చువల్ ప్రశ్నలకు ప్రాధాన్యతనిస్తూండాలి.**

ప్రస్తుత పరీక్షా నమూనాలో 40% ప్రశ్నలు కాన్సెప్ట్‌కు సంబంధించి ఉండాలని ఆదేశించినప్పటికీ, ఈ ప్రశ్నలు తరచుగా పాఠ్యపుస్తకాల నుండి నేరుగా తీసుకుంటున్నారు. ఫలితంగా, విద్యార్థులు కాన్సెప్ట్‌లను నిజంగా అర్థం చేసుకోకుండానే సమాధానాలను కేవలం బట్టీపట్టి రాసే అవకాశం ఉంటుంది. ఈ సమస్యను పరిష్కరించటానికి పరీక్షా విధానాన్ని సవరించటం అవసరం. విద్యార్థులు విమర్శనాత్మక ఆలోచన, విజ్ఞానాన్ని ఉపయోగించేలా పరీక్షలు నిజమైన కాన్సెప్చువల్ ప్రశ్నలకు ప్రాధాన్యతనిస్తూండాలి.

ఇటువంటి సవరణలతోపాటు, ప్రస్తుత వ్యవస్థలో విస్తృతంగా ఉండే కాపీయింగ్‌ను అరికట్టే చర్యలు చేపట్టడం అవసరం. పరీక్షలో ఎక్కువ కాన్సెప్చువల్ ప్రశ్నలు ఉండటం వల్ల విద్యార్థులు పరీక్ష సమయంలో పాఠ్యాంశాలలోని అంశాలలో ఎక్కువ నిమగ్నం కావాల్సి ఉంటుంది, తద్వారా అక్రమ మార్గాలకు సమయం, అవకాశాలు ఉండవు.

**డిటెన్షన్ పాలసీ ఆవశ్యకత**

'నో-డిటెన్షన్ పాలసీ'పై రాష్ట్రాలు, కేంద్ర పాలితప్రాంతాల అభిప్రాయాలను సేకరించడానికి సెంట్రల్ అడ్వైజరీ బోర్డు ఆఫ్ ఎడ్యుకేషన్ ఒక ఉప కమిటీని ఏర్పాటు చేసింది. డిటెన్షన్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలని 23 రాష్ట్రాల్లో 18 రాష్ట్రాలు ఈ సంప్రదింపుల్లో అభిప్రాయపడ్డాయి. విద్యాహక్కు చట్టానికి తాజా సవరణ రాష్ట్రాలు డిటెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి అవకాశమిస్తుంది. అయితే మొదటి పరీక్షలో విఫలమయిన విద్యార్థులకు రెండవ అవకాశంగా (సప్లిమెంటరీ పరీక్ష) ఒక పరీక్షను తప్పనిసరిగా నిర్వహించాలని ఈ సవరణలో పేర్కొంది. డిటెన్షన్ విధానం విద్యార్థులు మెరుగ్గా అభ్యసించటానికి, బోధకులు సమర్థవంతంగా బోధించడానికి ప్రోత్సాహకంగా ఏర్పాటు చేసినది. అలాంటి విధానం లేకుండా, హాజరు, నేర్చుకోవటం వంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండా, కేవలం పాఠశాలలో నమోదై కొనసాగటం ద్వారా గ్రేడ్‌లలో 9వ తరగతి వరకు వెళ్లిపోవచ్చు.

**స్వతంత్ర పరీక్షా సంస్థ**


ప్రస్తుతం, మంచి పాఠశాలలను గుర్తించడం తల్లిదండ్రులకు ఒక ప్రధాన సవాలుగా మారింది.


పాఠశాలలను మూడు కీలక ప్రమాణాలు –

1) నేర్చుకున్న ఫలితాలు

2) ఫీజు నిర్మాణం

3) మౌలిక వసతుల ఆధారంగా అంచనా వేసే ఒక స్వతంత్ర రేటింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేయటం ఈ సమస్యను పరిష్కరించగలదు. ఈ రేటింగ్‌లు, ర్యాంకింగ్‌లను ప్రజలకు అందుబాటులో ఉంచటం వల్ల పాఠశాల పనితీరును ప్రభావితం చేస్తాయి. పాఠశాలలు ఈ ప్రమాణాల్లో మెరుగుదల సాధించేందుకు ప్రోత్సాహకాలుగా అవి పనిచేస్తాయి. ఈ రకమైన రేటింగ్‌లను అందించటంలో




Telangana 10th class Report card

విఫలమైతే, తల్లిదండ్రులు తమ పిల్లలను ఆ సంస్థల్లో చేరదీయడానికి వెనుకాడే అవకాశం ఉంటుంది.

**పాఠశాలల సమీక్ష, సమీకరణ**

రాష్ట్రంలోని 4,992 పాఠశాలల్లో 10 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉండటం, 12,252 పాఠశాలల్లో 20 మంది కంటే తక్కువ విద్యార్థులు ఉండటం వల్ల ఈ పాఠశాలలు ఆర్థికంగా, విద్యాపరంగా మనుగడ సాగించటం కష్టంగా మారింది. చిన్న పాఠశాలలను విలీనం చేయటం ద్వారా, వనరులను సమర్థవంతంగా ఉపయోగించగలం. తద్వారా ఒక స్ఫూర్తిదాయక విద్యావాతావరణాన్ని సృష్టించవచ్చు. అందరికీ సులభంగా చేరుకోవడానికి, విద్యార్థులకు సైకిళ్లు అందించవచ్చు, రాష్ట్ర రోడ్డు రవాణా శాఖతో కలసి బస్సుల ద్వారా రవాణా సౌకర్యం కల్పించవచ్చు. ఈ రకమైన వ్యూహాత్మక మార్పులు ఆ ప్రాంతాల్లో ఆర్థిక సమర్థతను, విద్యాప్రమాణాలను మెరుగుపరుస్తాయి.

**విద్యావ్యవస్థలో నిజమైన మార్పుల ఆవశ్యకత**

ఇటీవలి సంవత్సరాలలో విద్యను మెరుగుపరచడానికి ఉపాధ్యాయుల సంఖ్యను పెంచటం, మరింత శిక్షణ, మెరుగైన మౌలిక సదుపాయాలు, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలను అందించటం వంటి చర్యలపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు దృష్టి సారించాయి. ఈ ప్రయత్నాలు ముఖ్యమైనవే అయినప్పటికీ, అవి ప్రధాన సమస్యను పరిష్కరించ లేకపోతున్నాయి. అసలు సమస్య అధ్వాన్న విద్యా ఫలితాలు. అదే విధానాలను కొనసాగించటం వల్ల మెరుగైన ఫలితాలు కనిపించవు. తెలుగు రాష్ట్రాలు విద్యను నిజంగా మెరుగుపరచాలంటే, విజయానికి నిర్వచనాన్ని మార్చాలి. సరైన నిర్వచనంతో సరిగ్గా కొలవాలి. ముఖ్యంగా బోర్డు పరీక్షలను విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను కాన్సెప్ట్ ఆధారితంగా అంచనా వేసేలా మార్చాలి. ❖





# దేశభక్తిని లక్ష్యసాధనకు వినియోగించండి

ఒక జాతి అంటే జెండా, గీతం, భరతమాత ఆరాధన అంటే చాలదని, అవి కొన్ని చిహ్నాలు మాత్రమేనని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక అనేక రంగాల్లో స్వయంసమృద్ధిని సాధించినా, అందరికీ ఎదిగే అవకాశాలను అందించటం, నివారించదగ్గ బాధలను తొలగించటంలో ఇప్పటికీ మనం సాధించాల్సింది చాలా ఉందన్నారు, దేశభక్తిని ఆరాధనగా కాకుండా ఆ లక్ష్య సాధన కోసం ఉపయోగించాలన్నారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ రామకృష్ణ మఠంలోని వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ నిర్వహించిన 'లవ్ ఇండియా - సర్వ్ ఇండియా' కార్యక్రమంలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశమంతటినీ కలిపే జాతీయతను పెంపొందించేందుకు అనేకమంది మహనీయులు కృషి చేశారని జేపీ అన్నారు. 'ఆఫ్ఘనిస్థాన్‌ను తీసుకోండి, చిన్న దేశం. ఒక మతం, ఒకటి రెండు భాషలు. అయినా ఒక జాతి అన్న భావం కలగదు, ఎవడి సొంత సైన్యం వాడికి ఉంటుంది, ఎవడు ఎప్పుడు ఎవడ్ని చంపుతాడో తెలియదు. గతంలో రువాండా, బురుండీలను చూడండి. లక్షలమంది ఒకరినొకరు తెగనరుక్కున్నారు. ఈవేళ యెమెన్‌ను చూడండి. ఈ తెగ, ఆ తెగ. మానవ నాగరికతకు పునాదులు వేసి వ్యవసాయానికి నాంది పలికిన ఇరాక్, సిరియా ప్రాంతాన్ని చూడండి. తన్నుకుంటున్నారు. ఇప్పుడు భారతదేశం గురించి ఆలోచించండి. ప్రపంచంలో ఇలాంటి దేశం లేదు. ఇన్ని కులాలు, మతాలు, ప్రాంతాలు, ఇంత వైవిధ్యం ఉన్న దేశాన్ని ఊహించటం కూడా కష్టం. అలాంటి దేశాన్ని ఆసేతుహిమాచలం ఏకం చేయటం ఒక గొప్ప కల. ఆ కలకి ఆధునిక యుగంలో శ్రీకారం చుట్టినవాళ్లలో గొప్ప మహనీయుడు వివేకానంద. దేశాన్ని కలపడమేకాక, జాతీయతకు అర్థానిచ్చారు. మనది మనం నిలుపుకుంటూ అందరినీ కలుపుకుపోవటం మన జాతీయత. అదే భారతీయతకు ఆలంబన. ఎన్నో మత సంప్రదాయాల్ని ఇముడ్చుకున్న మనమంతా ఒక్కటే అన్న భావం ఈ దేశంలో పూర్తిగా వేళ్లూనుకుంది. మరే దేశంలోనూ లేని విశిష్టత అది. దాన్ని కాపాడుకోవటం జాతీయత, దేశభక్తి. జంతువులకు భిన్నంగా సమాజంగా జీవించే శక్తి మనిషికి ఉంది. మనిషికి మాత్రమే ఇది సాధ్యం. వ్యక్తి తన ఔన్నత్యాన్ని, సమాజహితాన్ని సంధానించటమే ఆధ్యాత్మికత, దైవభక్తి, దేశభక్తి, జాతీయత, ఇంగితజ్ఞానం. పోటీ పరీక్షల కోసం సిద్ధమవుతున్న యువత ఈ లక్ష్యాన్ని గుర్తించి సాధన చేయాలి' అని జేపీ హితవు పలికారు. కార్యక్రమంలో రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, హ్యూమన్ ఎక్స్‌లెన్స్ సంస్థ అధ్యాపకులు, వాలంటీర్లు పాల్గొన్నారు. యువత అడిగిన పలు ప్రశ్నలకు జేపీ సమాధానాలిచ్చారు.





RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th SEPTEMBER, 2024 Posting Date 15 &16th of every month





ఫుడ్ బిజినెస్ చేసేవాళ్లు ట్యాక్స్ కడుతున్నారు,
రైతులు మాత్రం రుణమాఫీ కోరుతున్నారు .. ఎందుకింత అంతరం?

**Town Hall with JP**

Agriculture: From poverty to prosperity
https://www.youtube.com/@JPLoksattaOfficial

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS (TBZ), Hyderabad- 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**